# ప్రబుద్ధాంధ్ర

మాసపత్రిక

జూలై ౧౯౩౪

సంపాదకుడు

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

సంవత్సర చందా రూపాయి

విడిసంచిక రెండు అణాలు

౨ వ సంపుటం,   ౮ వ సంచిక

కలాభివర్ధనీ పరిషత్తు
రాజమండ్రి

# విషయసూచిక

# ప్రబుద్ధాంధ్ర

కళాభివర్ధనీపరిషత్తుపక్షమున ప్రకటింపబడు మాసపత్రిక

సంపాదకుడు:—శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

సంపుటము ౫ } రాజమహేంద్రవరము జూలై ౧౯-౩౮ { సంచిక ౭


## హిందీ వెల్లువ

సుబ్రహ్మణ్యశాస్త్రి:—సంపాదకుడు

ఇది యిప్పుడు తెనుగుదేశాన్ని ముంచెత్తేస్తోంది. అసలు దక్షిణదేశం మొత్తంమీదే దీని దురాక్రమణ యెక్కువగా వుంది; గాని తెనుగుదేశంలో చాలా యెక్కువ. హిందీపరీక్షలికి వెళ్ళే తెనుగువారి సంఖ్యలో తతిమ్మా అందరి సాముదాయికసంఖ్యా సగమేనా వుండదు. కలగాపులగపు పట్నాలమీద మాత్రమే పడి వూరుకుంటే దీన్ని లెక్కచేయవలసిన అవసరం అంతగా లేకపోవును. కాని జాతీయమైన తెనుగుభాషకి స్థానాలైన పల్లెటూళ్ళమీద కూడా యిది ప్రళయతాండవం చేస్తోంది. ప్రైమరీ కూడా పూర్తి కాని పల్లెటూరివారనేకులు హిందీలో పెద్దపెద్ద పరీక్షలిచ్చి పట్టాలు సంపాదించుకుని వున్నారు. తెనుగులో నాలుగు బంతులేనా ఉత్తరేఖనం సరిగా రాయలేని పల్లెపడుచులు కూడా హిందీపట్టభద్రురాళ్ళయి తెనుగుభాషకీ వాఙ్మయానికీ తీరని నష్టం కలిగిస్తున్నారు. ఇంతవరకూ ఆధునికాంధ్రయువతులు తెలుగుభాషలో పాండిత్యం సంపాదించనందుకూ, తెనుగులో గ్రంథాలు రచించి జాను తెనుగు నుద్ధరించనందుకూ విచారిస్తూ వుండగా వారిప్పుడు హిందీవ్యామోహంలో పడి తమ ఆంధ్రత్వాన్ని చంపుకుంటున్నారు. హిందీపుస్తకాలు కొనడంలోనూ, హిందీపత్రికలు తెప్పించడంలోనూ మొత్తానికి తెనుగువారు చూపుతూ వున్న వుత్సాహం హిందూస్థానీలకు గూడా వుండదేమో అనిపిస్తోంది. ఈవుపద్రవం చాలనట్టు ఆంధ్రపత్రిక తెనుగురచనలకే చాలని స్థలంలో హిందీవ్యాసాలను ప్రకటిస్తూ అదిరామే మనిపించుకుంటుందో మరి—దాన్ని అపారంగా ప్రకటిస్తోంది.

హిందూస్థానీలు తమ మాతృభాషను దక్షిణభారతీయులమీద వేసి రుద్దుతున్నారంటే అది వారి ఆత్మాశకు మాత్రమే నిదర్శనంగా వుండివుండును; కాని హిందీ అంటే మనవారు చూపిస్తూ వున్న భక్తికి పట్టపగ్గాలులేకుండా వున్నాయి. వార్తాపత్రికలు తిరగవేస్తే తెనుగుదేశంలో అయిదారు హిందీప్రేమీమండలు లేనా ప్రారంభం కాని రోజు కనబడదు. హిందీప్రచారకులు హిందీని తప్పకుండా—విధిగా నేర్చుకోవాలని మనవారికి పదిపన్నెండు చోట్లనైనా బోధ చెయ్యని రోజు లేదు. ఇది యింతటితో ఆగినా కొంత మేలే అనుకోవచ్చు;

కాని యీ ప్రచారకులు హిందీలోపడి కొట్టుకుపోతూ తెనుగుమీద ఔదాసీన్యమూ, నిరాదరణా, నిర్లక్ష్యమూ కనపరుస్తూ వాటిని హిందీని అభ్యసించేవారికి కూడా మప్పుతున్నారు. డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్యగారంతటివారే మొన్నటి మెయి నెలలో వొకనాడు

“కాకపోయినా యిప్పుడు తెనుగుపత్రికలు విపరీతంగా పెరిగిపోతున్నాయి”

“మరే పత్రికలు కావాలండి మనకి?”

“హిందీపత్రికలు”

అని ఝాంకారంగా చెప్పినప్పుడు ఇక సామాన్యప్రచారకుల సంగతి చెప్పడాని కేం వుందీ?

ఇంతకీ హిందీని సామాన్యభాషగా స్వీకరించాలంటే, దేశంలో ప్రస్తుతం యీ సామాన్యభాష యొక్క ప్రసక్తి యెంతవరకు? సామాన్యభాష అనగానే దానికి చాలా స్థలాల్లో ప్రవేశం వుండదనీ, సామాన్యవిషయాల్లోనే దాని అవసరం అని స్పష్టపడుతోంది. దేశీయుల నిత్యజీవితంలో దానికి స్థానం లేదు. అంచేత దేశీయుల మాతృభాషకి కంటే దానికి నిమ్నపదవే గాని ఉచ్చపదవి యెంత మాత్రమూ లేదు. ఆకాస్త సామాన్యభాషావసరం వున్నవారైనా వేయింటి కొకరేనా వుంటారో వుండరో. అలాంటి భాషకి యింతప్రచారమూ, యింత కుమ్మక్కూ యెందుకూ?

ఎంత కుగ్రామంలో—తెనుగు తప్ప మరే భాషా చెవికి కూడా తట్టని యెంత పల్లెలో నేనా సరే సభ జరిగిందంటే అక్కడ అధమపక్షం దైవప్రార్థన అయినా హిందీలో చెయ్యడం, ఎలాంటి సంస్థకి వార్షికోత్సవం జరిగినా అందులో వొక హిందీనాటకమో, చివరి కందులో వొక భాగమో ఆడడం, ప్రతీసభలోనూ హిందీలో గూడా కొందరు మాట్లాడడం, వొక గ్రంథాలయం వుందంటే అందులో తెనుగు గ్రంథాల స్థానాన్ని హిందీగ్రంథాల కివ్వడం, హిందీపుస్తకాలను డబ్బిచ్చి కొని తెనుగుపుస్తకాలను ఉచితంగా యిమ్మని ప్రకటనకర్తలను పీడించడం, తెనుగుభాషను బోధించడానికి తగినంత మంది పండితు లున్నా లేకపోయినా ప్రతీపాఠశాలలోనూ హిందీబోధకుణ్ణి ఏర్పరచడం, తెనుగుపండితులకికంటే హిందీప్రచారకులకు పెద్ద జీతా లివ్వడం, ప్రైమరీస్కూళ్లలో గూడా హిందీని ప్రవేశపెట్టడం,—ఇదంతా సామాన్యభాష అయిన హిందీకి తెనుగుదేశంలో జరగవలసిన మర్యాదేనా!

వాస్తవంగా హిందీని ప్రోత్సహిస్తూ వున్న ఆంధ్రప్రముఖులు ఈసంగతు లేమేనా యోచించారా? గాంధీగారు హిందీ నేర్చుకోమన్నా రంటే వారికేం అనక? తెను గెలా పోతే వారి కేమి?

అనేకప్రాంతీయభాషలు కల హిందూదేశంలో సామాన్యభాషయొక్క ఆవశ్యకం కలిగిందంటే దానంతట అదే అవగతం అవుతుంది ప్రజలకి. అప్పుడు దేనికి ఆపదవి రావడానికి అవకాశా లున్నాయో దానికే వస్తుంది. ఎవరెవరు ఆభాషతో పనిగలవా రుంటారో వారంతట వారే దాన్ని నేర్చుకుంటారు. నేర్చుకుని తీరతారు. అప్పుడు అలాంటి వారికి సౌకర్యాలు కలిగించడమే ప్రముఖుల పని గాని యిలాగ ఆత్మహత్య చేసుకోవలసిన అవసరం యేం వుంటుందీ?

ప్రభుత్వంవారు ఇంగ్లీషుభాషకి అలాంటి పదవి కలిగించాలని అధికారరీత్యా ప్రయత్నాలు చేస్తున్నారు; కనక దేశీయమైన హిందీకి యిలాంటి ప్రోత్సాహం చెయ్యడం అవసరం అంటారా? ఇది చాలా దుర్బలవాదం. ఏమంటే? మనం సకలవ్యవహారాలూ ఇంగ్లీషులోనే నెరవేర్చుకోవాలని దొరతనంవారు మనల్ని నిర్బంధపెట్టడం లేదు. ఇంగ్లీషు మన జనసామాన్యాని కేలాగా అందుబాటు కాదు. మన యునివర్సిటీల విద్యావిధానంలో వున్న కాఠిన్యాన్ని చూస్తే దొరతనంవారికి అలాంటి వుద్దేశం వుందని చెప్పడానికి కూడా అవకాశాలు కన

Telugu Hindi Telugu



పడవు. వున్నా మరో భాషని ఏర్పరుచుకోడానికి మనకి అధికారమూ, అవకాశాలూ లేకపోలేదు. మనం యెన్ని తికమకలు పడి హిందీని నెత్తిమీద పెట్టుకున్నా ఇంగ్లీషుకి ఇప్పుడు ఖుక్తం అవుతూ వున్న పదవి రాజ్యాంగవిధానంలో మార్పు సూచింపబడితే గాని హిందీకి రాదు. అంతవరకూ యీ హిందీవల్ల మన నెత్తికొచ్చే బరువే తప్ప ఏకో ప్రయోజనం కలగదు.

ఇలాంటి సంగతు లెన్నో యోచించుకోవలసి వుండగా మనవారు ఇలాగ అక్రమ—వక్ర—ప్రయత్నాలు చెయ్యడం యెందుకో బోధపడదు. ఏం చేస్తున్నారూ అంటే చూడండి.

౧

మనవారు హిందీపాఠశాలల్లో హిందీ తప్ప మరే యితరభాషా మాట్లాడగూడదుట.

"సోదరులారా! ఈ హిందీకుటీరమునందు యెవరును యెప్పుడును హిందీయే తప్ప మరి యేయితర భాషయు మాట్లాడగూడదు. అట్లు మాట్లాడవలసినప్పుడు లోపల కాక అరుగుమీద మాట్లాడునట్లుగా యీ కుటీరమువారు కోరుచున్నారు.

ఇట్లు

హిందీకుటీరము, సోదరులు.

ఈ హిందీకుటీరము (రామచంద్రపురం తాలూకా) వెదురుపాక గ్రామంలోది. ఇప్పుడు వుందో లేదో చెప్పలేను. ౩—౧౨—౨౩ తేదీన ఆ గ్రామం వెళ్ళినపుడు ఈ ఆజ్ఞాఫలకం చూడటం తటస్థించింది. అప్పు డక్కడ శ్రీమాన్ కొమాండూరి గోవింద రాజాచార్యులుగారు హిందీప్రచారకులుగా వుండేవారు.

౨

తెనుగుదేశంలో హిందీప్రచారం చేస్తున్నవారి వుద్దేశం మన తెనుగువారు హిందీ నేర్చుకోడం మట్టుకే గాదు. మనవారు తెనుగును విడిచిపెట్టేసి హిందీనే వ్యావహారికభాషగా స్వీకరించాలిట. చూడండి.

"తణుకు. నవం ౨౧:—తణుకులో హిందీభాషాభిమానులు సభ చేసిరి. పీసపాటి సుబ్బారావుగారుపన్యసించిరి. దక్షిణదేశములోనివారు హిందీభాషను కేవలము గ్రాంధికముగా వాడుచున్నారే; గాని వ్యావహారిక భాషగ నలవరచుకొనుట లేదని చెప్పుచున్నారు. డిశంబరు ౧౧వ తేదీని తణుకులో హిందీసాహిత్య సమ్మేళనము........"

ఇది ఫ్రీప్రెస్సు వార్త ౨౮-౧౧-౩౭ తేదీ ఆంధ్రపత్రికలో పన్నెండో పేజీ ఆరో కాలంలో పడింది.

౪౮ గంటల లామెంబరు

ఇలాగ యీ హిందీప్రచారకులు, దాక్షిణాత్యులు తమతమ మాతృభాషలను విడిచిపెట్టేసి, మరిచిపోయి హిందీలోనే సర్వవ్యవహారాలూ జరుపుకొనేటట్టు చెయ్యడానికి చాలా కృషి చేస్తున్నారు. ఇందుకోసం వుపన్యాసాలు చేస్తున్నారు. పత్రికలు ప్రచురిస్తున్నారు. పాఠాలు చెబుతున్నారు. దేశభాషలు జాతీయతకి అడ్డువస్తున్నా యని నిరసిస్తున్నారు. వీరి వుద్దేశం యిదే అనడానికి సాక్ష్యం కావలస్తే ౪౮ గంటల లామెంబరు టి. ఆర్. వేంకటరామశాస్త్రిగా రేం చెప్పారో వినండి.

"మద్రాస్, మే ౧౧:—..............అధ్యక్షులు (శాస్త్రిగారు) చెన్నపురి పౌరుల పక్షమున యాత్రికులకు స్వాగత మొసగుచు ఉత్తరదేశసంచారమున వార లొనర్చిన ప్రచారమును నుతించిరి. భారతవర్షమున రాష్ట్రభాష కాగలిగిన భాష యేదేని యుండినచో అయ్యది హిందీభాషయే యనిరి. పల్లెలందును, గ్రామసీమలలోను సామాన్యజను లెల్లరును హిందీభాష నభ్యసించి, హిందీయందే సర్వవ్యవహారములును జరుపుకొనుటయు, కోర్టులు మొదలగువానియందు రాజకీయభాషగా నేర్పడుటయు యిరువది ముప్పది సంవత్సరములలోగా జరుగ గల దని తాము విశ్వసింపజాల మనియు, కాని ఎన్నటి కేని స్వపరిపాలనమునం దైనను సా

మాన్యభాషగ వ్యవహరింపబడుటకు హిందీభాషకే అవకాశము కల దనియు పలికిరి.”

౧౧-౫-౩౮ ఆంధ్రపత్రిక. అయిదో పేజీ, మూడో కాలం.

3

భారతదేశభాష లన్నిటిలోనూ హిందీ చాలా పెద్ద దనీ—అంటే విశేషవ్యాప్తి కల దనీ, అంచేత భారతదేశంలో సామాన్యభాష కావడానికి దానికే అర్హత వుం దనీ—ఇదొక వాదం. అయితే దీల్లో కొంత నిజం లేకపోలేదు; కాని అంత మాత్రాన మనలో ప్రతీవాడూ దాన్ని నెత్తెంచుకుని వూరేగవలసిన పని లేదు. ప్రతీదేశంలోనూ కూడా సామాన్యభాషయొక్క వ్యాప్తి చాలా స్వల్పంగా వుంటుం దనీ, దాని అవసరం వుండేవారు చాలా చాలా కొద్దిమంది వుంటా రనీ పైని తెలిపివున్నాను. దాని అవసరం వుండేవా రేనా తమకు జన్మజన్మాల నుంచీ పోషించుకుంటూ వస్తూ వున్న మాతృభాష వేరే వుం దనీ, తమ అభ్యుదయమూ, ముక్తీ దానిలోనే వున్నా యనీ, ప్రపంచకంలో యేభాషేనా తమకు దాని తరవాతిదే అనీ, దాని సరసని నుంచో డాని కేనా వాటి కర్హత లే దనీ, దానికంటే పరభాషని అధికంగా పూజించడం మాతృద్రోహ మనీ భావించడమూ, సామాన్యభాష అవసరం వచ్చినప్పుడు మాత్రమే దాన్ని స్మరించడమూ—ఇది సభ్యదేశాలలోనూ, సభ్యజాతులలోనూ వుండే మర్యాద. ఇది యిలా వుండగా నిత్యానుభవంలో వుండడంవల్ల మాతృభాషలో వుండే మాధుర్యమూ జాతీయతా, శబ్దశక్తీ, పదప్రయోజనమూ, సార్థక్యమూ అప్రయత్నంగా తెలిసినంతవర కేనా, పరభాషలో యెంత కృషి చేసినా యెలాంటివాడికి కూడా కొంతవర కేనా బోధపడవు. ఇలాంటి స్థితిలో ఇవాళే మొదలుపెట్టి రెండు పుంజీల మాటలు—గాంధిగారు చెప్పడంవల్ల హిందీ నేర్చుకుని పారవశ్యం పొంది వోహోహో అని దాన్ని ఆకాశానికి యెత్తివెయ్యడం తనకి సొంత భాషవొకటి వున్న పెద్దమనిషి చెయ్యవలసిన పని కాదు.

చూడండి, నాటకాలకు హిందీతప్ప మరోభాష పనికిరాదుట.

“చెన్నపురిలోను తదితరప్రదేశము అందును, హిందీభాషలో నాటకము లాడబడుచుండుట మిగుల ప్రోత్సాహకరము. ఇట్టి యేర్పాటులు హిందీభాషావ్యాప్తికై విశేషముగ తోడ్పడగలవు. దక్షిణహిందీప్రచారసభవారు గతశనివారమునాడు చెన్నపురిలో విక్టోరియాపురమందిరమున ప్రదర్శించిన వీర్ అభిమన్యునాటకము నటనాకౌశల్యమును ప్రదర్శించుటయు కాక అధ్యక్షత వహించిన రా. బ. సంబంధమొదలిగారు తెలిపినటుల నాటకప్రదర్శనమునకు హిందీభాష ఉపయోగపడునంత బాగుగ మరియొక భాష యుపయోగింప దను సత్యమును పరిస్ఫుటము గావించెను.”

ఇది ఆంధ్రపత్రిక సంపాదకీయం. ౧౭-౮-౩౮ తేదీ ఆంధ్రపత్రికలో ఆరో పేజీ, ఆరో కాలంలో స్ఫుటంగా ముద్రించబడింది.

హిందీ విశేషవ్యాప్తి కలదే కావచ్చు; కాని హిందూదేశభాషలో దానికి ఉత్తమపదవి లేదు. తెనుగు హిందూదేశభాషల్లో మూడోదైనా మధురమైన దని ప్రఖ్యాతి పొందింది. అనేకభాషల అంతు తెలుసుకున్న శ్రీకృష్ణరాయడు “దేశభాష లందు తెలుగు లెస్స” అన్నాడు. దీన్ని ఆత్మస్తుతి కింద జమకట్టినా ప్రపంచంలో వున్న భాషల నన్నిటినీ పరిశీలించిన పాశ్చాత్యులు తెనుగును “Italian of the East” అన్నారు. ఇలాంటి సందర్భంలో, ఆ తెనుగు మాతృభాషగా (బాధ్యత కూడా) గల పెద్దమనిషి మనకి ఏకైకదినపత్రిక అయిన ఆంధ్రపత్రికలో—అందులోనూ సంపాదకీయంలో యిలాంటి భావం ప్రకటించడం కంటే ఆత్మహత్య వేరేం వుందీ? నిజంగా మన తెనుగు

లోకాబట్టి యిలాంటి రాత చెల్లిపోయింది; కాని మరో భాషలో అయితే యెంత రగడ పెరిగి వుండునో? ౪

హిందీప్రచారం చేస్తూ వున్న మనవారి వుద్దేశాలిలా వుండగా ఈప్రచారకులను అదుపు ఆజ్ఞలలో వుంచడానికి యిక్కడికి వచ్చి పనిచేస్తూవున్న హిందూస్థానీలు దక్షిణదేశభాషలను చంపేసి హిందీనే యిక్కడ స్థాపించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈవిషయంలో ఇంగ్లీషుకీ హిందీకీ చాలా భేదం వుంది. దొరతనంవారికి దేశభాషలవిషయంలో యిలాంటి వుద్దేశం కనపడదు. వారు ఇంగ్లీషుకి ప్రాముఖ్యం యిచ్చారంటే వారి వుద్దేశం యేమయినా చాలాకాలం నుంచి అది పనికిరాదని మనం ఆక్షేపిస్తున్నాం. అయినా హిందూదేశభాషలు ఇప్పటి అభివృద్ధి పొందడానికి కారణం దొరతనమూ, అంతకంటే అధికంగా ఆంగ్లభాషానూ. అయినా ఇంగ్లీషు మనకి భావదాస్యం కలిగించిందని దేవుళ్లాడుతూనే వున్నాం; కాని హిందీని ప్రజలే నెత్తి కెక్కించుకుంటున్నారు కనక యిదే సందని హిందూస్థానీలు దక్షిణదేశభాషల పీకలు నులిమివెయ్యడానికి ప్రయత్నిస్తున్నారు. మనవారు కూడా దానికి చాలా తోడ్పడుతున్నారు. ఈనివేదిక చూడండి.

“బెజవాడ. ఆగస్టు ౫:—పై సభవారి సభ ౪-౭-33 వుదయం జరిగిన తరువాత సాయంత్రం సబ్జక్టుకమిటీ జరిగి ౭ తీర్మానములు జరిగెను. తిర్గి ౬-౭-33 తేది వుదయం ౭ గంటలకు శ్రీరామరాంబామల్లేశ్వరగ్రంథాలయభవనమునందు శ్రీమతి దుర్గాబాయమ్మగారి అధ్యక్షతను సమావేశమయి యీక్రింది తీర్మానములు చేయబడెను. వుపన్యాసము లన్నియు హిందీలోనే జరిగెను. మొదట కీర్తిశేషు లగు సేన్‌గుప్తాగారి మరణమునకు విచారమును తెల్పుచు వారి ఆత్మకు శాంతి కలుగుగాక యని కోరుచూ తీర్మానించిరి. ప్రతిచోటను హిందీప్రేమమండలీలు యేర్పరిచి దానిద్వారా హిందీప్రచారము విరివిగా జేయించవలెననియు, హిందీ పుస్తక భాండాగారములు ప్రతి చోటను నిర్మించవలె ననియు, జిల్లాబోర్డులు మునిసిపాలిటీలు వారి పాలనలో వున్న విద్యాలయముల యందు హిందీని నేర్పుచున్నందులకు వారి నభినందించిన తీర్మానమున్ను, దత్తమండలములలో హిందీప్రచారము బాగా సాగించవలె ననియు, ఒక స్త్రీ ప్రచారకురాలిని బెజవాడ పరిసరములకు నియమించవలె ననియున్నూ, ఆంధ్రరాష్ట్రమునకు ప్రత్యేకహిందీశాఖను దక్షిణభారత హిందీప్రచారక సమితినుంచి విడదీయవలె ననియు, అందుకు గాను ఒక మీటింగు ప్రత్యేకముగ పిలువవలె ననియు, దానికి కన్వీనర్లుగా కార్యదర్శు లగు బాలచంద్రఆప్టే పీసపాటి వెంకటసుబ్బారావుగార్లను యేర్పాటు చేసిరి. మరియొక తీర్మానము. యిప్పుడు ప్రచారములో వున్న హిందీవ్యాపకము తృప్తికరముగా లేదనియు, దానిని మార్చి వృత్తివిద్యలుగా యేర్పరిచి అన్నివృత్తులకు వాటివాటికి తగినట్లు హిందీవిద్యావ్యాపకము చేయవలె నని బాలచంద్రఆప్టేగారు తెచ్చిన తీర్మానమును శ్రీయుత దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావుపంతులుగారు యీతీర్మానమువల్ల యేమీ వుపయోగము లేదనియు, హిందీ తప్ప రెండవ భాష లేకుండా యుండే యెడల సంతోషించు వారలలో నేనొకడ ననియు, ప్రస్తుతం మన స్వభాష యగు తెనుగే సరిగా రాని మనకు యీతీర్మానం ప్రకారం విద్య నభ్యసింపజేయ ప్రస్తుతము వీలు లేదనియు, దీనికి కొంత కాలము పోతేనే గాని వీలు లేదనియు అందువల్ల యీ తీర్మానం నిరుపయోగ మయినదనియు, ఆచరణ లేని తీర్మానములు చేయుట మంచిది కాదనియు సెల విచ్చిన మీదట వుపసాదకులచే తీర్మానము వుపసంహరించు కొనబడెను”

ఇది ఆంధ్రపత్రిక ప్రత్యేకవిలేఖరి నివేదిక. ఇది ౫—౫—33 తేదీని ఆపత్రికలో నాలుగో పేజీ, మొదటి కాలంలో పడింది.

ఇందులో వుదహరించబడ్డ ప్రతీ తీర్మానమూ మన తెనుగుభాషకి గొడ్డలిపెట్టుగా వున్నాయి. సరే, యిక బాలచంద్ర ఆప్టేగారి తీర్మానము సర్వాపహరణమే పడుతోంది. అయితే దక్షిణదేశ భాషలను సంహరించి వెయ్యడానికే యీ తెనుగు గడ్డకి వచ్చిన ఆప్టేగారికి అంతకంటే మంచి వుద్దేశాలు పుట్టకపోవడంలో ఆశ్చర్యం లేదు; కాని మన నాగేశ్వరరావుపంతులుగారి మాట యేం చెప్పగలము? ఆంధ్రుడైనవాడు—తత్రాపి ఐశ్వర్యవంతుడైన పెద్దమనిషి ఆంధ్రభాషా వాఙ్మయాల విషయంలో పూనవలసిన — పూనితీరవలసిన బాధ్యతల నన్నిటినీ యిచ్ఛాపూర్వకంగా స్వీకరించినవారు పంతులుగారు. ఇవాళ పంతులుగారు ఆంధ్రపత్రికను నిలిపివేస్తే ఆంధ్రదేశం అంధకార బంధురం అయిపోతుంది. భారతిని నిలిపివేస్తే ఆధునికాంధ్రవాఙ్మయ నిర్మాత లనేకులు నిరాశోపహతులైపోతారు. ఆంధ్ర గ్రంథమాలను విరమిస్తే గొప్పగ్రంథా లనేకాలు అంధకారంలోనే వుండిపోతాయి. ఆంధ్రవిజ్ఞాన సర్వస్వాన్ని కట్టిపెట్టేస్తే ఆంధ్రవిజ్ఞానం —ఇప్పుడిప్పుడే కొంచెకొంచెం రేకెత్తగలుగుతూ వున్న ఆంధ్రవిజ్ఞానం కొండలోయలో కప్పడిపోతుంది. పంతులుగారు చేతిని ముడుచుకుంటే జాతికి ఇంకా యింకా అనేకనష్టాలూ వుపద్రవాలూ సంభవిస్తాయి. అయితే ఈపత్రికలవల్లా, యీగ్రంథమాలవల్లా, యీసర్వస్వంవల్లా, యీ ఆంధ్రజాతివల్లావారు కష్టపడుతున్నారు; గాని సుఖపడడం లేదు. నష్టం పొందుతున్నారు; గాని లాభం తినడం లేదు. అయినా వారు యీ కష్టంలోనే సౌఖ్యాన్ని, యీనష్టంలోనే ఆనందాన్ని, మే లెరగని యీ జాతిని జూసే పారవశ్యాన్ని పొందుతున్నారు. ఆంధ్రజాతి అంటే, ఆంధ్రదేశం అంటే, ఆంధ్రభాషావాఙ్మయా లంటే ఇలాగ అపూర్వ—అసమాన—అనంత—ఉద్రేకంతో స్వహస్త పరహస్తాలతో నవీనసృష్టి చేస్తూ వున్న నాగేశ్వరరావు పంతులుగారు “దేశ మంతయు హిందీ తప్ప రెండవభాష లేకుండా యుండే యెడల సంతోషించువారలలో నే నొకడ” నని హిందీకి అక్రమమైన ఉల్బణం కలిగించే సభలో ఘంటాఘోషంగా చెప్పడం కంటే వాస్తవంగా విచారకరమైన సంగతి మరొకటి లేదు. పంతులుగారు నిజంగా ఆంధ్రోద్బోధన ప్రయత్నాలలో నిష్ఫలు లయిపోయారా? నిర్వేదం పొందారా? ఆంధ్రభాషలో వారికి జీవం కనపడలేదా? యుగయుగాలనుంచి అనేకక్లిష్టపరిస్థితులను తప్పించుకొని తన అమృతమూర్తిని మహాపర్వతశిఖరంమీద ప్రదర్శించగలుగుతూ వున్న తెనుగంటే యీవైముఖ్యం వారి కెందుకు కలిగిందీ?

మనకి స్వస్వరూపజ్ఞానం లేకపోవడంవల్ల కలిగే చిక్కులివన్నీనీ. ఇతర్ల అడుగుల్లో అడుగులు వేసే దురలవాటువల్ల వస్తూవున్న వుపద్రవా లివన్నీనీ. గాంధిగారు భారతీయుల కందరికీ యిప్పుడు సామాన్యభాష వొకటి అవసరం అన్నారు. అది హిందీయే అన్నారు. అందరూ అది నేర్చుకోవాలన్నారు. ఈదివ్యబోధమీద కాంగ్రెస్సు ముద్ర వేయించారు. ఇక యిది అందరిమీదా—ప్రత్యేకంగా మన తెనుగుదేశంమీద విరుచుకుపడిపోయింది.

౫

కాని ఆంధ్రజాతిని పరీక్షించి చూడండి. హిందీని నేర్చుకోకపోతే అది నశించిపోదు. బుద్ధిబలం వుంటే, మౌలికత్వం వుంటే ఆంధ్రజాతి యిప్పుడు ఈపునరున్నతి ప్రయత్నంలో తన వంతు పని చెయ్యలేకపోలేదు. కాని హిందీ మన బుద్ధికి వేరుపురుగవుతోంది. మన మౌలికత్వాన్ని భ్రష్టం చేసేస్తోంది. ఇదివరకు మనలో ఆంగ్లమానసపుత్రులు మాత్రమే వుండేవారు. ఇప్పుడు హిందిమానసపుత్రులు దేశం నిండిపోతున్నారు. చూడండి.

"సాంధ్యవ్వ. జూన్ ౧౨ ది ౧౧-౬-౧౯౩౮ సం॥రం తారీఖున పగలు ౧ ఘంటకు శ్రీరామ సుబ్బ రాజేంద్ర గ్రంథాలయ భవనమునందు దక్షిణభారత హిందీప్రచారక ఆంధ్రశాఖామంత్రి శ్రీ పీసపాటి వెంకటసుబ్బారావుగారి అధ్యక్షతను బహిరంగసభ జరుపబడెను...........తదనంతరం అధ్యక్షులు హిందీభాషావశ్యకతను గురించి తెలుగు హిందీ భాషలయందు అనర్గళ ధారాప్రవాహమున ఉపన్య సించుచు హిందీ మన ప్రాచీనభాష యనియు పూర్వకాలమున వాల్మీకాది మహాఋషులు శ్రీరామ శ్రీకృష్ణులు మాటలాడు భాష హిందీయే అనుటకు అనేక నిదర్శనము లున్నవనియు నాటినుండి నేటి వరకు అయోధ్య గోకులబృందావనమందు వసించు ప్రజ లందరు హిందీయే మాతృభాష యనియు ఆంధ్రు లందరికి పవిత్రస్థలములగు అయోధ్య ప్రయాగ కాశీ గయ మొదలగు పుణ్యక్షేత్రములును గంగ యమున సరస్వతి మొదలుగాగల నదీజలం బులును దర్శించి జలకమాడి తరింప నుద్దేశ్యము గలవా రందరు హిందీభాష రాని కారణమున అచ్చటి ప్రజల భావములను తెలిసికొన గుతూహల ముండియు తెలిసికొనజాలక నిరాశ జెందుచున్నా రనియు దేశీయ మహాజనసభావేదికపై చర్చించు ప్రతి విషయము ఇకముందు హిందీలోనే జరుప బడును గాన తప్పక హిందీ నేర్చుకొనుట చాల అవసరమనియు హిందీ నేర్చుకొనుట కగునంత తక్కువ వ్యయము లను స్వయంకృషివల్లను మరే యితరభాష నేర్చుకొనజాల మనియు నిదియును గాక హిందీ రానివా రెవరును నేను హిందువునని గాని భరతఖండవాసుడ నని గాని చెప్పుకొనుటకు హక్కు లేదనియు మొదలుగాగల అనేక ఉప మాన ఉపమేయములతో మృదుమధురశైలిని సభవా రందరు ఆనందవారిధి మునుంగునట్లు సుమారు ౨ ఘంటలసే పుపన్యసించుటయేగాక"—ఆంధ్ర పత్రిక (౨౦-౬-౩౮) మూడోపేజీ, నాలుగోకాలం.

దీన్ని వేలకొద్దీ తెనుగువారు చూసి వుంటారు. ఇది చదివినప్పుడు వారి మానసికప్రవృత్తు లెలా పని చేశాయో నేను చెప్పలేను; గాని సుబ్బారావు గారి ధైర్యసాహసాల అంతు తెలుసుకోవడం అసాధారణ విషయంగా కనపడుతోంది. వాస వంగా ఆంధ్రు డెనవాడు ఇలా చెప్పడానికి అసా ధారణ పరిస్థితు లేవో యేర్పడివుండాలి. దీన్ని బట్టి చూస్తే హిందీ, ఆంధ్రుల్లో యెటువంటి భావాలను, యెలాంటి సంకల్పాలను, యెంతటి త్రిలోకవిజ యిత్వయోగ్యతను కలిగిస్తోందో బోధపడగలదు.

ఇంకేం కావాలీ? హిందీవల్ల ఆంధ్రభాషకి, ఆంధ్రజాతికి యెంత అపకారం—ద్రోహం కలుగు తోందో వేరే చెప్పడం యెందుకూ? ఆంధ్రప్ర ముఖు లేం చేస్తున్నారూ? సామాన్యభాష అనే పేర హిందీని నెత్తి కెక్కించుకుని మనం ఆత్మ హత్య చేసుకోవలసిందేనా? ప్రపంచకంలో యెక్క డేనా సామాన్యభాషకోసం యింత హైరాణపడ్డా యీ తెగ వుందా? ఇలాంటి తెగవల్ల యేమేనా పని కొనసాగుతుందా? ఇలాంటి తెగకు సామాన్య భాషయొక్క అవశ్యకం యేమేనా వుంటుందా?

ఇంతకీ: హిందీవిషయంలో యింకో చిక్కు కని పెట్టుకుని వుంది. మాహమ్మదీయులు మనదేశానికి హిందీని సామాన్యభాషగా అంగీకరించడం లేదు. వారు వుర్దూ కావా లంటున్నారు. పైగా సామా న్యభాషకి లిపి దేవనాగరి కాక పార్శీ కావా లని కూడా అంటున్నారు. ఇలాగ యీతగువు యింకా పరిష్కారం కాలేదు. ఇది సులభంగా—అంటే మాటలతో తేలేది కూడా కాదు. ఇలాంటి స్థితిలో మన తెనుగువారు యీ హిందీవ్యామోహంలో పడి దేవుళ్లాడడం యేం వివేకమూ? మన భాష యిం కా నవీనావసరాలకు తగినట్లు సంస్కరించబడలేదు. నవీనవిజ్ఞానమూ, నవీనసభ్యతా కలిగించే వాఙ్మయం కూడా మనకి ఇంకా తయారు కాలేదు. మన కివి అవసరం కాని హిందీ యెంతమాత్రమూ కాదు. మన వాఙ్మయాన్ని సర్వాంగసుందరంగా దిద్దు కోనంతసేపు మనం హిందీని ఎంత నేర్చుకుంటు న్నామో జాతీయతకి అంతదూరం పోతాము. నలుగురిలోనూ అంత హాస్యాస్పదులం కూడా అయి పోతాం. కనక తెనుగువారు దూరాలోచన చేసి హిందీని హద్దులో వుంచ గోరుతున్నాను.

# పంతులు: ఉద్యోగం

మొదలి వేంకటసుబ్రహ్మణ్యశర్మగారు బి. ఏ., బి. యిడి

ఆయన ఒక ఉద్యోగి కొంతకాలము క్రిందట. ఇప్పుడు కూడా ఉద్యోగం లేకపోలేదు. ఆపాదమస్తకం ఉద్యోగివాసనలు బయలువెడలుతున్నవి. ఉద్యోగమునందు అరితేరి బట్టతల అయింది ఆయన తల. అజ్ఞలిచ్చిన పనిలో కొంత పాల్గొని, ఆజ్ఞాగ్నిని సూచించే నిశ్వాశాల వేడికి తెల్లవారినవి ఆయన మీసాలు. అదే కారణంవల్ల అలిసి, వడలి విశ్రాంతి తీసుకుంటున్నవి ఆయన దవడలు. ఉద్యోగపు వాంఛ తీరింది కాబోలు సెలవు పుచ్చుకున్నవి ఆయన పండ్లు.

ఇంకా ఉద్యోగమే. ఇంకా ఉద్యోగపు వాంఛ తీరలేదు ఆయన మిగిలిన దేహానికి. అది విసుగు లేకుండా ఉద్యోగపు చిహ్నాలు ధరిస్తుంది. కోటు గాని, కోటుపై వల్లెవాటు గాని, ధోవతి మడుపుల చాటున మేజోళ్లుగాని అన్నిటినీ మించిన తలగుడ్డగాని లేకపోవడం భరించలేదా ఉద్యోగవాంఛ. నియమవిపరీతం గాకుండా ముఖక్షౌరము, బట్టతలపైన తలగుడ్డలను అపరిమితంగా ప్రేమించింది అది. ఇహ ఆయన ఉద్యోగగౌరవానికేమి లోటు?

ఆయన పూర్వచరిత్ర, ఉద్యోగపు వెలుగు నీడలలో దాగుకొన్నది. ఆయన పూర్వీకుల చరిత్ర కాలపు జాడలలో నలిగి నలిగి ఇగిరిపోయింది. ఆయన వంశచరిత్ర ఆయన ఉద్యోగపు కాంతుల చేత తటుమబడి మారుమూలల్లో నక్కి దాగుడుమూతలాడుతున్నది.

ఆయన ధనవంతుడు. ధనదేవత ఉద్యోగాన్నే ఆశ్రయించిందా రోజుల్లో. ఇహ అయన్ను వరించడంలో ఆశ్చర్యము ఏమిటీ?

కాని ఒక సందేహం అక్కడక్కడ ఆపట్నంలో తొంగి చూస్తున్నది. "ఆయన ధనాన్ని ఆర్జించాడా? ధనం ఆయన్ను ఆర్జించిందా?" ఈప్రశ్నమీద భేదాభిప్రాయాలు చాలా ఉన్నవి. ధనమే ధనాన్ని ఆర్జించింది అని, ఆయనే ధనాన్ని ఆర్జించాడనీ, కాదు ఆయన అదృష్టదేవత ఆర్జించిందా ధనమనీ, ధన మక్కడనే ఉన్నది, ఆయన త్రోవన పోతూ నాది అన్నాడు, కొన్నాళ్లు ఆయనదే ననీ, ఆధనమునకు ఆయన ధర్మాధికారి అనీ, ధనమే ఆయన్ను ఆర్జించిందనీ, ఆర్జించడమే కాదు ఆయన్ని సేవకుడిగా చేసుకుందనీ పలువిధములైన అభిప్రాయాలు రహస్యంగా ప్రచారం అవుతున్నవి. ఒక్కటీ బయలు పడలేదు. ఇందులో ఏది గెలిచేదీ చెప్పడం కష్టము.

దానిమీద మరియొక ప్రశ్న. ఉద్యోగం చేస్తున్నది ఆయనా? ధనమా? అని. ఈప్రశ్నకు సమాధానం మొదటి దానిమీద ఆధారపడి ఉన్నదనే కారణంవల్ల త్రోశివేశారు.

కాని ప్రశ్న నిలిచే ఉంది.

పక్షులు గూళ్లలో కూర్చొని ధనమా రాజ్యం చేయడం? అని ధ్వనిచేస్తున్నయి. మీప్రపంచమే మీకా? మనుష్యలోకంలో ధనం రాజ్యం చేస్తున్న సంగతి మీకేం తెలుసునని గాలులు ఊదుతున్నవి. ఆశ్చర్యపడుతున్నవి పక్షులు.

ఆయనే ఒక ధనం. పట్నంలో ఉండే ధర్మసంస్థలన్నీ ఆయన్ను పొందినవి. అందువల్ల దేవుడికి దగ్గర అయినవి. దేవుడే ఆయన్ను పొంది ధనవంతుడైనాడని—ఆయన ముఖతహా కాకపోయినా—వినబడుతున్నది.

ఆయన లేని సంస్థ లేదు. ప్రతిదాన్ని ఆయన పోషిస్తున్నాడు. ధనం తృణంగా ఉపయోగిస్తున్నాడు. కొంతమంది మానవులు—ఎప్పుడూ భగవంతుడి ముందు కూడా సాగిలపడని కొందరు మానవులు ఆయన పాదాల దగ్గర సాగిలపడు

తున్నారు. భగవంతుడు—మనకు కనపడే గుడిలో భగవంతుడు సహితం—సాగిలపడే అందర్ని ఏక దృష్టితో చూస్తాడు. ఈపురుషుడో చిత్రచిత్ర మైన చూపులతో చూస్తున్నాడు. భగవంతుడి కన్న గొప్ప!

ఆయన దాతృత్వము మూలమూలలకు పరుగెత్తుతున్నదని ప్రతిసంస్థను ఆయన పోషించడాన్ని బట్టే తెలుస్తున్నది. ఆయన ప్రతి మంచి వస్తువును తన దాన్ని చేసుకున్నాడు.

మహానుభావు డని కొందరు హారతు లిచ్చారు. కొందరు పాటలు పాడారు. కొద్దిమంది భక్తియుతులై తన్మయత్వంలో నిశ్చేష్టులై చూశారు. ఈజగత్తును మించే టటువంటి గొంతుకలో "అన్నిటినీ ఆయన కొన్నాడు. దాతృత్వం కాదు ఉద్యోగ వాంఛ. దానం కాదు క్రయం" అని వెలుగు రాచిన స్వరపు వదంతి ఒకటి బయలుదేరింది. అందరూ విన్నారు. ఎవరు అన్నారనీ సమాధానం చెప్పడం? అవదంతికి సమాధానమే లేకపోయింది.

ఆయన స్వగృహంలోనూ ఉద్యోగమే చేస్తాడు. బహుశా ఆయనకు చావు కూడా ఉద్యోగపు విధులలో ఒకటే నని గట్టి పుకారు. నమ్మక మైన స్థానంనుంచి వచ్చిన కబురు. ఉద్యోగపు విధి కాకపోతే ఆయన చావనే చావ డని చెప్పుకుంటారు. నిజం పరీక్షించడము ఎవరికి చేత నవుతుంది?

భార్యా దగ్గరా ఉద్యోగమే చేయడం. అక్కడ సేవకత్వం. ఆయన దైవభక్తుడు గూడానూ. రుద్రాక్షమాలలు ఆయన తేజస్సు వల్ల గొప్పదనం సంపాదించుకోవడానికి ఆయనకు తమ్ము దామే సమర్పించుకున్నవి. తనకు పూజ్యార్హత సంపాదించుకోవడానికే విభూతి ధూళి ఆయన నొసటిని అలంకరించింది. దేవతార్చనలో గంటలు గూడా తమంతట తామే మ్రోగుతున్నవి.

ఆయన సంధ్యావందనమే చేయ డని కిట్టని వాళ్లు అంటారు. వాళ్లు చాలా అన్నారు. కీర్తి సంపాదించే వాడికీ, ధనం సంపాదించే వాడికీ అందరూ విరోధులే మరి అనరూ?

జగత్తంతా విరోధులు కావడానికి తగిన కారణమో? ప్రజల అనూరాయే నని. కీర్తి, ధనం సంపాదించే ఉద్యోగిలో ఉండే అహంకారం అని ఎవరూ విస్పష్టంగా అనలేరు. అన లేరు. ఎవరైనా రహస్యంగా అన్నా రేమో అవాకు ఆయన కీర్తి నినాదాలలో లీన మయి అంతర్హిత మయింది. వెనక నే దాగున్న ఆయన చరిత్ర, పూర్వీకుల చరిత్రలు ఈవాదును కూడా తమ చెంత జేర్చుకొని జోకొట్టినవి.

ఆయన పేరితో ఆపట్టణవాసుల కెవరికీ అవసరం లేదు. పేరు పెట్టి పిలచేవా రేరీ? అందరికీ ఆయన పంతులుగారే. పంతులుగా రంటే అందరికీ తెలుసు. ఫలాని వెంకయ్య అంటే అతన్ని ఎరిగి ఉన్నవాళ్లందరికీ ఆవెంకయ్యా రూపం మనస్సులో ఎట్లా స్ఫురిస్తుందో అలాగే పంతులుగా రంటే ఈవ్యక్తి రూపం ప్రతివాడికి ఆపట్ణంలో తట్టుతుంది. 'పంతులు' నాణెము బాగా చెలామణి అవుతున్నది.

ఎవరి కేనా వృద్ధులకు—ఉద్యోగి కన్న—అనగా పంతులు కన్న వృద్ధులకు తెలుసు నేమో ఆయన పేరు. అయినా ఎన్నాళ్లని జ్ఞాపక ముంటుంది?

౨

పంతులుగారే వృద్ధుడు ఆయన అనుకున్నా ఆమాట అనుకోకపోయినా. ఇంకా ఎన్నాళ్లో జీవించి ఉద్యోగం చేయాలె నని ఆయన తలంపు. అందు కని తాను చిన్నవాడే నని తనను నమ్మించాడు.

ఆయన దగ్గర పని చేసే మాధవశాస్త్రి మరీ వృద్ధుడు. పంతులుగారి తాతను ఎరుగు నట. ఆయన తండ్రి సమకాలికుడు. పంతులుకన్న షుమారు పాతికేండ్లు పెద్ద.

ఆయన చేసే పని గుమస్తాగిరి. దాన్ని ఉద్యోగం అనడానికి వీలులేదు. ఉద్యోగలక్షణాలు దానికేవీ లేవు. ఆఅహంకారము ఆముక్కోపము, ఆతలబిరుసుమాటలు, ఆధనమదాంధత్వము, ఆఅధికారదుర్నయం అన్నీ ఉంటేనే ఉద్యోగలక్షణాలు సంపూర్ణంగా ఉన్నట్టు. అవి చెలాయించే ఉద్యోగమయితేనే ఉద్యోగం. మరి మాధవశాస్త్రి చేసే పని గుమస్తాగిరీ అనండి, నౌకరీ అనండి ఏదయినా సరే.

ఉద్యోగమనేది ఆయనకెట్లా అవుతుంది? ఉద్యోగం చదువుకున్నవాడికి. చదువుకోవడానికి డబ్బయినా ఉండాలే లేక అడుక్కోవడమైనా చేతకావలె. అవి రెండూ లేని మాధవశాస్త్రికేమి ఉద్యోగం?

ఆయన చాలా బీదవాడు. ఉద్యోగాన్ని ఆశ్రయించిన ధనం ఆయనకేలా లభిస్తుంది? తన యజమానిలాగా ధనం ఆర్జించడం చేతగాదు. పుట్టినప్పటినుండీ ఇంతవరకు అన్నవస్త్రాలకు చాలీ చాలకుండా జీవనం చేస్తున్నాడు. ఇచ్చిన జీతం చాలకపోతే పైఆర్జన నేర్చుకోవలె; యజమానినైనా సరే మోసం చేయాలె. లేకపోతే మాకున్నది, మాకున్నది అనే వారికందరికీ డబ్బెక్కడినుంచి వచ్చినట్లు?

జీవితారంభం నించీ ఈ వెండెకట్లే అయితే, ఈ రుద్రాక్షమాలలే అయితే ఈ సహస్రనామార్చనలే అయితే, ఈ ముక్కుమూసుకోవడాలే అయితే, ఈ మడికట్టుకోవడాలే అయితే అందరిలాగానే ఉండేవారీ ధనవంతులంతా.

మాధవశాస్త్రికి పిచ్చి పాపం! నమ్మకం అంటాడు. నమ్మిన స్వామిని ద్రోహం చేయడట. లాభం లేదు. అటువంటి మానవుడు ఈ కలియుగంలో పుట్టడానికే హక్కు లేదు. జీవించడానికి చెప్పాలెనా?

మాధవశాస్త్రిని విభూతి తనంత తానే అలంకరించడం లేదు. రుద్రాక్షమాలలు ఆత్మార్పణం చేసుకోలేదు. దేవతార్చనలో గంటలు తమంత మ్రోగడం లేదు. అన్నీ ఆయన స్వయంగా చేస్తాడు. అన్ని పూజలూ వేళ తప్పకుండా చేస్తాడు. ఆయన సంధ్యావందనం చేయడని వదంతి లేదు. కొంత మంది ప్రజలు ఆయన్ను—బీదవాడయినా—గొప్పవాడేనంటారు. ధైర్యంగా ఆయన్ను, ఆయన గొప్పదనాన్ని మెచ్చుకున్నవాళ్లు లేరు.

తన జీతానికి అవసరమయిన దానికంటె ఎక్కువగానే పని చేస్తాడు శాస్త్రి. ఆయన రక్తమాంసాలు ఈయజమాని సేవలోనే జీర్ణించినయి. ఇంటి పని, రాబడి వ్యవహారము, వ్యవసాయపు పని పిల్లల చదువు పని, పనులన్నీ ఆయన పనే. తలచుకుంటే కుబేరుడు కావచ్చు కూడానూ. కుబేరుడితోనూ, అంతకన్న గొప్పవాడైన తన యజమానితోనూ పోటీపడడం యిష్టం లేదు పిచ్చి శాస్త్రికి.

రక్తమాంసాలు ధారపోసి చాకిరీ చేస్తున్నాడని ఎవరికీ జాలి లేదు. జీతమిస్తున్నాం చేస్తున్నాడని యజమాని అభిప్రాయం. జీతమెక్కువేమోనని యజమానురాలి అభిప్రాయం.

ఉదయం యజమాని గృహానికి రాగానే చిన్నవాడని అయినా విచారించకుండా యజమానికి నమస్కారం చేస్తాడు. అటువైపు చూడనే చూడడు పంతులుగారు. చూచినా చక్షురింద్రియజ్ఞానం ఉన్నవాడిలాగా కనపడడు. చేతులారా పోగొట్టుకొన్నవాడి కివరేం చేస్తారు.

యజమాని యాజమాన్యం సర్వకాలసర్వావస్థలయందు వ్యక్తమవుతూండడం వల్లనయితే నేమి, గుమస్తాకు తాను సేవకుడనే మాట ఎప్పటికప్పుడు జ్ఞాపకం వస్తూండడంవల్లనైతే నేమి, మాధవశాస్త్రికి పంతులుగారి సమ్ముఖాన అమితవినయం. పంతులు తీక్ష్ణమైన చూపులకు తోడు శూలం లాంటి మాటలు విసురుతాడు. "ఈపని కాలేదే మని" యజమాని ప్రశ్న. "చిత్తం ప్రొద్దున పొలానికి వెళ్లాను; ఈపూట......" అని

శాస్త్రి జవాబు. యజమాని కండ్లెఱ్ఱజేసి "ఏమి పను లయ్యా! ఒకపని పూటపూటల్లా చేయాలె, ముసలివాడివి పని చెయ్యలేకపోతే చాలించుకో రాదూ? చిన్నవాళ్ళవల్లైనా దివ్యంగా చేస్తారు." అని.

ఈలాంటి మాటలతో మాధవశాస్త్రి చెవులు చిల్లులు పడినవి. మెచ్చుకోబడని గుమాస్తాగిరి మాని వేద్దామంటే అయన స్వాధీనంలో లేదు. అడుక్కోని తినడానికైనా ఓపిక చాల దాయనకు.

ఆనాడు రావడం అలస్య మయింది పంతులుగారింటికి. పంతులుగారి భార్య్యా చూసింది. "గుఱ్ఱం గుడ్డిదైనా దాణాకు తక్కువ లేదు. నెల అయ్యే సరికి జీతం కావాలె. ప్రతిరోజూ రావడ మాలస్యం. పని కాదు." అని కేక వేసింది. శాస్త్రిగారు తల వంచుకున్నారు. మగవాడైనా కన్నీటిచుక్కలు అగలేదు. కొనగోటితో చిమ్మివేశాడు. పంతులుగారు వచ్చి మళ్ళీ అరంభించాడు. దేనికి మాట్లాడ లేదు శాస్త్రిగారు.

ఆరోజున పని ఏమీ సాగలేదు. తలచుకున్నప్పుడల్లా కళ్ళవెంట నీళ్ళు కారేవి. దానికి ప్రత్యేకకారణం కూడా ఉన్నది. ఏకపుత్రుడికి వారం రోజులనుంచీ జ్వరం. ఆరోజున కొంచం ఎక్కువైంది. అందువల్లనే ఆరోజు ఆలస్య మయింది రావడం. దానికి తోడు యజమాని, యజమానురాలి క్రూరత్వము. వృద్ధుడు హృదయవేదన పడ్డాడు.

రెండు రోజులకు శాస్త్రిగారి కుమారుడికి జబ్బు చాలా విషమించింది. మందు పోయించడానికైనా శాస్త్రిగారి దగ్గర రాగిదమ్మిడీ కనపడలేదు. అయన కేమీ తోచక పంతులుగారి వద్దకు వెళ్ళి తాను పనిచేసున్న నెల జీతమైనా యివ్వ మని అడిగాడు. నెల సాంతంగా పని చేయంది డబ్బివ్వడానికి వీలు లేదని పంతులు సెలవు. ముందుగా ఇస్తే వడ్డీ నష్టం కదూ!

శాస్త్రిగారి కుమారుడు ఏమీ మందు లేకుండానే మరణించాడు ధనం లేనిది జీవించడానికి హక్కు లేదు గనుక.

శాస్త్రిగారు జీవించీ మరణించిన వాడితో సమాన మైనారు. మనిషి అసావి సంక్రింద పడ్డాడు. అయన కడుపు తరుక్కోని పోయింది. పోయీ చేసేది?

నాలుగు రోజులకు కబురు శాస్త్రిగారు క్రమంగా పనిలోకి వస్తారా? రారా? అని, రాకపోతే అంతటితోనే పని చాలించుకోవలసింది అని. ఈ మాట విని మరీ కూలిపోయినాడు. నిరసించిపోయినాడు. వరుసగా నాలుగు రోజులు భోజనమే చేయలేదు. గోరుచుట్టు మీద రోకటి పోటు.

ఇది మంచిది కాదని ఆపంతులుగారి కాపట్నంలో ఎవరు చెప్పగలరు? అందరూ అయన పాడిన పాటకు తాళం వేసే వాళ్లే. ఆపట్నంలో ఉన్న ప్రతిసంస్థకూ అయనే అధికారి కావడంవల్ల ఈవిధంగా శ్రమపడేవాళ్ళకు లెక్క లేదు. అయినా ఎవరూ ఇది తప్పని అనలేదు. అన్న మరుసటి క్షణం ఆసంస్థకు అయన చేసే సహాయానికి దేవిడ మన్నా చెబుతా డని భయం.

తప్పని చెప్పగలవాళ్ళైనా ఉన్నా వాళ్ళకు అయన దగ్గిరికి రావలసిన అవసరం లేదు. అయన దుర్నయాలు అటంకం లేకుండా సాగుతున్నవి. కాని అయనంత గొప్పవాడు, మంచివాడు, ఋషి ఆపట్నంలోనే లేదు.

శాస్త్రి మంచం పట్టాడు. స్మృతి తప్పిపోయింది. నాలుగు రోజులనుంచీ ధారకం లేదు.

ఇంట్లో ముసాలి వృద్ధ శాస్త్రి భార్య. అమె ఒక్క కొడుకు పోయి పదిహేను రోజు లయినా కాలేదు. ముసలాయనకు ప్రాణం మీదికి వచ్చింది. చిట్టుడుకునీళ్లు పోయడానికైనా ఇంట్లో బియ్యపు గింజలు లేవు. పంతులుగారింటికి వీరిని, వారిని బ్రతిమాలుకుని కబురు చేసింది. అందరూ పంతులుగారు డబ్బు ఇప్పుడు లేదన్నా రని కబురే. చేసినంత వర కైనా డబ్బివ్వ మని అమె తుదిమారు కబురు చేసింది. నెలాఖరు కావలె నన్నాడు ఉద్యోగి.

నెలాఖరువరకు ఉండి జీతము పుచ్చుకునే ప్రాప్తం లేదు శాస్త్రికి. పరమపదించాడు. శాస్త్రి గారి భార్యా రోదనం భూమ్యాకాశాలు ప్రతి ధ్వనించింది. డబ్బు లేమివల్ల కొడుకు, భర్త ఇద్దరూ చనిపోయినారు. ఇవ్వవలసిన కొద్ది కూడా సమ యాని కివ్వక, కనికరం లేకుండా ప్రవర్తించాడు పంతులు. ఆమె కడుపు భగ్గు మన్నది. "నే నేడ్చి నట్లే వాళ్లు కూడా తిండికి లేక ఎప్పుడు ఏడుస్తారో" అని అందరితోటి అని ఏడ్చింది. ఏడ్చి ఏడ్చి ఆవిడ నేల కొరిగింది. ఆ ఇద్దరూ పడ్డచోటే మట్టి అయి నారు. ఇద్దరికీ ప్రకృతి కర్మాంతరాలు చేసింది. వర్షం ధర్మోదకాలు వదిలింది. కాలం మంత్రాలు చదివింది.

ఆ ఇల్లాలు చనిపోతూ అన్న మాటకు చాలామంది సంతోషించారు. ఎల్లకాలం ఒక మాదిరిగా ఉం టుందా? ఈ కాలానికి ఆవిడమాట నిజం కా కూడదూ?

3

అకస్మాత్తుగా అర్బుత్నాటుకంపెనీ దివాలా తీసుందని ఎవ్వరూ కలగన లేదు. ఏదో విధంగా న్యాయమో, అన్యాయమో డబ్బు పోగుచేయడం అర్బుత్నాటుకంపెనీలో వడ్డీకి వెయ్యడము.

అందులో వడ్డీకి వేసిన వారి అందరి జాతకం ఒకే విధంగా ఉండాలె. లేదా అందరిదీ అన్యా యార్జిత మైన విత్తం కావాలె.

ఒకరోజు తెల్లవారే సరికి అర్బుత్నాటుకంపెనీ దివాలా తీసిందని వార్త. ఆదివాలాలో కాస్తో, కూస్తో నష్టపడని మానవుడు లేడు.

పంతులుగారి యావదాస్తి అర్బుత్నాటు దేవుడికి దక్షిణ సహితంగా సమర్పణ మయింది. గుళ్లో దేవుడికి కొబ్బరికాయ నివేదిస్తే సగభాగం ప్రసాద రూపకంగా మనకు చెరుతుంది. అర్బుత్నాటుదేవుడు ఆమాత్రం ప్రసాద మయినా ఇవ్వదలచలే.

ధనం ఆవిధంగా నాశనం కాగా మిగిలిన చిల్లర ఆస్తి చిల్లర అప్పులకు సరిపోయి సెట్టె మిగిలాడు.

సంస్థలన్నీ అయనకు క్రొత్త వయినవి. సంస్థలను కొనడానికి తగినంత ధనం ఆయనదగ్గర లేదు. పూర్వంలాగా ఆయన్ను కీర్తించే వారు లేరు. హారతు లివ్వడానికి కర్పూరం వెలిగించినా ఆరి పోతున్నది.

ఆయన పోషించని మాత్రాన సంస్థలు నాశనమూ కాలేదు. వాటి త్రోవన అవి ఉండనే ఉన్నవి. ఏ సంస్థా ఇప్పుడు పంతులుకు వంగి నమస్కారం చేయడం లేదు.

ఆయన దైవభక్తి మిధ్య అనే వదంతి తిరిగి బయటికి వచ్చింది. ఇప్పుడు దాన్ని కాదన్నవాళ్లు లేరు. కిట్టిన వాళ్లూ ఆయన సంధ్యావందనం చేయు డన్నారు.

ఆయన అహంకారానికీ, ఉద్యోగవాంఛకీ తగిన తావు లేక అయన్నే అక్రమించుకుని తిని వేసినవి. ఆయన జీవచ్ఛవ మైనాడు.

విభూతి ధూళి తనంత తానే రాలింది. దేవ తార్చన గంటలు తమంతటా ఆగినవి. రుద్రాక్ష మాలలు తెగి నేలకు రాలినవి. ఆయన తిరిగి వానిని ధరించలేదు. వాటి అవసరం ఆయనకు కనపడలేదు.

ఆయన పేరు అందరికీ జ్ఞాపకం వచ్చింది. పంతు ల్లా శివయ్య అయినాడు. ఉపపదం గూడా లేకుండా ఆయన ఇప్పుడు శివయ్యమాత్రం. పంతు లంటే ఆయన రూపం ఎవరికీ జ్ఞాపకం రాదు. "పంతులు" నామం మరెవరినో వరించింది.

ఆయన ఉద్యోగం పోయింది. ఇంట్లోనూ ఉద్యోగం లేదు. అహంకారం, తలబిరుసు ఇత్యాది ఉద్యోగలక్షణాలు సెలవు పుచ్చుకున్నవి. ఆయన దేహానికి గూడా ఉద్యోగవాంఛ తగ్గింది. ఆయన కోటూ, వల్లెవాటుపంచా భోజనానికి ఉపయో గించినవి.

ఆయన ధనాన్ని ఆర్జించాడా? ధనం ఆయన్ను ఆర్జించిందా? అనే ప్రశ్న మళ్లీ బయలుపడ్డది. "ఆయన్నే ధనం ఆర్జించింది. పైగా ఆయనమీద రాజ్యం చేసింది." "త్రోవన పోతూ ఈధనం నా

దన్నాడు. కొంతకాలం, ఆయనదే" అన్న అభిప్రాయాలు గెలిచినట్టుగా ప్రకటితమైంది. తరువాత ప్రశ్న—ధనమా రాజ్యం చేయడం? ఆయనా? అనే ప్రశ్న—కూడా నిర్ధారణయింది. ఆనాలుగునాళ్ళూ ధనమే రాజ్యం చేసిందన్నారు.

పంతులు—ప్రస్తుతం శివయ్య—ఉద్యోగపు కొంతులు అస్తమించినవి. ఆయన పూర్వచరిత్ర బయటపడ్డది. పూర్వీకుల చరిత్ర అందరూ చెప్పుకుంటున్నారు. వంశచరిత్ర కూడా తెలిసింది. శివయ్య తండ్రి గుమస్తాగిరి చేసి యజమానిని మోసం చేశాడు. ఆధనంతోనే కొడుక్కు ప్లీడరీ చెప్పించాడు. శివయ్య తాత ముష్టితుకుని జీవనం చేశాడు. ఆవంశం గ్రామ పాచికపు పురోహితవంశం. ఈసంగతులు చెప్పుకోవడానికి ఎవరూ భయపడడం లేదు. ఆయన చివరకు అడుక్కొని తింటూంటే "పూర్వీకుల ఉద్యోగమే ఈయనకు సరి. మధ్య వచ్చిన సిరి నిలుస్తుందీ?" అన్నారు.

శివయ్య చనిపోయింది ఉద్యోగపు విధి అని కాదు. చివరరోజులలో ముష్టికూడా దొరకలే. తిండి లేక మలమల మాడి శోష వచ్చి చనిపోయినాడు.

ఆ ఇల్లాలి శాపం అలాంటిది కాబోలు.

పక్షులు చెట్లమీద కూర్చుని ధనం రాజ్యం చేయడమా? అని ధ్వని చేసినవి. "కొన్నాళ్ళు రాజ్యం చేసిన విలే. ఎక్కువ రోజులు నిలవకపోతేనేం" అని తిరిగి గాలులు ఊదినవి. పక్షులు కిలకిల నవ్వుతూ ఎగిరి పోయినవి.

# పాత్రాభినయము

## వసంతమూర్తి

నాటకము దృశ్యకావ్యము, అనగా ప్రేక్షకులు చూడవలసినది. శ్రవ్యకావ్యములలో ప్రేక్షకుల చూపు ప్రసక్తి లేదు. అంతవరకూ ఎందుకు ప్రేక్షకుల ప్రసక్తే లేదు. దృశ్యకావ్యాలలో అంతా ప్రేక్షకుల నుద్దేశించినదే. మహాకవి షేక్స్పియరు తన కాలమునాటి ఆంగ్లనాటక రంగానికి అనుకూలించే టట్లు రచించాడట నాటకాలన్నిని. సంస్కృతాలంకారికులు, భోజనము, రక్తపాతము మొదలైన చర్యలు కొన్ని రంగముమీద చూపకూడదని నిషేధించారు. కాబట్టి నాటకము మొదటినుంచీ, అన్నిదేశాలలోనూ కూడా కేవలము ప్రేక్షకుల దృష్టిని మాత్రమే గణించింది కాని నటుల సౌకర్యాలని గురించి ఆలోచించియుండనే లేదు.

నాటకరచన ఒక కళ. నాటక ప్రదర్శనము వేరొక కళ. తాను రచించే నాటకము (కథ) సవ్యమైన రీతిని మనసుకు పట్టేటట్లు రచయిత నాటకము రచిస్తాడు. ఈనాటకము కథ మన కన్నులకి కట్టేట ట్లుండడానికి సూత్రధారుడు నాటకము ప్రదర్శిస్తాడు. రచయిత సామగ్రి, పాత్రములు, ఘటనలు, చరిత్రలు; ప్రదర్శకుని సామగ్రి, రంగము, తెరలు దుస్తులు, నటులు. ప్రదర్శకుని యాజ్ఞను తలను ధరించి ఆతడు చెప్పిన చొప్పున 'తుచ' తప్పకుండా ప్రవర్తించడమే నటుని విధి. సినిమా (డైరెక్టరు) సూత్రధారుల పని గమనిస్తే ఈవిషయము బాగా బోధపడుతుంది. కథ నంతటినీ ఏవిధముగా, ఏయే ప్రదేశములలో ప్రదర్శించవలసియుంటుందో ముందు (సెనేరియో) ప్రదర్శకుల తర్జుమా వ్రాస్తారు. నటులూ, సామగ్రీ, కలిసి ఒక పర్వతసీమకి కదలిపోతా రనుకోండి. కథ మొత్తముమీద పర్వతసీమలో తీయవలసిన ఘట్టా లన్నీ ఈ ఒక్కసమయములోనే ఫొటో తీశేస్తారు.

వేరొక సారి కాసారదృశ్యాలు, మరోమారు ప్రాసాదసంబంధములు నటింపజేసి ఫోటో తీస్తారు. చివరికి కథకి సరిపోయే విధముగా వీటి నన్నిటినీ అతికించి ఫిల్ము తయారుచేస్తారు. కొండమీద నుంచి దూకడము, శరీరాల్ని పాతిపెట్టడము, మొదలైన అసాధ్యవిషయాలు ఛాయాగ్రాహక యంత్రము వంచించియో, మరే చిత్రము చేసియో జరిగినట్లు చూపిస్తారు. సినిమా సూత్రధారి తన తెలివితేటలవల్ల అసాధ్యాల్ని సుసాధ్యాలుగా మార్చుకుంటాడు.

నాటక ప్రదర్శనములో సూత్రధారుడి పని కూడా యింతే. కాని రంగము వైశాల్యము తక్కువ కాబట్టి కష్టా లెక్కువ. నటు లందరూ సూత్రధారి నిర్దేశాలను శిరసా వహించి పాలించాలి.

ఈ ఊహలు మనస్సులో పెట్టుకుని, నటుడు తాను ధరించే పాత్రములో లీనమైపోవాలా అక్కరనే లేదా? అనే ప్రశ్నకి జవాబాలోచింతాము. నటుడు తాను ధరించే భూమికలో లీనమై నటించాలనే అభిప్రాయము చాలమంది కున్నది. ఈయభిప్రాయము ననుసరించి నట్లయితే జరిగే పని ఆలోచింతాము. ప్రతినటుడూ తన శక్తి ననుసరించి తన పాత్రములో లీనమౌతా డనుకుందాము. వ్యక్తుల శక్తులకు తారతమ్య ముంటుంది. కాబట్టి పలువ్వురు నటులు తాము ధరించే పాత్రములలో లీనమై ప్రదర్శించిన నాటకములో—ప్రహ్లాద అనుకోండి, ఒక హిరణ్యకశిపుడే మనకి కనబడి లీలావతి, ఆపాత్రధారియొక్క ప్రత్యేకాభినయకౌశలము హిరణ్యకశిప పాత్రధారి శక్తికి తగ్గిన పక్షమందు కనబడకపోవచ్చును కదా? అలాగే ఒక పాత్రధారి హెచ్చు లీనమై మరో పాత్రధారి అంత కాలేకపోడమువల్ల—ఐక్యత ఉండదు. "రామదాసు బాగా చేశాడురా! రోషనారా ఏమిటి అద్భుతముగా నుంది కాని శివాజీ—చింతామణి టక్కులు బాగా చేసింది కాని, బిల్వమంగళుడు 'అమ్మమ్మ'రా" అనే మాటలు బయలుదేరడాని కదే కారణము. ఏ పాత్రధారి యిష్టము వచ్చినట్లా పాత్రధారి నటించితే నాటకము అతుకులబొంత అయిపోతుంది.

ఆఁ. అలా ఎందు కనుకోవాలి? ప్రతీపాత్రధారీ బాగానే తానూహించినంతవరకు పాత్రములో లీనమై పోగలడే అనుకోకూడదా అంటూరు పాఠకులు. సరే. అప్పుడు నాటకంలో ఏమి కనబడుతుంది? రామారావూహించిన కృష్ణుడు, భీమారావూహించిన అర్జునుడు, ధర్మారావూహించిన ధర్మరాజు గోచరిస్తారు. నాటకం గయోపాఖ్యానం కాక ఏదో గమ్మత్తు కథ అయిపోతుంది. రచయిత ప్రేక్షకులకి అన్యాపదేశముగా బోధించనెంచే సదాదర్శము మరుగుపడిపోతుంది.

కళాకారుడు తన భావాలు పరులకి కలిగించడానికి రచన చేస్తాడు. ప్రతినటుడూ కూడా, తన పాత్రములో లీనము కావా లంటే, ప్రతినటుడూ కళాకారు డౌతాడు. ప్రేక్షకులకు నాటకదర్శనానంతరము కలుగవలసిన బృహద్భావము ప్రతి నటుడికీ కళాకారిత్వ మిస్తే మలిన మైపోతుంది. నాటక మంతా కలిసి కళ అవుతుంది కాని రంగము రంగమూ కళ కాదు. అటువంటప్పుడు నాటక మంతా మొత్తముమీద చేయగలిగే రసానుభవమే ప్రధానము గాని, ఒక పాత్రము జనింపజేసే సంచారీభావములు లెక్కలోకి రావు.

నాటక మంతా కలిసి కళ అయినప్పుడు నాటకప్రదర్శనము మొత్తము మీద కళ అవుతుంది. రచయిత ఉద్దేశించిన సదాదర్శబోధనకి అనుకూల వాతావరణము నూహించి ప్రదర్శించే సూత్రధారుడు కళాకారు డౌతాడు. చింతామణి పాత్రధారి మంచి చీరలు తెచ్చుకోలేనంత మాత్రమున, చిత్ర పాత్రధారి ఎల్లాగో నాలుగు జతలు నగలు సంపాదించిన కారణమువల్ల వచ్చే విపరీత తారతమ్యము సూత్రధారి శాసనమువల్ల నశించిపోతుంది. ఏరంగము ఎట్లు ప్రదర్శించాలో ఏనటుడు ఏస్థలములో ఏరీతిగా నిలువబడి ఎట్లు నటించితే ప్రేక్ష

కుల కెలాగు కనబడుతుందో ఆలోచిస్తాడు సూత్రధారుడు. రంగ మంతా ప్రవేశము మొదలు నిష్క్రమణమువరకూ సూత్రధారుడి ఆదేశమునే అనుసరించాలి. సూత్రధారుడు కోరే నటనకి తోడ్పడడానికి ఎంతపాటి ఆవేశము కావాలో ఆ ఆవేశానికి సరిపోయేటంత వరకే నటుడు పాత్రములో లీనము కావచ్చును. భరతముని స్వర్గములో ప్రదర్శించే నాటకములో విక్రముడు ఊర్వశి, ప్రేమదృష్టుల నెక్కువగా సారించుకొన్నారు. సూత్రధారు డైన భరతముని కోపించి శపించాడు రసాభాస మైం దని. అవసరము కన్న ఎక్కువగా వారు ప్రేమలో లీన మైనారు. ఈసమాధి సాధనము కాని సాధించవలసిన పరమార్థము కాదు. సాధించవలసిన పరమార్థము ప్రేక్షకులకు రసానుభవము. ఆపనికి గాను నటుడు పాత్రమునందు లీనము కానక్కరలేదు. నిష్క్రమించిన తరువాత కూడా వెక్కి వెక్కి ఏడువరాదు రత్నాంగి పాత్రధారి. అనగా అతడు నిజముగా యేడువరాదు. ఏడ్చినట్లు ప్రేక్షకులను నమ్మించితే చాలు. పొడుము పీల్చుట అలవాటు లేనివాడు పొడుము పీల్చి కన్నీరు, రప్పించుకున్నా సరే, ముఖ్యముగా కావలసినది కన్నీరు. అది ఎట్లు జనించినా సరే.

లీనము కాకుండా నటుడు సూత్రధారి కేనా సంతుష్టి నీయలే డని కొంద రనవచ్చును. ఇది అందరిపట్లా నిజము కాదు. నిజ మైనా ఒక నటుడు సూత్రధారునికి కావలసిన అభినయము సమకూర్చడానికి ఆవేశింపజేసుకోవాలి గాని అంతకంటె హెచ్చుకూడదు. నాటక ప్రదర్శనములో నటుడు కళాకారి కాడు. నటుడు కేవలము సాధనమే. అతడు కాక, మాట్లాడగల జంత్రపుబొమ్మ ఉన్నా కూడా సూత్రధారుని కళాకారిత్వానికి భంగము రాదు. సూత్రధారునితో పని లేకుండా పలుపాత్రములు ధరించి ఆడే పలువురు నటులకంటె యజమాని యిష్టము వచ్చినట్లు చేతు లూపే తోలుబొమ్మలు ఎక్కువ సహాయకారులు కళాప్రదర్శనానికి.

# భావకవిత్వము

కవికొండల వేంకటరావుగారు, బి. ఏ., బి. ఎల్

భావకవిత్వ మంటే పలువురు పలుతెఱంగులుగా అర్థం చేసుకొంటున్నారు. చివరకు ఏకవి కైనా నలుగురు మఱదండ్రు వుంటే ఆమఱదండ్రు ఆకవి కవిత్వాన్ని భావకవిత్వం అనడం దగ్గఱకు వచ్చింది. అల్లాగ్గా హేళన చేదామూ అంటే ఏపదాని కైనా వుంటాయి ఆమాత్రం విఱుపులూ ఆమాత్రం అపార్థాలూ. 'రసికుడు' అంటే విరసోక్తిగా అర్థం చేసికొనే వా ళ్లెంతమంది లేరు? God the good అని ఇంగ్లీషులో అంటే ఆవెనుక గాడిదగుడ్డు అని తెలుగులో వెక్కిరించే మహానుభావులు ఎంతమంది లేరు? కాబట్టి అలాంటి పరాసికా లన్నీ ముందు మఱచిపోవాలి మనోవాక్కాయశుద్ధిగా 'భావకవిత్వం' అనే దేమిటో తెలుసుకోవా లనే మానిసి.

'సృష్టిసౌందర్యము' 'వీరధర్మము' లాంటి పదమే 'భావకవిత్వము' అన్నా గానీ అని నా యుద్దేశ్యము. 'సృష్టిసౌందర్యము' అంటే సృష్టిచే ప్రతిపాదింపబడే అందము అన్నమాట. 'వీరధర్మము' అంటే వీరుడు నిర్వర్తించే విధి అన్నమాట. అలాగే 'భావకవిత్వము' అన్నా అని అనుకోవాలి. భావము యొక్క కవితాస్వభావము భావకవిత్వము.

ఇది ఎట్లు అమలులోనికి వచ్చింది అంటే పాతకుల ముఖతా నని నాయూహ. సృష్టిసౌందర్యము తీసికోండి. సృష్టి ఎప్పుడూ ఓలాగే దాని పని అది చేస్తూవుంది. కాని దానియొక్క అందం ఒకానొకడు గ్రహించినప్పుడు ఆసృష్టి దృశ్యము బహు సుందరంగా వుంది అంటున్నాడు. అప్పుడు వానికారహస్యము గోచరించింది అన్నమాట. అలాగునే కవు లెప్పుడూ వ్రాస్తూనే యున్నారు. భావా లెప్పుడూ అక్కడ వుంటూనే యున్నాయి. కాని యిప్పుడు కొందఱు పాఠకులు కేవలం పదముల కూర్పునందలి కవితాతత్వమునే కాక భావము నందలి కవిత్వమును జూఱగొనుట ప్రారంభించి పైకి చెప్పడంచేత ఈభావకవిత్వం అనే పదము వ్యవహారంలోనికి వచ్చిం దని నే ననుకొంటాను.

భాష వేఱు భావము వేఱు అని అనవచ్చును. ఏమా అంటే ఒక మాట వేస్తే భావము వెల్లడింపు అయ్యేటట్టు ఇంకో మాట వేస్తే అంత యూశము అంత నియతీ కుదురదు. కాని భావమూ కవిత్వమూ వేఱెట్లా అని మీ రనుకోవచ్చు.

ప్రతీ ధర్మమూ తాను వ్యక్తిరూపం దాల్చేటప్పుడు రెండు విధాలుగా వుండక తప్పదు. ఒకటి పంచేంద్రియాల్లో ఓదాని కైనా గోచరించే బాహ్య స్వరూపమున్నూ, రెండోది ఆత్మను తట్టే అంతరంగికస్వరూపమున్నూ అయి యుంటవి. ఉదాహరణకు మళ్లీ వెనకటి వానినే యోచించి చూతాము.

మానవధర్మమును వ్యక్తిరూపం ఆపాదించి దృష్టించుకోబోతే అగపించే కన్ను ముక్కు వక్షఃస్థలము ఇత్యాదుల శరీరసౌందర్యమే కాకుండా ఏదో ఆత్మస్వరూపము ఆశరీరం అందంగా వుండి అందులో నివసిస్తూ జీవకళ వెలిగ్రక్కుతూ వున్నట్టు తోచదూ? చిఱుతవాని బోసి నోరు, ముశిలివాని పండ్లూడిన యిదీ రెండూ బాహిరమునకు బోసితనమే చూపిస్తూ వున్నా గాని చిఱుతవాని యంతఃకరణము గుండా గోచరించే అమాయకత్వము అనే ఆత్మగుణము ఆబాహిరరూపంలో అందం ఒలికిస్తూ వుంది. రెండో చోట అది నిరర్థక మనిపిస్తూంది.

ఆదేరీతిగా కవిత్వ మనే ధర్మం పైకి శ్రవణయోగ్యం కావడం తోనే అది రెండు రూపాలు తాలుస్తూవుంది. ఒకటి బాహ్యేంద్రియ గోచరమైన పలుకుబడి స్వరూపమున్ను రెండు అంతర్వాహినిగ హృదయను సర్థము గావించు భావస్వరూపమున్ను తాలుస్తూ వుంది.

కాబట్టి కొందఱు బాహ్య స్వరూపమును దిలకించి అందలి కవిత్వమునే చూఱగొనువార లైరి. వారు, శరీరసౌందర్యమునకు మాత్రమే యుప్పొంగు ఓంచిత్ కళోపాసకులవలె పరిమితజ్ఞులై భాషాకవిత్వము ననుభవించుచున్నారు. కొందఱు బాహ్యస్వరూపము అయిన పలుకుబడికి వెనుక నున్న భావములోని కవిత్వమును గ్రొల్లకొని ఆత్మసౌందర్యమున నుప్పొంగు సమగ్రకళోపాసకులవలె అపరిమితజ్ఞులై భావకవిత్వము ననుభవించుచున్నారు.

రూపమునందు ఆత్మసౌందర్యము ఎట్లు శాశ్వతానందమును ఒడగూర్చుచున్నదో కవిత్వమునందు భావకవిత్వము అట్లు శాశ్వతానంద మిచ్చుచున్నది. బోసినోరు సర్వదా హాస్యాస్పదమే అది విడదీసి బాహ్యరూపమాత్రముగా బరిగణించు వార మేని. అదే యొకచోట ఉపకరణమాత్రమై అమాయకత్వము అనే దైవగుణము వెల్లడించు నప్పుడు ఎక్కడలేని వాత్సల్యమూ పుట్టిస్తోంది. అలాగే విడివిడిగా ఉచ్చారణకు అసాధువు లని అశాస్త్రీయము లని శిష్టవ్యవహారములు కావని అనుకొనే ముక్కలు వాటి వెనుక భావకవిత్వము అనే గుణమును కలిగివుంటే అవి మనకు వేదవాక్కులుగా అయిపోతూ ఆభావమును మనస్థగతము గావిస్తున్నాయి.

కాబట్టి వితర్కింపూ, వితండవాదమూ, జిజ్ఞాసా ఇవన్నీ లోతుగా ఆలోచించి చూస్తే భాషను బట్టి భావాన్ని బట్టి లేవు. అసలు వెల్లడించిన వాక్కులో

వెల్లడించిన భావములో కవిత్వము ఉన్నదా లేదా అనే మెట్టుమీద ఆధారపడియున్నవి.

అందుకే కొందఱు భావము భాష విడిచిపెట్టి నేటి కాలపు కవిత్వం" అని "నవ్యసాహిత్యము" అని "అభినవకవిత" అని యిలాంటి సమూహపదములు వాడుతున్నారు. ఆసమూహపదములయొక్క తత్వము ఎక్కడుంది? అసలు కవిత్వమందు ఉన్నది. అది వుంటే అన్నివుంటాయి.

కాబట్టి భావకవీ భాషాకవీ అనే ముక్కలు విడిచిపెట్టి అసలు వ్రాయసగాడు కవియా అని వితర్కించండి. కవి అందఱికీ గోచరిస్తాడు. కవిని గ్రహించలేని మనిషి మనిషేగాడు.

("భావకవిత్వం అంటే యేమిటి?" అసలు ప్రశ్న యిదీ. నిజానికి యీ మాట ప్రచారంలోకి వచ్చి చాలా రోజులే అయింది; గాని యింతవరకూ యిది సిసలైన శబ్దమే అని ధ్రువపడలేదు. దీన్ని గురించిన జిజ్ఞాస యింకా పుట్టింది పుట్టినట్టే వుంది. ఇప్పుడు వేంకటరావుగారీవిషయం యెత్తుకుంటే యిది తేలిపోవచ్చు ననుకున్నాం; గాని ఆశాభంగం కలిగింది......"పద్యకావ్యం," "గద్యకావ్యం" అనే మాటలు చిరకాలంనుంచి వాడుకలో వున్నాయి. "పద్యకవిత్వం" "గద్యకవిత్వం" "పదకవిత్వం" అనే మాటలు కూడా అలాంటివే; కాని అగమ్యాలుగా వున్నా యని యింతవరకూ వీటి నెవరూ ఆక్షేపించలేదు. ఏమంటే? ఈమాటలు చక్కగా విగ్రహం చేసి చూపించవచ్చు. అర్థం సరిపుచ్చి వివరంగా బోధించవచ్చు; కాని "భావకవిత్వం" అనే యీ మాటకీ రెండూ కుదరడం లేదు. ఇంతవరకూ యెవరూ కుదర్చలేకపోయారు. వేంకటరావుగారున్నూ ప్రయత్నించారు; గాని అతకలేదు......"భావముయొక్క కవితాస్వభావము భావకవిత్వ" మన్నారు వేంకటరావుగారు. ఇది చాలా సాహసమైన నిర్వచనం. దీన్ని పండితులెవరూ అంగీకరించరు. ఈ అర్థవివరణ పద్ధతి సంస్కృతమర్యాదలకి అతీతంగా వుంది.... ...పోనీ విగ్రహం సరిగా వుందా లేదా అనే చర్చ విడిచిపెట్టేసి వేంకటరావుగారి భావాన్ని గురించి ఆలోచిద్దాం. భావంయొక్క కవితాస్వభావమే భావకవిత్వం అయితే యిక కవిత్వం అంటే యేమిటి? భావం లేకుండా అసలు కవిత్వం వుంటుందా? ఛందోబద్ధమైనంత మాత్రాన—లేక—చక్కగా కూర్చబడినంత మాత్రాన మాటల పోగు కవిత్వం అనిపించుకుంటుందా? నన్నయ్య, తిక్కన్న, శ్రీనాథుడు, పోతన్న, సోమన్న, సూరన్న, పెద్దన్న మొదలైనవారి పుస్తకాల్లో వున్నది మాత్రం భావంయొక్క కవితాస్వభావం కాదూ? ......లలితకళల కన్నిటికీ భావమే ప్రధానం. అది లేంది కళే గాదు. గాయకుడు, ఆరోహణావరోహణాలతో సప్తస్వరాలనూ ప్రసరించి ఆలాపన చేస్తాడు. అయితే అందులో భావం వుంటేనే అది రాగం అనిపించుకుంటుంది. వొక స్థపతి, నల్లరాతిని చెక్కి—లేక—యేదేనా లోహం కరిగించి పోసి స్ఫుటమైన వొక ఆకారాన్ని కల్పిస్తాడు. అదిన్ని భావం వుంటేనే శిల్పం అనిపించుకుంటుంది. వొక ముచ్చి, కుంచె పుచ్చుకుని అనువైన వస్తువుమీద రంగులతో గీతలు గీసి రూపకల్పన చేస్తాడు. అది కూడా భావంతో కూడి వుంటేనే చిత్రం అనిపించుకుంటుంది. అలాగే వశ్యవాక్కు అయిన వొక రచయిత చక్కని మాటలతో వొక పద్యం గాని, గద్యం గాని కూరుస్తాడు. అయితే అదిన్ని భావబంధురం అయినప్పుడే కవిత్వం అనిపించుకుంటుంది.........ఇలాగ భావంయొక్క కవితాస్వభావమే కవిత్వం అనిపించుకుంటూ వున్నప్పుడు ఇక దాన్ని భావకవిత్వం అనడంలో యేం ఔచిత్యం వుందీ? భావాన్ని ఛందోబద్ధం చెయ్యడంలో, లేక జటిలమైన వచనంలో కూర్చడంలో ప్రాచ్యుల అభిరుచి కంటేనూ, పద్ధతి కంటేనూ నవీనుల—అందులోనూ

యీ తెగవారి అభిరుచీ, పద్ధతీ చాలా భేదంగా వుంటే వుండవచ్చు. అలా అయితే వీరు తమ కవిత్వానికి చేర్చుకునే విశేషణం అభిన్నతను పరిచయం చేసేదిగా మాత్రమే వుండాలి; గాని యిలాగ అతకని పేరు పెట్టి అర్థం చెప్పడంలో సర్వాపోశనం పడితే యెలాగా?......ఇంతకీ: "భావం," "కవిత్వం" అని పొందిక లేని యీ రెండు శబ్దాలనూ మేకుబందీ చేసి దేశంమీద విడిచిపెట్టినవారు గాడిచర్ల హరిసర్వోత్తమరావు పంతులుగారుట. ఈ నవీనకవిత్వం చేసేవారిలో శిరోమణి ప్రొఫెసరు రాయప్రోలు సుబ్బారావుగారు రాజమహేంద్రవరంలో జరిగిన రెండో ఆధునికాంధ్రకవిపండిత సభలో యీ విషయం సెలవిచ్చారు. వారీపదం వాడవద్దని చాలా దూరం—ఆక్షేపించారుట గాని పంతులుగారు వినలేదుట. అప్పట్లో పంతులుగారు ఆంధ్రపత్రికకు ప్రధానసంపాదకులుగా వుండేవారు కనక వారందులో దీన్ని యథేచ్ఛగా వాడడమూ, తద్వారా యిది దేశంలో మూలమూలలా వ్యాపించడమూ జరిగిపోయింది. సుబ్బారావుగారి వంటి పండితుడు, కవి, సరసుడు, బాధ్యతగల పెద్దమనిషి శతవిధాల పోరి చెప్పినప్పుడు వినకపోవడం పంతులుగారిది—అది యిప్పుడెందుకు లెండి. అయితే నవీనకవులేనా దీన్ని కొంచెం పరిశీలించవలసింది; కాని వారు ఏదో వొక శబ్దం దొరికి దొరకడం తోటే గట్టి మని పట్టుకుని వాడెయ్యడం మొదలుపెట్టారు. అయితే సర్వోత్తమరావు పంతులుగారు ఆంధ్రపత్రికకు ప్రధానసంపాదకులైనంత మాత్రాన వారలాంటి శబ్దాన్ని సృష్టించినా అది చెల్లిపోవలసిందేనా? అదీగాక: సరియైన కవిత్వం మేము రచిస్తున్నామని వొక పెద్ద బాధ్యతని మీద వేసుకున్న నవీనకవులు మొగమాటపడి యీ అపభ్రంశరూపాన్ని స్వీకరించవలసిందేనా?... ......ఈ శబ్దాన్ని సాధించాలంటే యెలాగా కుదరదు. విడిచిపెట్టెయ్యడం సరసమైన పని. అలవాటయిపోయింది కనక—ఎందుకులెండి అంటారా? అయితే నిర్వచనాలు చెయ్యకుండా వుండడం మంచిది. సంపాదకుడు)

# హిందీవల్ల తెనుక్కి జరుగుతూ వున్న అపకారం

(ఈ విషయమై జూన్ సంచికలో మేము చేసిన ప్రకటన ననుసరించి కొందరు యువకులు లేఖలు రాశారు. వాటిలో కొన్ని యిక్కడ ప్రకటిస్తున్నాము, తతిమ్మావి కూడా క్రమంగా ప్రకటిస్తాము. తెనుగు జాతిలో హద్దు లేకుండా వ్యాపించ తగింది వొక్క తెనుగు మాత్రమే. తతిమ్మా వాటి కన్నింటికీ పిచ్చుకత్తుల పారా లున్నాయి. ఆహద్దు మీరిన వాటిని వాటి స్థానాలలోకి నెట్టడమే మా పని. తెనుగు రాని తెనుగు వ్యక్తి హిందీ నేర్చుకోవడమూ, ఎవరేనా సరే వీధిగుమ్మంలో వుండవలసిన హిందీని ఇంటోకి—తెనుగు స్థానంలోకి తీసుకురావడమూ, హిందీలోనే ముక్తి వుందని చెప్పడమూ, లేక రాయడమూ, లేక అనుకోడమూ— ఇవి మాతృద్రోహంలో చేరతాయి. మా దేశీయులకు ఈ పాపాలకు పాల్పడవద్దని మనవి చెయ్యడం కోసమే మేమీ లేఖలు ప్రకటిస్తున్నాం. కనక లేఖకులు కూడా ఔచిత్యం పాటించి మరీ రాయవలసి వుంది. హిందీప్రచారకులు కౌసారంలో నాచులాగ తెనుగుదేశం అంతటా కమ్మి వున్నారు. వారు చేస్తూ వున్న ఆంధ్రాతిక్రమణమూ, అభూతకల్పనలూ వున్నవి వున్నట్లు రాసి మాకు పంపవలసిందని మేము తెనుగు యువతులనూ, యువకులనూ కోరుతున్నాం. వృద్ధులు కూడా

రాయవచ్చు, అభ్యంతరం లేదు. ఈలేఖలలో పత్రికల సంపాదకీయాలు కూడా రెండున్నాయి. వాటిని ప్రకటించిన పత్రికలు ఆంధ్రభూమీ, చంద్రికానూ. హిందీవల్లువ తెనుగుభాషా వాఙ్మయాలమీద యిసక మేటలు వేస్తూవుండడం మంచి సమయంలో గమనించిన యీపత్రికల సంపాదకులకు మా ధన్యవాదాలు చెప్పుకొంటున్నాము. సంపాదకుడు)

౧

కాంగ్రెసు ఆదేశాలు అన్నిటితో పాటు హిందీ ప్రాముఖ్యం ఒకటి మన నెత్తోదల పడింది. కేంద్రప్రభుత్వవ్యవహారములు ఏకకంఠ్యంగా నడపడానికి ఈమహౌషధి అనాహతంగా పనిచేస్తుందని ప్రచారకభిషక్కులు బల్ల గుద్దుతున్నారు. యద్యపి–కాదనం

భారతదేశంలో బహుళంగా హిందీ కాని—దాని దగ్గర భాష గాని వాడుతున్నారు. కనక మనమూ అదే అభ్యసించి సాముదాయక వ్యవహారాలు చక్కబెట్టుకుందాం అంటేనూ వద్దనం. కాని—

ఆంధ్రులలోని ఆంధ్రత్వం, ద్రావిడులలోని ద్రవిడత్వం దిగద్రావి హిందీకి ఎగబడతాం అంటే అబ్బే అంటాం— ఆత్మోపఘాతం అంటాం.

మహాత్ముడు ఆత్మకథ చెబుతూ “భరతవర్షము న నున్నతవిద్యాప్రణాళికలో మాతృభాషయు, ఉపరి హిందీ, సంస్కృత, ఫారశీ, అరబ్బీ, ఇంగ్లీ భాషలును పాఠ్యములుగా జేయబడగిన వని నాయాశయము”

అన్న మాట లేనా హిందీప్రచారకులు వినిపించుకుంటే ఎంత బాగుండును !

ఈహిందీ ఆరాటంలో తెనుగువారిలోని రవంత తెలుగుతనమున్నూ రాలిపోతున్నది. అదిని సంస్కృతం మధ్యను ఆంగ్లం, తలయెత్తకుండా చేసిన తెనుగు ఇప్పటి కైనా “బతుకుజీవుడా” అనుకోకుండా హిందీ ఇనపపాదం కింద పడింది.

అభిమానపూరితంగా ఆదికవి ‘అన్య దపహాయ’ అంటే అనాడు, అంధహృదయంతో అభినవాంధ్రుడు “అస్మ దపహాయ” అంటున్నాడు ఈనాడు.

‘హంత’ హనుమచ్ఛాస్త్రి

౨

“హిందీవల్ల తెనుగుభాషకి జరుగుచున్న అపకారం” గురించి వ్రాయుమన్నారు సంపాదకులు. ఒక భాష అభివృద్ధి అయిందంటే మరోభాష క్షీణించిందన్నమాటే. ముద్దుపళని, మొల్ల, వెంకమ్మ, మొదలైనవారేముగ్గురో తప్ప, ఆంధ్రస్త్రీలలో కావ్యప్రణేత్రులు లేనే లేరు. నేటికి జాతీయోద్యమం ధర్మమా యని స్త్రీలలో కొంత ఉత్సాహము కలుగుతోంది. మూడువంతులు స్త్రీల యీ నూతనశక్తి ఇప్పుడు హిందీవైపు తిరిగింది. సారస్వతాభిలాష గల సోదరీమణులు పెద తల్లికి గాక తమ్మకన్న తెనుగుతల్లికి సేవజేసినట్లయితే, తెనుగుభాషకి నూతనాలంకారములు లభించడమే గాక తెలుగువారికి స్త్రీహృదయము కొంత బోధపడగలదు. హిందీభాషావిజృంభణమువల్ల తెనుగుస్త్రీ కల్పనాశక్తి మరి కొంత కాలం మరుగుపడిపోతోంది.

శ్రీపాద గోపాలకృష్ణమూర్తి

3

హిందూదేశంలో నూటికి తొంభైముగ్గురికి ఓనమా లేనా రావు. మాతృభాషలో మాట్లాడడమే కాని రాయడం, చదవడం చేతకావు. అటువంటి సందర్భంలో నిరుడు గాంధీమహాత్ముడు మన తెలుగుదేశంలో ఒకరికి ఒక సందేశం పంపాడు, తెలుగుదేశంలో ప్రతి కుగ్రామంలోనూ, ప్రతి వ్యక్తి హిందీ నేర్చుకోవాలసి, అంతవరకు హిందీప్రచారం మానకూడదనీని. ప్రజలు అసలు చదువంటే యెరగని స్థితిలో ప్రతీ వ్యక్తీ హిందీ నేర్చుకోవా లంటే అర్థమేమిటి? మాతృభాషను మానేసి ఇక ముందు హిందీయే నేర్చుకోవాలనా ?

ఏజ్ఞానమైనా మాతృభాషలోనే కలగాలి కాని మరొక భాషలో కలిగితే మనకేమీ లాభం లేదని దేశనాయకులు గ్రహించారు. గడచిన నూరేళ్లనుంచీ విద్య ఇంగ్లీషుభాషలో వున్నందువల్ల మన ప్రజకు కలిగిన లాభం శూన్యమని తెలుసుగొని యిక ముందు మాతృభాషలోనే విద్య నేర్పాలని దేశనాయకులు అన్నారు. అపని విశ్వవిద్యాలయాలు కూడా మొదలెడుతున్నాయి. నెమ్మదిగా దేశంలో ఇంగ్లీషు దాస్యం వదుల్చుకొంటున్నాం. ఇంగ్లీషు దాస్యం వదుల్చుగోడం హిందీదాస్యం తెచ్చిపెట్టుకోడం కోసమా?

గాంధీమహాత్ముని మాటలకు నిజంగా మనమేమీ భయపడ నవసరం లేదు. ఎంచేతంటే? మన తెలుగువారి స్వభావం మన మెరుగుదుము. తెలుగువారికి కార్యోత్సాహమే గాని కార్యదీక్ష లేదని లోకమంతా యెరుగును. అంచేత హిందీ మన తెలుగుదేశంలో వ్యాపించిపోతుందని మనం జడియక్కర్లేదు. ఏదైనా యీహిందీప్రచారంవల్ల తాత్కాలికంగా నేనా తెలుగుకి కొంత నష్టం కలుగుతుంది. ఈమాత్రం నష్టమేనా మనకెందుకు కలగాలని యీ కొత్త ప్రచారం.

ఇప్పటి తెలుగుభాషయొక్క స్థితి చూద్దాం. హిందూదేశంలో తక్కిన భాషలకీ దీనికీ పోలిక యెక్కడా కనపడదు. మనము హేళన చేసే అరవభాషకంటే మన భాష యెంతో హీనస్థితిలో వుంది. మన భాషలోని పత్రికలకు కొన్ని వందల చందాదారులుండడమే అబ్బురం. హిందూదేశంలో యితరభాషలలోని పత్రికలకో, చందాదారుల సంఖ్య వేలమీదే. తెలుగుదేశంలో పత్రికా ప్రచారం సంగతి యిలాగుంది. ఇంక పుస్తకాల విషయం—మన గ్రంథకర్తలు రాసిన పుస్తకాలకు తిరిగి అచ్చుఖర్చులేనా రావడమంటూ వుండదు, వారి పుస్తకాలు వారి యిళ్లలోనే చదలపాలు కావలసిందే కాని. తెలుగువారి విద్యాభిమానమిది. అరవహోటేళ్లమీద వుండే భక్తిశ్రద్ధలు తెలుగు వారికి చదువుమీద వున్నట్టు కనపడదు. ఇటువంటి పరిస్థితులలో హిందీ నేర్చుకోడమంటే మాతృభాష కొంత కాలం వరకేనా మొదలంటా పోగొట్టుకోడమన్న మాటే. ఇప్పటి కప్పుడే చూడండి హిందీ తమాషా — తెలుగుదేశంలో 'మాధురీ' పత్రిక్కి వున్నంత మంది చందాదారులు 'భారతి'కి లేరు—సిగ్గుపడవలసిన విషయమిది, చెప్పుగోవలసివచ్చింది కూడా. క్రమేపీ హిందీ పరీక్షల కేంద్రాలు ఎక్కువ అవుతున్నాయి— ఈ హిందీపరీక్షల నిచ్చినవాళ్లలో చాలా మందికి తెలుగంటే నిరసన. హిందీ ప్రతి స్త్రీ నేర్చుకోవాలని, హిందీలోనే పురుషులు వుపన్యాసాలియ్యాలని, హిందీ నాటకభాషగా యేర్పడాలని, హిందీ ఒక్కటే నాటకరచనకు సరిపోయిన భాష అని మొదలైన పిచ్చిపిచ్చి రాతలన్నీ ఆంధ్రపత్రికలో పడుతున్నాయి. మాతృభాషాభక్తిహీనాలైన యీ రాతలను ఆంధ్రపత్రిక తన సొంత వ్యాఖ్య అయినా లేకుండా ప్రచురించినందుకు మనం యెంత విచారించాలో. ఇంక ముందు ఆంధ్రపత్రిక యిటువంటి రాతలను జాగ్రత్తతో ప్రకటించవలసిందని ప్రార్థిస్తున్నాను, హిందీప్రచారాన్ని హద్దుపద్దుల్లో వుంచి మాతృభాషకు ఉపకారం చెయ్యవలసి వుంది కాబట్టి.

అయితే హిందీ మనకు అసలే అక్కర్లేదా అంటే ఆవిషయమై కొంత చెప్తాను. హిందీ రాష్ట్రీభాష కాబట్టి కొంత అవసరముంది. ఎటువంటి వారికి అవసరముంది? కాంగ్రెసు సమావేశాల్లో చర్చల్లో పాల్గొనేవారికి—ఈసమావేశాల్లో అయినా ఉత్తరదేశస్థులు ఉర్దూలో కనక మాట్లాడడం మొదలెడితే మనవాళ్లంతా కొంతసేపు తెల్లమొహాలు వేసుగు కూచుని ఆతర్వాత దిక్కులు చూస్తూ కూచోవలసిందే. ఇతరప్రాంతాలవాళ్లెవరైనా మన తెలుగుదేశంలోకి వచ్చి

హిందీలో మాట్లాడితే వాళ్ల ఉపన్యాసాలను మన వాళ్లకి అనువాదం చెయ్యడానికి హిందీపాండిత్యం వొకరిద్దరికి ఉంటే చాలు. అంతేగాని ఓనమాలు రాని ప్రతివాడికీ హిందీ యెందుకూ? గాంధీమహాత్ముని యొక్క తక్కిన అభిప్రాయాలతో మనం యేకీభవించవచ్చు గాని యీ అభిప్రాయంతో మట్టుకు యేకీభవించి ఆత్మనాశనం చేసుకోకూడదు. ఈవిషయంలో ఆయనికి వ్యతిరేకప్రచారం దేశమంతటా చేసి మాతృభాషాభక్తి లేనిదీ దేశభక్తి అంటూ లేనే లేదని చెప్పవలసివుంది.

మనం యిప్పట్లోనే తొందరపడి మాతృభాషకు హిందీవల్ల కలిగే రవ్వంత అపకారమూ కూడా కలగకుండా చేసుకోవాలి.

తెలుగుదేశ స్థితి చూడండి. ౨౮-౫-౩౮ ఆంధ్రపత్రిక సంపాదకీయవ్యాసంలో "మహానందిలో జరిగిన యార్యవైశ్యమహిళాసభయందు శ్రీమతి లక్ష్మీకాంతమ్మకుమారిగారు ప్రసంగించుచు రాయలసీమయందు స్త్రీలు విద్యావిషయములందు వెనుకబడి యున్నారనియు, హిందీ మాట యేల తెనుగు కూడ నేర్చుకోవలసినదిగా ప్రచారము చేయవలసిన అవసర మున్నదనియు హెచ్చరించిరి" అని రాసి వుంది. చూశారా తెలుగు దేశస్థితి. తెలుగుదేశంలో తెలుగు నేర్చుకో మనే ప్రచారం చెయ్యవలసి వుంది. ఇంక హిందీ మాట చెప్పేదేమిటి! కాబట్టి హిందీ ప్రచారం కట్టిపెట్టి తెలుగు దేశంలో తెలుగు నేర్చుకో మని దేశభక్తులు ప్రచారం చేస్తారుగాక!

తా. జ. పైలేఖ రాసిన తర్వాత కొన్నాళ్లకి నేను పాతతెలుగుపత్రికలు వెతుకుతూ వుండగా 'తెలుగుదేశవాఙ్మయపత్రిక' ఒకటో సంపుటం ఎనిమిదో సంచికలో (౧౯౨౨ వ సం॥) 'ఆంధ్రజాతికి జాతీయభాష ఆంధ్రభాష గాని హిందీభాష కాదు' అనే వ్యాసం చూశాను. ఈవ్యాసం మన 'తెలుగు-హిందీ' అంశాన్ని గురించే రాయబడింది. అందరూ తెలుసుగోవలసిన చక్కని వ్యాసం. అందేత దీనిని తమపత్రికలో ప్రకటించ మని 'ప్రబుద్ధాంధ్ర' సంపాదకులను కోరుతున్నాను.

వేమల్లి కామేశ్వరరావు

౪

"ఆంధ్రుల హిందీభాషాభిమానము:—మితిమీరి వెగటు పుట్టించు స్థితికి వచ్చినది. ఆంధ్రనాయకుడు నోరు విప్పితే హిందీని అభ్యసింపు డని ఉద్బోధ. ఆంధ్రవ్యాసకర్త కలము పట్టితే హిందీ రాష్ట్రభాష యని పేర్కొనుట. హిందీభాషలో కాలముల కొలది వ్యాసములు ప్రచురించుటకు గూడ కొన్ని తెనుగుపత్రికలు నేడు విశేషశ్రద్ధను జూపుచుండుట కేవలాంధ్రాభిమానులకు విచారము కలిగింపకమానదు. మదరాసునుండి ప్రచురింపబడు హిందీప్రచారక్ పత్రికకు ఆంధ్రదేశములో ఉన్నంతమంది చందాదారు లైనను యే ఒక్క ఆంధ్ర మాసపత్రికకును ఆఆంధ్రదేశముననే లేరని చెప్పుట సత్యదూర మనిపించుకొన దని మా నమ్మకము. ఇట్లు తన దైనదానిని తలయెత్తి చూడకపోవుట, తన్నులాడినను తనది కాని దానికై ఇంత మోజుపడుట ఆంధ్రుడు స్వధర్మము నేమరుచున్నా డనుటకు చక్కని నిదర్శనము కాగలదు. బెంగాలీవాడు గాని, మహారాష్ట్రుడు కాని, తుదకు సాంబారుస్వామి అని మనము ఆక్షేపించు అరవవాడు కాని హిందీ అనిన నేటి ఆంధ్రు డట్లు పడి ప్రాకులాడుచున్నట్లు కానము. తన భాషనుగూడ మరచిపోవజాలు ఆవేశముతో ఆంధ్రుడు హిందీని సేవించుచున్నాడు. హిందీపుస్తకములు, హిందీమాసపత్రికలు కొనుటకు ఆంధ్రులు వెచ్చించుచున్న ధనము ఆంధ్రపుస్తకములు, ఆంధ్రమాసపత్రికలు కొనుటకు వెచ్చించుచో మన గ్రంథకర్తల స్థితియు, పత్రికానిలేఖకుల స్థితియు నేడు ఉన్నంతటి శోచనీయస్థితిలో ఉండకుండును. పత్రికలు తెప్పింప కేటాయించుకొన్న ధనములో మూడు నాలుగు హిందీ మాసపత్రికలకు అర్థరిచ్చి

ఇక తెలుగు పత్రికలను తమ గ్రంథాలయములకు ఉచితముగ తెప్పించుకొను ప్రయత్నమున ఉత్తరములమీద ఉత్తరములు వ్రాయుటకు గాను కాలమును తపాలాబిళ్లలను వ్యయము చేయుటకు జంకని గ్రంథాలయపాలకులు ఒక సారి తమ మూలమున ఆంధ్రసారస్వతమునకు లాభము లేకపోగా విశేషమైన కష్టము, నష్టము గలుగుచుండుటను గమనించుట లెస్స. ఆంధ్రుని హిందీభాషాభిమానము అతనికి భారతరాజ్యాంగమున కలుగవలసినంత పలుకుబడిని కలిగింపకపోగా ఆంధ్రసారస్వతాభివృద్ధికి ఒక గొప్ప అడ్డంకిగా నున్నది. విధము చెడుచున్నది; ఫలమును కలుగుట లేదు. ఆంధ్రు డీసిలిని ఇక నైన తొలగింపకుండుట వివేక మనిపించుకొనునా?" ఆంధ్రభూమి (జూన్)

"ప్రస్తుతము మన యాంధ్రులకు బొరుగింటి పుల్లకూర రుచి యైపోయినది. మనవారు మన దేశభాషాభిమానమును విడిచి తెనుగుతల్లిని గౌరవించుట మాని, హిందీభాషాభ్యాసమున మునిగియున్నారు—దాని వలన తెనుగు భాష యభివృద్ధిని పొందుటకు తీరని కొరత కలుగుచున్నది"

"హిందీభాష యభ్యసించుట తప్పని మాయభిప్రాయము గాదు. హిందీ హిందూస్థాన మంతటికి రాష్ట్రభాష యగుట కర్తవ్యమైయున్నది; కాని యాంధ్రమును విడిచిపెట్టి మాత్రము హిందీ నభ్యసించుట యుచితము కాదు. తెనుగుభాష హిందూదేశమున గల భాషలలో ద్వితీయ స్థానము నలంకరించి యున్నది. తెనుగు హిందూదేశమునందలి ఆంధ్రేతరుల మన్ననలకే గాక ఖండాంతరుల మన్ననలను గూడ మిక్కిలి పాత్రమై యున్నది. అది మిక్కిలి మధుర మగు భాష. విశేషించి యాంధ్రు లందరకిని కన్నతల్లి"

"కావున దేశభాషాభిమాను లగు నాంధ్రు లెల్లరును హిందీభాష యెడల బూను శ్రద్ధలో సగమైనను ఆంధ్రభాషపట్ల జూపిన భాషయును వాఙ్మయమునకును వన్నెయు వాసియు జేకూరగలవు"

చంద్రిక (జూన్)

---

# భారతదేశపు నాణెములు

## మాకేమండ రామారావుగారు ఎం. ఏ. బి. ఇడి

శాసనములు, వాఙ్మయము, కట్టడములు, సమకాలికుల వ్రాతలు, స్థానిక గాథలు, నాణెములు మున్నగునవి చరిత్రమును రచించుట కుపకరించు ముఖ్యాధారములు. ఇందు నాణెములు సాధారణముగ నితరాధారములనుండి దెలియ నగు నంశములను బలపరచునవే యైనను, భారతదేశచరిత్రమును దెల్పు నెడ మాత్రము కొన్నికొన్ని సందర్భములలో ప్రత్యేక ప్రాముఖ్యము గలవిగ నున్నవి. వీనినుండి తెలియ నగు విషయము లెన్నియో మరి యే యితరాధారములనుండియు తెలియుట లేదు. కాన నీనాణెముల ప్రత్యేకోపయోగ మీవ్యాసమున సంగ్రహముగ జర్చింపబడును.

౧. రాజకీయ చరిత్రము:—క్రీ.పూ. ౨౫౦ నుండి క్రీ. శ. ౩౦౦ వరకును మనదేశమునందలి పశ్చిమోత్తర ప్రాంతమును బాక్ట్రియనులు, సిథియనులు, పార్థియనులు, కుషానులు నను తెగలవారు పరిపాలించిరి. బాక్ట్రియనులను గూర్చి కొందరు విదేశీయుల వ్రాతలు గొన్నివిషయములను దెల్పుచున్నను, వారు ౩౭ గురు రాజు లనియు, వారి వంశక్రమమును, కేవలమును నాణెములనుండియే తెలియుచున్నది. వారికి సమకాలికులుగ నుండిన సిథియనుల చరితము నట్టిదే. అటులే కుషాన్ రాజులలో కనిష్కునికి బూర్వ ముండిన యిర్వురు కాడ్ ఫైసిస్‌ల వృత్తాంతమునకును నాణెములే

ముఖ్యాధారములు. కతియవార్ మాల్వాలపై నధికారము జేసిన పశ్చిమక్షాత్రపుల నామములు, వంశక్రమము, కాలములును గూడ నాణెముల వలననే స్పష్టము అగుచున్నవి. ఏవంశమువార లేవంశీయులను జయించిరో, ఎవరి కెవరు సామంతులో, ఏయే రాజ్యము లెంతవరకును వ్యాపించినవో తెలిసికొనుటకు భారతదేశపు ప్రాచీననాణెములు మిక్కిలి తోడ్పడుచున్నవి.

౨. పరిపాలనా విధానము:—పూర్వకాలమున మనదేశమునందుండిన పరిపాలనావిధానమును తెలిసికొనుటకు గూడ నాణెము లుపకరించుచున్నవి. మహాభారతమునందలి శాంతిపర్వము నుండియు, కౌటిల్యుని యర్థశాస్త్రమునుండియు, కొన్ని శాసనములనుండియు బూర్వము సాంఘికప్రభుత్వము ముండెడి దనియు నందు గణముల పరిపాలన మొక విధ మనియు తెలియుచున్నది. ఈపరిపాలనా విధానము పాశ్చాత్యుల Oligarchy కి సరి యగును. ఇందు స్వార్థపరులగు కొలదిమంది మాత్రము పాలనము సాగింతురు. ఈ విషయమును నాణెములు స్థిరపరచుచున్నవి. మాలవ, యౌధేయ, వృష్టి గణముల నాణెము లింతవరకును బరిశోధకులకు దొరకినవి. అటులే పట్టణములలో నైగమములనియు, పల్లెలపై జానపదము లనియు రెండు విధముల ప్రజాస్వామిక ప్రభుత్వములు సాగుచుండినవి. పంజాబులో దొరకిన కొన్ని నాణెములపై నొక వైపు "నైగమా" యనియు రెండవ వైపు "దోజక" "తాలిమత" "అటకటక" మున్నగు నామములును గలవు. వానినుండి ఈరెండవ వైపున నుండు నామములు పట్టణముల వనియు నివి యన్నియు నైగమము లనియు నూహింపదగును. ఇందువలన ప్రాచీన గ్రీసుదేశములో వలెనే భారతదేశమున గూడ స్వతంత్రములును, ప్రజాస్వామికములు నగు పట్టణములు (Autonomous and Democratic city-states) గల వని తెలియుచున్నది. అటులే మరికొన్ని ప్రాచీననాణెములు "రాజన్య జనపదము"ను "సిబిజనపదము"ను పేర్కొని యప్పటి రాష్ట్రీయ ప్రజాస్వామిక ప్రభుత్వములను దెల్పుచున్నవి. ( Provincial Democracies)

3. ప్రజల చరిత్రము:—ప్రాచీనకాలమున మనదేశ మేయే విధముల విభజింపబడి యేయే భాగ మేయే రాజులచేతను, ప్రభుత్వములచేతను పాలింపబడినది యను సమస్యకు గూడ నాణెములు చక్కని యుత్తరము నియ్యగలవు. మహాభారతమునను పాణినియ సూత్రములందును యౌధేయగణముయొక్క ప్రశంస గలదు. ఈ యౌధేయులు క్రీ. శ. ౧౫౦. లో రుద్రదాముడను శకరాజునకు, ౩౫౦. లో సముద్రగుప్తునికిని బ్రత్యర్థులుగ నుండిరని శాసనములు దెలుపుచున్నవి. వీరి నివాసమును గన్గొనుటకు నాణెములే మూలాధారములు. అవి పంజాబునందలి తూర్పుభాగమునను, సట్లెజ్ యమునానదుల మధ్యను దొరకినవి. వీనిని బట్టి నేడు జోహియా—బార్ అని పిలువబడు సట్లెజ్ నదీతీరమున స్థిరపడిన జోహియాలనువారు ప్రాచీనయౌధేయుల సంతతివారని కన్నింగ్‌హాం పండితునిచే నిర్ణయింపబడినది. మఱియొక యుదాహరణము మాలవగణము. నేడు మాల్వా యని పిలుబడు దేశమునకు మాలవు లను తెగవారట స్థిరపడిన పిమ్మటనే వచ్చినది. అలెగ్జాండరు కాలమున నీమాలవులు "మల్లోయ్" అను పేరుతో పంజాబులో నుండిరి. దీనిని బట్టి మొదట పంజాబులో నివసించు చుండిన యీమాలవులు తర్వాత మధ్యదేశమునకు వచ్చిరని తెలియుచున్నది నాణెము లీయూహను బలపరచి వీరు మాల్వాకు వచ్చుటకు పూర్వ మెటనుండిరో దెలుపుచున్నవి. రాజపుత్రస్థానములోని జయపుర రాజ్యములో మాలవగణముయొక్క నాణెములు విశేషముగ లభించినవి. అయ్యవి క్రీ. పూ ౧౫౦ నుండి ౨౫౦ వరకును గల కాలమునకు జెందినవి. దానిని బట్టి మాలవు లీకాలమునందు రాజపుత్రస్థానమునం దుండి రని

స్పష్టమగుచున్నది. అప్పుడు మధ్యదేశమున క్రీ. శ. ౧౦౦ లో పాలించిన ఉషవదత్తునికి మాలవులతో యుద్ధ మెటుల సంభవించెనను చారిత్రక సమస్య నిర్ణయింప వలనుపడుచున్నది. పతంజలి తన మహాభాష్యమున నెవ డైనను తాను స్వయముగా చూచిన భూతకాలమందలి యొక విషయమును జెప్పవలసిన రీతికి "అరుదత్ యవనః సాకేతం" (యవనుడు సాకేతనగరము నడగించెను) "అరుణత్ యవనో మధ్యమికాం" యవనుడు మధ్యమికానగరము నడ్డగించెను) అనిరెం డుదాహరణముల నిచ్చియున్నాడు. ఇందలి మధ్యమికానగర మెద్ది యను సమస్యను పరిష్కరించుటకు నాణెములు మాత్రమే తోడ్పడుచున్నవి. శిబిగణముయొక్క నాణెముల నుండి మధ్యమికా యను నది వారినగర మనియు, వారు గొంతికాలము రాజపుతానాలోని చితోర్ ఘర్ జిల్లాలో నుండి రనియు దెలియుచున్నది. వీనిని బట్టి డాక్టరు భండార్కరుపండితునిచే చితోర్ ఘర్ కు దగ్గర నున్న ప్రాచీనదుర్గశిథిలములు గల నగరీ యను పట్టణమే మధ్యమికా నగర మని నిర్ణయింపబడినది.

౪ మతము :— నాణెములు మతచరిత్రమునకు గూడ మిక్కిలి యుపకరించుచున్నది. వీనినుండి తాత్కాలికమతపరిణామము గోచర మగుచున్నది. ఈసందర్భమున బశ్చిమోత్తరమునుండి భారతదేశముపై దండెత్తి వచ్చిన విదేశీయు లీదేశమున స్థిరపడి హిందూమతము నవలంబించి హిందూసంఘమున గలసిపోవుట ముఖ్యముగ జేర్కొన దగిన యంశము. ఈవిషయమున నాణెము లమూల్యము లగు వింతలను వెలిబుచ్చుచున్నవి. పార్థియనురాజగు గాండోఫారిస్ నాణెములపై నొక వైపున త్రిశూలధారి యగు శివుని విగ్రహము గలదు. ఇదే చిత్రమును నందివ్యాఘ్రచర్మములును కుషాన్ రాజులలో రెండవవా డగు వీమాకాడ్ ఫైసెస్ నాణెములపైనను గలవు. దీనినుండి విదేశీయు లగు రాజులు బ్రాహ్మణమతానుయాయులై శివభక్తులుగ నుండినటుల స్పష్ట మగుచున్నది. కనిష్కహువిష్కుల కాలమున నొక విధ మగు పరివర్తనము జరిగినది. వారి నాణెములపై కొలది మంది గ్రీసుదేవతలను విశేషముగ పర్షి యను దైవములను, కొంతమంది హిందూదేవతలను గాంచనగును. ఈవిధమున కనిష్కచక్రవర్తి కాలమునం దప్పటి మతములలోని దేవత లందరు నారాధింపబడుచుండి రను ముఖ్యాంశము మనకు నాణెముల మూలముననే తెలియుచున్నది. ఇదే విధమున నాచక్రవర్తి నాణెములపై నుండు బుద్ధుని బొమ్మ కూడ మతచరిత్రమునకు మిగుల ముఖ్య మైనది. నిశ్చయముగ కాలనిర్ణయ మొనర్ప దగిన బుద్ధవిగ్రహములలో నిదియే మొదటిది. మానవరూపమున గౌతమబుద్ధుని జిత్రించుట కిదియే మొదటి పర్యాయము. ఇంతకు బూర్వపు శిల్పములలో బుద్ధ డొక సాంకేతికముచే నిరూపింపబడుచుండెను. శివునితో పాటు హువిష్కుని కాలమునుండి నంది, స్కందుడు, కుమారస్వామి, విశాఖుడు, మహాసేనుడు మున్నగు వారు గూడ నారాధింపబడుచుండు నటుల నాణెములనుండి తెలియుచున్నది. ఈరాజులు హిందూమతమునే గాక హిందూనామములను సహితము బరిగ్రహించినటుల నాణెములు తెల్పుచున్నవి. కుషాన్ రాజులలో నైదవ వా డగు వాసుదేవు డిందుల కొక యుదాహరణము. క్రీ. శ. ౨ వ శతాబ్దములో సురాష్ట్రమాలవదేశముల నేలిన చష్టనవంశీయు లగు రాజులు ౨౭ గురిలో నిరువది యైదుగురికి హిందూనామములే యుండినటుల వారి నాణెములు దెలుపుచున్నవి. మతాచారములను గూర్చి కూడ నాణెముల వలన గొన్ని సంగతులు తెలియుచున్నవి. ఇందు శివుని యారాధనలో జరిగిన పరివర్తనములు ముఖ్యములు. నేడు సామాన్యముగ నాదైవము లింగరూపముననే యారాధింపబడుచున్నాడు. గుప్తయుగారంభమున నీయాచార మాచరణములోనికి వచ్చినది. దక్షిణ

హిందూదేశములోని గుడిమల్లం అను చోట లింగమొుక్క చిత్రము గన్గొనబడినది. అది క్రీ. శ. ౨ వ శతాబ్దము నాటిది. ఇందు లింగమునకు ముందు వైపు శివుని విగ్రహము వ్రాయబడియున్నది. దీని వలన ౨ వ శతాబ్దము నాటి కింకను మానవరూపమున శివుని ఆరాధించుట పోయి తచ్చిహ్నముగ లింగము మాత్రమే విజృంభించలేదని తెలియుచున్నది. ౨౩౬ నాటి యొక శాసనము లింగము క్రింద చెక్కబడి భగవాన్ మహాదేవః యని పేర్కొనుచున్నది. ఈ కాలమునకు లింగమునకును శివునికిని ఐక్యము స్థిరమై లింగము శివునికి కేవలచిహ్నముగ బరిణమించియుండును. ఇదివరలో వర్ణింపబడిన సిథియను, కుషాన్ రాజుల నాణెములపై నుండు శివుని మానవాకృతి శివారాధనము నందలి ప్రాచీనతమస్థితిని దెల్పుచున్నది. క్రీ.పూ. ౨వ శతాబ్దము నందుండిన పతంజలి కాలమున గూడ నారాధనమునకై శివుని రూపమే చేయబడుచుండెడిదని యాతని మహాభాష్యమువలన తెలియుచున్నది. అనగా శివారాధనలో మొట్టమొదట శివుని యాకృతియు బిమ్మట మూర్తియు లింగమును గలసియు, కడకు లింగము మాత్రమును సాధనములుగ నుండినవని పై చర్చలవలన తేలుచున్నది. మఱియు నీనాణెములపై స్కంద, కుమార విశాఖ మహాసేన యను శైవదేవతలు ప్రత్యేకముగ జిత్రింపబడుచున్నారు. పతంజలికూడ వీరిని బ్రత్యేకముగ వివరించియున్నాడు. అమరకోశమున పైనలుగురు దేవతలకు నొకొక్క శ్లోకపాదమున నితరనామము లీయబడినవి. అధునికులు శ్లోకమున గల ౧౭ నామములును కుమారస్వామివని యెంచుచున్నారు; కాని నాణెములను బట్టి యీయూహ సరియైనది కాదనియు, నమర శ్లోకమున నొకొక్క పాద మొకొక్క దేవతను గూర్చి తెల్పు ననియు చెప్పవలసియున్నది.

ఇట్లు నాణెములు భారతదేశవైభవపరిజ్ఞానమును దెలిసికొనుట కమూల్యము లగు సాధనములు. రాజకీయ ప్రభుత్వ మతాచారచరిత్రములను చారిత్రక భూగోళమును దెలియుటకు నవి ముఖ్యాధారములు.

# తగిన శాస్త్రి

కొవ్వలి లక్ష్మీనరసింహారావుగారు

ఎన్నో రోజుల్నుంచి నాహృదయంలో చిత్రించుకొంటూన్న ఆఅమ్మాయిని తప్ప ఇంకెవళ్లనూ పెళ్లి చేసుకోనని వచ్చిన సంబంధాల నన్నిటిని వెళ్లగొట్టాను. చందమామలాంటి ముఖం—నొక్కునొక్కుల జుట్టు—నవ్వితే సొట్టలు పడే నునుపైన లేతచెక్కులు—నల్లటికళ్లు—కళ్లకంటే నలుపై, ఉంగరాలు తిరిగిన ముంగురులు—ఉండి, మరీ పొడుగూ కాకుండా, మరీ లావు మరీ సన్నమూ కాకుండా ఉండి నవ్వితే విలాసం ఒలికిపోయే అమ్మాయిని చేసుకోవాలని నాఊహ.

అటువంటి వాళ్లు పుస్తకాల్లో తప్ప ఇంకెక్కడా కనపడరని ఎందరు చెప్పినా నేను వప్పుకోలేదు. అటువంటి అమ్మాయి దొరికినప్పుడే చేసుకుందామని ఊరుకొన్నాను. 'వెర్రివెంగళాయి గొంతెలమ్మ కోరికలు పెట్టుగుని వచ్చిన సంబంధాల నన్నిటిని వెళ్లగొడుతున్నాడు' అని మావాళ్లందరూ నన్ను నిందిస్తూనే ఉండేవారు. అందరూ అంటున్నారని ఎవళ్లనో ఒకళ్లను చేసుకొని తృప్తిపడడమెలాగు? నేననుకొన్న అన్ని లక్షణాలం కలిగిన అమ్మాయి దొరికిన నాడే నాజీవితంలో

నిజమైన మాధుర్యం ఉంటుంది; సంసారంలో సుఖం ఉంటుంది.

నేను చక్కనివాణ్ణి కాకపోతే మాత్రం నాకు చక్కటి పిల్ల దొరకకూడ దని ఎక్కడయినా ఉందా యేమిటి? అయినా నాఅందంలో ఏమి లోటుంది రంగు నలుపన్న మాట కాని? కాకపోతే పొట్టి. దేవు డిచ్చిన స్ఫోటకపు మచ్చలకు మన మేమి చేస్తాము? మసూచికంలో చెయ్యి వెనక్కు లాక్కొనిపోయిన సంగతి ఎంతో పరీక్షగా చూస్తేనే కాని తెలియదు కదా! కోతివెధవలు, కాలేజీ కుర్రాళ్లు 'పొట్టగుమ్మటం' అని అంటే మాత్రం నాకు ఏమి లోటు? నాకున్న ఆస్తీ, చదువూ ఇంకెవళ్ల కుందేమిటి? ఇంతకూ, నేను అనుకొంటూన్న అమ్మాయి దొరకాలి, అప్పుడు నా అదృష్టం బయటపడాలి.

నాకు రోజూ అదే దారి, కాలేజీనుంచి ఇంటికీ— ఇంటినుంచి కాలేజీకీని. నేను అనుదినం ఆమార్గాన్నే వస్తూ పోతూ ఉండేవాణ్ణి. అదొక చిన్న సందు. ఒకనాటి సాయంకాలం ఆసందులో ఒక యింటి అరుగుమీద నిలుచున్న అమ్మాయిని చూడగానే నాశరీరంలో ఏదో విద్యుచ్ఛక్తి ప్రవహించినట్లయింది. నా అభిరుచిని కనిపెట్టి భగవంతుడు ఆఅమ్మాయిని సృష్టించి ఉండాలి. లేకపోతే అటువంటి సౌందర్య మెక్కడుంటుంది? ఏమైతే నేం! నాకోరిక ఫలోన్ముఖ మయింది కాబోలు. సరీగా నేననుకొన్న ఆచందమామ ముఖం — నొక్కునొక్కుల పెద్ద జుట్టు—నల్లటి కళ్లు—ఇన్నెందుకు? నేకోరిన వన్నీ ఆఅమ్మాయిలోనే ఉన్నాయి. కొంచెం దూరాన్నుంచి చూసి దగ్గర కొచ్చేటప్పటికి ఆఅమ్మాయి మెరుపులా మెరిసి, ఇట్టే లోపలకు వెళ్లిపోయింది. ఆఅమ్మాయి నడచినప్పుడు నిజంగా విలాసం ఒలికిం దంటే నమ్మండి. వెనుదిరిగినప్పుడు మాసిన అవాలుజడ నన్ను తినేసినంత పని చేసింది. సరే. ఇంక ఆఅమ్మాయి ఎవరితాలూకో, ఆ యిల్లెవరిదో తెలిసికోవాలి. ఆఅమ్మాయి కింతకు ముందే పెళ్లి అయివుంటే నాగతి ఏమి కావాలి? కాకపోతే మాత్రం నన్ను పెళ్లాడుతుం దన్న మాటేమిటి? అబ్బే! అయి ఉండదు...ఆ! పదహారేళ్లుంటాయి. ఇంతవరకూ కాకుండా ఉంటుందా?... ఇలాగున ఏమేమో ఆలోచించుకొంటూ యింటికి వెళ్లిపోయాను. ఆవేళ నాకు పరమానంద మయిపోయింది. మళ్లీ ఆ అమ్మాయి నెప్పుడు చూద్దామా అని, ఆమె వివాహం సంగతి నెలా తెలుసుకొందామా అని, నాహృదయం తహతహలాడిపోయింది.

ఇంతలో దేవు డల్లే ఆఅమ్మాయి ఇంటి కెదురుగా ఉన్న నాస్నేహితుడు మాయింటి కొచ్చాడు. ఆ అమ్మాయి సంగతిని వాణ్ణి నేను రహస్యంగా అడిగాను. ఆయింటిలో ఉన్న శంకరంగారికి ఆ అమ్మాయి మనుమరా లనిన్నీ, గుంటూరునుంచి నిన్ననే వచ్చిం దనిన్నీ ఆమె కింకా పెళ్లి కాలే దనిన్నీ చెప్పి నాసంతోషాన్ని రెట్టింపు చేసాడు.

రోజూ నేను వచ్చేవేళకు ఆఅమ్మాయి వాళ్ల యింటి కిటికీదగ్గర నిలుచుండేది. తన నల్లని కళ్లల్లోనుంచి వలపుచూపుల్ని నామీద కురిపించేసేది. ఒక్కొక్కప్పుడు ఆఎర్రని కెంపులాంటి పెదవుల మీద చిరునవ్వు కూడా ఎందుకో చిందులాడేది. అలా నవ్వినప్పు డల్లా ఆమె చెక్కులమీద పడే గుంటలను నేను తదేకదృష్టితో చూసేవాణ్ణి. ఇంటి దగ్గర ఉన్నంతసేపూ ఎప్పుడు కాలేజికి వెడదామా అని, కాలేజీలో ఉన్నంతసేపూ ఎప్పు డింటికి వెడదామా అని, ఉండేది కాని ఇంకే పనీ తోచేది కాదు నాకు. ఇంతకూ ఆఅమ్మాయిని చూడాలనే! ఇలాగు కొన్ని రోజులు గడచాయి. రోజురోజుకూ ఆఅమ్మాయిలో క్రొత్త అందం కనుపించేది నాకు.

ఓనాడు నేను మామూలుగా ఆమార్గాన్ని వస్తున్నాను. ఆఅమ్మాయి కనుపించలేదు. నాగుండెలు వేగంగా కొట్టుకోవడం మొదలుపెట్టాయి. ఆ

గుమ్మంలో నిలుచున్న ఎవరో ఒకాయన 'అబ్బాయీ! మాట' అని నన్ను పిలిచాడు. దానితో నా అదటు మరీ ఎక్కువయింది. ఎప్పుడూ లేని భయం కలిగింది. నిర్ఘాంతపోయి, చెదరిపోయిన హృదయంతో ఆగుమ్మంముందు అలాగే నిలిచిపోయాను. ఆయన మళ్లీ 'లోపలకురా!' అన్నాడు. నాకు తెలియకుండానే నా కాళ్లు నన్ను గుమ్మం ఎక్కించి లోపలకు తీసుకొనివెళ్ళాయి. ఆక్రొత్త మనిషి కూర్చోమని నాకో కుర్చీని చూపెట్టాడు.

'నాయనా! ఎవరబ్బాయివి?' అని నేను కూర్చున్నాక అడిగాడు. నేను ఎలాగో ధైర్యం తెచ్చుకొని ఈవెనకాల వీధిలో ఉన్న వెంకటేశ్వర్లుగారి అబ్బాయిని' అని సమాధానం చెప్పాను.

'నిన్ను గురించి దరియాప్తు చేసి నేను సర్వం తెలిసికొన్నాను. నువ్వు అనుదినం చూసే అమ్మాయి నాకుమార్తె. ఆమె నిన్ను హృదయపూర్వకంగా ప్రేమించింది. నీకిష్టమయితే రేపే వివాహం జరగాలి. కాలయాపన చెయ్యడానికి వీలు లేనటువంటి పరిస్థితులు వచ్చాయి. కట్నం కానుకలు ఇచ్చుకోలేని పరిస్థితులు మావి.' అని అన్నాడాయన. ఆయన చెప్పే ఒక్కొక్క మాటా వింటూంటే నాహృదయంలో ఒక్కొక్క సంతోషతరంగం పొంగి ప్రవహించిపోయింది. రెండు నిమషాలు ఆలోచించాను. సిరిరా మోకాలు ఒడ్డేవారెవరుంటారు? ఎన్నో నాళ్ళనుంచి కళ్ళు కాయలు కాసేటట్టు వెతుక్కుంటూ ఉన్న సౌందర్యమూర్తి నేడు దైవవశాత్తూ లభించినది. కాని కట్నం లేని ఈసంబంధాన్ని నాన్నగారు ఒప్పుకోరని నాకు బాగా తెలుసు. అందుచేత రెండో కంటివాడికి తెలియకుండా యీపని జరిగించి, ఆ అపురూపతేజోరాశితో శాశ్వతసుఖం అనుభవించడానికి నిశ్చయించుకొన్నాను. ఈసంగతి నేను ఆయనతో చెప్పి వివాహం అతిరహస్యంగా జరిగిపోవాలన్నాను.

ఆమరునాడే మావూరికి నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న గోపాలస్వామి ఆలయంలో నేను కోరుకొన్న పిల్లకూ నాకూ పెళ్ళి జరిగిపోయింది. పిల్లతరపువాళ్లు మాత్రం కొద్దిమంది వచ్చారు. నాతరపున ఒక్కస్నేహితుడే. నాతలిదండ్రులకూ—ఇతర బంధువులకూ ఈపెళ్ళి సంగతి అసలు తెలియనే తెలియదు. మూడుముళ్ళూ పడ్డాక చెబుదామని నాయూహ. అయిదువేల రూపాయిలు నష్టం చేసినందుకు నాన్నగారు తిట్టకమానరు. అయినా పాలకోసం రాయిమొయ్యాలి అన్నారు కనుక జీవితానందం కోసం ఏబంధువులను లక్ష్యంచెయ్యకుండా స్వతంత్రించి ఈపని చేసాను. కనుచూపుమేరలో ఉన్న ఆనంద మహాసముద్రాన్ని తలుచుకొన్నప్పుడు నాకింకేమీ కనబడలేదు. అది రజస్వలా వివాహము కనక పెళ్ళినాడే యథావిధిగా పునఃసంధానం చెయ్యడానికి ఏర్పాటు లన్నీ చేసారు. నాజీవిత పరమావధిని నేను చేరగలిగినందుకు ఉప్పొంగిపోయాను. నావంటి అదృష్టవంతుడింకొకడు ఉండడని భావించి మురిసిపోయాను.

కాని ఆ అత్యున్నత ఆనందసౌధాన్నుంచి ఒక్కసారి అధోలోకంలోకి క్రుంగిపోయాను. ఇంతకుముందు నేను పెళ్లిచేసికోనని తిరస్కరించిన బాలిక లందరూ నవ్వుతూ కేరింతాలు కొడుతూ నన్ను వెక్కిరిస్తూ ఉన్నట్లు నాకళ్ళకు ఇప్పుడు కూడా కనిపిస్తూంది. నాకు తగిన 'శాస్త్రి' అయినందుకు బంధువు లందరూ సంతోషించారు.

ఆశ్చర్యం! పునఃసంధానపు రాత్రివరకూ ఆపిల్ల మూగదైనట్లు నాకు తెలియనే తెలియలేదు. ఇంకేముంది?

# చంటిపిల్లలు చనిపోవడం

శ్రీ కృత్తివాస తీర్థులుగారు

కుమారుడు చనిపోవడంతోటే ఒక గ్రీకు వేదాంతి దుఃఖపడినాడు. ఎవరైనా దుఃఖించి లాభం ఏమున్నదని ప్రశ్నిస్తే 'నేను అందుకోసమే ఏడుస్తా'నని ప్రత్యుత్తరం ఇచ్చాడు. వేదాంతులు గతంకోసం కన్నీరు కార్చరని మనము అనుకొంటాము. కాని వారి నేత్రాల్లో కూడా దుఃఖపు వూట వూరుతూనే వుంటుంది. అల్లా దుఃఖపడకుండా వుండడం కొన్ని సమయాల్లో అవివేకాన్ని ప్రకటిస్తుంది. 'దుఃఖం అనుభూతమైన కష్టాలకు విస్మృతి కలిగిస్తుంది. ప్రథమంలో ఆదుఃఖం అతీతం కావచ్చును; అయితే అది క్రమంగా ఎండి బీటలు వారిన హృదయకేదారానికి వర్షపాతం లాగ వర్తిస్తుంది; హృదయాగ్నిని చల్లార్చివేస్తుంది, మనస్సుకు శాంతి ఘటిస్తుంది.

కొన్ని దుఃఖాలు మట్టుకు భరించడం చాలా కష్టం. అలాంటి సమయాలలో మనశ్శక్తిని వినియోగించి దుఃఖప్రవాహ వేగాన్ని నిరోధించాలి; దుఃఖాన్ని స్మృతికి తెచ్చుకోకుండా వుండడానికి ప్రయత్నించాలి; అయితే కొన్ని దుఃఖాలు మనస్సుకు క్రమంగా శాంతినిస్తాయి. మొదటి సారి పుట్టిన దుఃఖాన్ని అణచి వేసుకోమని చెప్పే బూటకపు వేదాంతానికి వేదాంతమే చెయ్యాలి. గడచిపోయిన దానికి వగచి లాభము లేదని చెప్పేవారి సానుభూతివల్ల ప్రయోజనం సున్న. ఆ స్వల్పమైన దుఃఖాల స్వరూపం శాంతమైనది; వ్యాజమైన సానుభూతికన్న గంభీరంకన్న, ఉత్సాహంకన్న అవి ఎన్నోరెట్లు మంచివి. ఇల్లాంటివే చంటిపిల్లలు చనిపోవడంకూడా. చంటిపిల్లవాడు పోయాక వెంటనే మనం చాలా దుఃఖపడతాము. జననీజనకులు ఆ ప్రథమ సంతాపాన్ని ఎంతమాత్రమూ అరికట్టుకోలేరు. అందులో తల్లి బొత్తిగా పుత్ర దుఃఖాన్ని సహించలేదు, వారు నెమ్మది మీద ఆదుఃఖం తగ్గిపోయాక తదితర పిల్లల్ని చూసుకొంటూ దుఃఖం దిగమింగుకోవడం లేక ఉపశమించుకోవడమో చేస్తారు. ప్రథమ సంతాపం పడకపోవడమంటే వాళ్ళ హృదయాలు కఠినములై ఉండాలి, లేక అతి గంభీరలై ఉండాలి, అదీకాక పోతే వాళ్ళు సామాన్య మానవులు కాకపోవచ్చును. మానవ స్వభావానికి పరితాపం సహజం; అయితే ఈసామాన్య సూత్రమునకు భిన్నంకూడా వుండవచ్చును.

చంటిపిల్లలు చనిపోయాక జనించిన ప్రథమ సంతాపం మహావేగంతో జలపాతంలాగ ప్రవహించి, క్రమంగా శాంతంగా ప్రవహించే సమతలంలోవున్న కాలువలాగ వర్తిస్తుంది. మనకు ఎంత ఆప్తహృదయుడైన మిత్రుడు చనిపోయినా ఆజన్మాంతం వకటేతీరున దుఃఖం తీవ్రరూపందాల్చి వుండదు. కాలం అనేది చెదపురుగులాంటిది; అది దుఃఖాన్ని క్రమంగా తినేస్తుంది. కాబట్టి కాలానికీ దుఃఖానికీ పరస్పరం విరోధము. కాలంగడిచిన కొద్దీ దుఃఖం క్రమంగా తగ్గిపోతూవుంటుంది. చనిపోయాక చంటివాళ్లు మనస్మృతి పథంలో విహారం చేస్తోవుంటారు. వారి విషయాలన్నీ మనకు తలపుకు వస్తూవుంటాయి. వారినిగురించిన స్ఫురణ కాలం గడిచినకొద్దీ మనకు హాయిని కల్గిస్తుంది. మనభావనా పథాల్లో వాళ్లు వుంటూనేవుంటారు. నేనిప్పుడీ వ్యాసం రాస్తున్నప్పుడు కిటికీఎదుట కూర్చొన్నాను. కిటికీలోంచి తొంగిచూస్తే, నన్ను తనప్రాణసమంగా ప్రేమించిన యువతి భస్మసాత్కృతమైపోయినతర్వాత ఆదివ్య రేణువుల సముదాయం కనిపిస్తూవుంటుంది. ఆమె పేరట చిన్ని అందమైన స్మృతిచిహ్నంగా స్థూపంలాటిది ఒకటి నిర్మించుకొన్నా. దానిచుట్టూ విశాలములైన సస్యక్షేత్రాలు మనోహరంగా ఉన్నాయి. చిరుగాలికి ఆకులూ, కంకులూ అల్లల్లాడుతో స్థూపానికి వింజామరలు

చేస్తున్నట్టున్నాయి. మేఘశకలాలు సూర్యరశ్మిని కొంతహరిస్తూ, కొంతవిడిచిపెడుతూ ప్రయాణిస్తున్నాయి. వసంతవాయువు కమ్మని సువాసనలు కొల్లగొట్టి, నన్ను ప్రేమించిన యువతి దగ్గరనుంచి సందేశాన్ని తెస్తోంది. అక్కడ ఆస్తూపం వుండడం మూలాన ప్రకృతికి ఎంతో నవకం వచ్చింది. అవసంతకాలపు లేతగాలి తరగలకు ఆలాలిత్యం, ఆసౌకుమార్యం, ఆ ఆనందం ఎక్కడినుంచి వచ్చింది? ఆపశ్చిమదెస సంజకాంతుల్లో తళుకు ఎల్లావచ్చింది? ప్రకృతికి అంత సౌకుమార్యం ఎక్కణ్ణించివచ్చింది? వాటి అన్నింటికీ ఆస్తూపం కారణం—ఆమెనుగూర్చిన తలపులునాకు బాధాకరాలుకావు. అయ్యో అలా కూడా అనకూడదు. నాకు ఆనందం సౌఖ్యం ఆమె చింతనమువల్లనే—ఆమె ఈఐహికరంగం నుంచి నిష్క్రమించినా, హృదయం మాత్రం వుండనే వున్నది. స్తూపంమీదనుంచి వచ్చిన గాలులను ప్రశ్నిస్తోవుంటూ ఆమెవిషయం. ఆమె పెదవి మీద చిరునవ్వు మొలకలు, ఆముఖంలో లావణ్యం, ఆనేత్రాల్లో అమృతం ఆహృదయంలో నవనీతం, అమనోజ్ఞత్వం, ఆకోమలత్వం—అన్నీ—అవన్నీ-ఒక్కటీ కూడా మిగలకుండా, అన్నీ నాచిత్తఫలకంలో ప్రతిబింబిస్తూ వుంటాయి! అయితే నేను జ్ఞాపకం వున్నానా?—ఆమెకు. వుండకేమి! ఆమె భౌతికమైన క్షణభంగురమైన దేహాన్ని వదలినా, హృదయం మాత్రం నావద్ద వదిలిపోయింది. నాభావనలో ఆమెనిత్యం, అక్షయం, పవిత్రం, పవిత్రతరం, పవిత్రతమం—! నాభావనలో ఆమెశాశ్వతం. జననీజనకుల భావములలో చంటిపిల్లాడు చనిపోయినా శాశ్వతమే.

ప్రతీవారు ఓచంటిపిల్లవాణ్ణి పోగొట్టుకోమనడం లేదు, మిగతావాళ్లను చూసుకొంటూ ఆనందించడానికి. అలా పోగొట్టుకోవడానికేనా మన తరం కాదుకదూ? చంటిబిడ్డలు ఎవ్వళ్లూ చనిపోకుండానే వుంటే, అంతా జీవిస్తూనే వుంటే వారంతా పెద్దవారవుతారు. చిన్న పిల్లవాడు, చిన్నపిల్ల భవిష్యత్తుల్లో పురుషుడూ స్త్రీ అవుతారుకద. అయితే చనిపోయిన చంటిబిడ్డ మన భావాల్లో పెద్దవాడవుతాడా పెద్దదవుతుందా? కాదు. మన భావనలో వాళ్ళు ఎప్పుడూ చిన్నతనంలోనే వుంటారు. మన తలపుల్లో వాళ్లు నిత్యం మెలుగుతో వుంటారు. మనం వాళ్లను మరచిపోలేము. అందువల్ల చంటిపిల్లలు మరణించినా మనకు శాశ్వతంగానే వుంటారు. మృత్యుదేవత ఒకచేతితో కఠినత్వాన్ని మరొక చేతితో కారుణ్యాన్ని బిడ్డమీద వెదజల్లింది. మృత్యువు చంటిబిడ్డ భౌతికరూపాన్ని క్రూరంగా హరించింది. ఆమె చంటిబిడ్డను మన భావాల్లో నిత్యం ఉండేలాగ చేస్తుంది. అందుచేత ఆమె కారుణ్యం కూడా కనిపిస్తుంది మనకు. ఆమె అక్షయమైన చంటిబిడ్డ ప్రతిబింబం మనకు చూపిస్తుంది. ఆ అమాయికత్వం, ఆ వెన్నలాంటి హృదయం, ఆ ముద్దులు కురిపించే తియ్యని పలుకులు—మరిచిపోలేము.

ఆ అమాయికత్వమే ఆ వెన్నవంటి హృదయమే ఉంటే మనం ఎల్లా వుంటాము? అప్పుడు మనం పూజ్యులం. స్వర్గధామంలో ప్రసన్నులు, అమాయికులు, ఆర్ద్రహృదయాలు మాత్రమే ఉంటాయి. అక్కడన్నీ స్నిగ్ధహృదయాలే. అంతా చంటిపిల్లలే. మనకు కూడా చంటిపిల్లలలాగా ఆ అమాయికత్వం ప్రసన్నత్వం వుంటే స్వర్గసౌఖ్యాన్ని అనుభవించవచ్చు. మొదటనుంచీ మంచినే గ్రహిస్తూ, మొదటినుంచీ మోసమనేది, కపటమనేది ఎరుగకుండా వుంటే మనల్ని భగవంతుడు స్వర్గధామంలోకి చేర్చుకోడా?

# మా ఊళ్లో గాలిపటాలు

వ్రాడిపెద్ది వేంకటరమణయ్యగారు

అన్ని వృత్తులవాళ్లకూ ఉగాదినాడూ అంతకు తొలినాడూ కూడా ఆటవిడుపేను. ఈ గ్రామంలో ఆనాడు పెద్దలకూ చిన్నలకూ కూడా ఆటవిడుపేను. ఆటవిడుపంటే ఆటను విడిచేడం కాదు. ఉన్న పనులన్నీ ఆటనిమిత్తం విడిచేడం. ఆనాడిక్కడి యాట అదో చిత్రమయిన ఆట. ఆరోజు ఉదయాన్నే నిద్రనుండి లేచిన దగ్గరనుండీ ఊరంతా సందడే! అందరి చేతులలోనూ రంగుల కాగితాలూ, వెదురుపుల్లలూ, తుమ్మబంకనిప్పలూ, దారపుటుండలూ, ఎవరి యరుగుమీద చూచినా ఈ నాలుగు వస్తువులే! ఇది రేఖలతో వన్నెలతో చేసే చిత్రరచన కాదు. ఇది ఉలితో మలచే శిల్పం కాదు. వన్నెలకాగితాల చిత్రరచన. ఇందు చిత్రలేఖనం శిల్పం రెండూ కలసిపోయినాయేమో అనిపిస్తుంది. ఇందులోనూ కళాప్రజ్ఞ చూపగలవారుంటారు. వారి నాశ్రయించి తిరిగేవారెందరో ఉంటారు. ఆ కలకలా, ఆ సందడీ, ఆ రంగుపటాల జిలజిలా, చూడడానికి చాలా అందంగానూ అపురూపంగానూ ఉంటుంది. ఈ రచనలో భేదాలు—గ్రద్ద, మొండిగ్రద్ద—పతంగి, రింగులపడగ, గందరపగడ (గంధర్వపటమయి యుండుంది.) వీ రుపయోగించే దారాలకు వేర్వేరు పేరులున్నాయి. వడి, వజావడి, మైనంవడి, అంబటివడి మున్నగునవి.

వెదురుపుల్లలు వంచి దారాలు కట్టేవాళ్ళూ రంగులకాగితాలు కొలకు తగినట్టు కత్తిరించి అంటించేవాళ్ళూ, దారాలకు పూత లెక్కించేవాళ్ళూ తోకలకయి ప్రాతబద్దలముళ్ళు వెట్టేవాళ్లూ, పంటికఱ్ఱలకు దారాలు చుట్టేవాళ్ళూ వీళ్లతో నిండి ఉంటాయి వీధులన్నీని.

వీనిలో పందెముల పలుకులు:—దూరపుపందెం, వోట్లాటపందెం, పగడపెత్తనం, పనివానితనం, ఈ పంతాలూ పైపందెములూ, రోషాలూ, చాకచక్యాలూ ఇవి కొంతసేపు సాగుతాయి.

ఇది యేనాటి సాంప్రదాయమో ఎవరిని చూచి నేర్చుకొన్నదో గాని, చిరకాలంనుండీ ఈయూళ్లో ఈ యాచారం సాగిపస్తూందట. ఈచుట్టుప్రక్కల గ్రామాల్లో నయినా ఇది ఇంత ప్రబలంగా లేదు. ఈ జిల్లాలో కూడా చాలాచోట్ల యీ ఆచారం తెలియదు. ఈ యూరికి ముప్పది నలుబది మైళ్ల దూరమున నున్న పట్టణాల్లో కూడా ఇలాటి ఆచారం ఉందని తెలియదు.

పగలు పదిగంటలవేళ కప్పుడే ఆకాశాన అక్కడక్కడ ఇంద్రచాపపు తునుకలలాగు, రంగులు తేరిన చుక్కల్లాగు, వన్నెల పులుగు రెక్కల్లాగు నింగికోకబుటాల్లాగు, మబ్బుతోట చివురుల్లాగు, తేలి, పొడిచి, సాగి మెరసి విరిసి చూడడాని కందంగా ఉంటుంది మిన్నంతానూ; కొన్ని యొకలగాలిని దూసిన చప్పుడు, కొన్నిచోట్ల పట్టీలు కొట్టిన సడి, కొన్ని తావుల చితారు మీటిన రవం, కొన్నిట శ్రుతిలాటి ఝుంకారం, ఈ చప్పుళ్లతో పగడ లెగురవేసేవారి సందళ్లతో, చూపరుల మెప్పులతో, ఊరు కలకలలాడుతూ గలగలలాడుతూ ఉంటుంది. తోక తెగిన గాలిపటాలూ, తొట్రుపడిన గాలిపటాలూ, పలిటీలు గొట్టి చెట్లకొమ్మల చిక్కుపడ్డ గాలిపటాలూ, వడి తెగి పరగడలు తొక్కిన గాలిపటాలూ, తడవతడవకు తలలెత్తేవీ, రెక్క చాచేవీ, పచారుచేసేవీ, పైకెగసికూర్కేవీ. అక్కడక్కడ దూసే చంద్రకిరణాల్లాగు, ఎడపదడప జారే వానచినుకుల చాలులలాగు, మిన్నేట విరిగి వెడలే రవికిరణాల్లాగు; గాలివ్రేళ్లలో తునిసిన వీణతీవల్లాగు మింటికి మంటికి పన్నిన సూత్రాలయి మిలమిలలాడే దారాలు.

ఔను; ఆ గాలిపటాలు వియచ్చరులై వీణానాదం చేస్తున్నాయి, అచ్చరలై ఆడుతున్నాయి. సురలై సుమవృష్టి కురుస్తున్నాయి. ఖగాలై యెగసిపోతున్నాయి, గగనారవిందాలై వినువాక విరుస్తున్నాయి.

వసంతారంభము. శిశిరాంతమున నేడదేరు వృక్షాలు, మంచుబరువు డించి నిట్టూర్చే గాలి తరగలు.

నింగి, వసంతమును ప్రదర్శించు సినిమా తెర అయింది. నేలవసంతము నటించు రంగస్థలమయింది. పులుగుల శోభ, పుష్పాల శోభ! అది చైత్రమాసమయింది.

మాయూరి ప్రజ లానా డాకాశాన్ని చిత్రించేరు. గాలికి జిలుగురెక్కలు కట్టేరు. ఉగాది కొప్పులో పూలు ముడిచేరు. ఊరంతటా కోలాట పంటపం తీర్చేరు.

అమరునాటి బీభత్సపు శోభ మరింత బాగుంది. అనురాలిన చెట్ల చిగురుల పూలయి విరిసేయి చినిగిపోయిన గాలిపటాలు. తంత్రులమీద మూర్తీభవించిన వసంతవార్తలయినాయి చిక్కుపడ్డ గాలిపటాలు. గాలిపటం చిక్కుకొనని చెట్టే లేదు— తీగె లేదు.

ఆచార మెలా ఆరంభమయినా ఉగాదినాడీ ఉత్సవం సాగించడం చాలా అందంగానూ సార్థకంగానూ ఉంది. (రాజాంలో)

# బిరుదులు

గౌతముడు

ఇప్పుడు కావలసినవే అవి. బిరుదు అక్కర్లేని వాళ్లెవళ్ళూ లేరు. ఏమార్గంగా రానీండి. ఏమిరానీండి ఏదో ఒహ బిరుదంటూ సంపాదించి పెట్టుకుంటేచాల్ను. వెనకటి కో పెద్దమనిషి ఓయెత్తెత్తాడు. వాళ్ళ వీధి తుడిచే ఆసామీ వీధి వాళ్ళు ఎన్నిమార్లు చెప్పినా బాగా తుడవక, మునిసిపాలిటీతో పోర్టు చేసినా లక్ష్యపెట్టక, ఉంటూ వచ్చాడు. అసలు వాడోహ రౌడీ కూడాను. ఇదంతా కనిపెట్టి ఆపెద్దమనిషి నలుగుర్నీ కూడదీసి వాళ్ళచెవి గిల్లి "మన వీధితుడిచే మండాపి యెర్రన్నకి "మార్జనపరమేశ్వర" అంటూ బిరుదిస్తే బాగా వుంటుందన్నాడు. ఓహో అంటే ఓహో అని అందరూ యేక గ్రీవంగా తీర్మానం ఆమోదించారు. పత్రికలకిరాశారు. పటాటోపాలూ అట్టహాసాలూ చేశారు. వెనకటి యెర్రన్న ప్రబంధ పరమేశ్వరుడైనాడు. మన మండాపి యెర్రన్న మార్జన పరమేశ్వరుడైనాడు. ఆమర్నాటినుంచీ ఆవీధికొడ్లముందు అద్దాలు తీసికట్టు. అల్లాంటి బిరుదు కలిగినందుకు ఆయెర్రన్న కృతజ్ఞతాసూచకంగా ఒహ అల్పాహార విందుకూడా జరిగించినట్లు వినికిరి.

"రంగగార్దభ" బిరుదం వహించాక, రా. చ. ల. వి. రావుగారు తమ ప్రావీణ్యాన్ని బాగా వ్యక్తము చేసి నాటకమాడి, ఆవచ్చిన ధనమంతా భూకంప సహాయ నిమిత్తం వైస్రాయి నిధికి పంపియున్నారు. బిరుదుల మహాత్మ్యం అలాంటిది. కొందరు పైకి బిరుదుల వ్యామోహం యేమీ లేనట్లు నటించినా, ఎవరైనా అయాచితంగా ప్రసాదిస్తే తగుల్చుకోడానికి అభ్యంతరం లేదనే అభిప్రాయాన్ని కళ్ళలో సూచిస్తూ అలాటి వాళ్ళకోసం దిక్కులు చూస్తూ ఉంటారు.

ప్రభుత్వంవారు సగౌరవంగా ప్రసాదించేవి కొన్ని, యూనివర్సిటీలు పరీక్షలు చేసి అనుగ్రహిం

చేవి కొన్ని, నలుగురూ యేర్పడి యిచ్చేవి కొన్ని, డబ్బిచ్చి కొనుక్కునేవి కొన్ని, ఏరకం వారికి ఆరకం వారి, అన్ని చోట్లా తయారు.

అసలు యింగ్లీషు పొడిఅక్షరాల బిరుదులలో యేమీ చిక్కులేదు. చిక్కంతా స్వదేశీ బిరుదాలకే వచ్చింది. ఒక్క బిరుదాల విషయంలోనే కాదు. అసలు స్వదేశీ అంటేనే ఉంది చిక్కంతాను. అందులోనూ తెలుగువాళ్ళ స్వదేశీలో యీ చిక్కులకి తెయితక్కలాటలే. ఏమిటా చిక్కంటూరా! అది చాలా గట్టిచిక్కు. పండితులూ పామరులూ అనే భేదం యేమీలేకుండా అందరూ అచిక్కులో తగిలి ఉన్నవారే. మన దేశంలో వుండుకున్న అనేక రకాల విశ్వకళా పరిషత్తులూ, కళాపరిషత్తులూ, లాపరిషత్తులూ పరిషత్తులూ అన్నీ కూడా ఆచిక్కుకు గురి అయినవే. ఆఖరికి గవర్నమెంటువారిచ్చే వాటిక్కూడా యీగాలి కొంచం తగిలింది.

మన తెనుగువాళ్లు ధరించే స్వదేశీ బిరుదాల్లో మూడు వంతుల ముప్పాతిక యిలాటివే. అవి పైవాళ్ళు బిరుదధారుల్ని సంబోధించడానికి వీలవుతున్నాయి కాని బిరుదుధారులు సరదా తీరేటట్టుగా తమ పేరు ముందు ఎక్కించడానికి వీలుగాలేవు మహా మహోపాధ్యాయ, మహోపాధ్యాయ విద్యాప్రవీణ—ఉభయభాషాప్రవీణ పండిత, విద్యాభూషణ మొదలైనవియీ రకంవారిలోవే. ఒకర్ని ఇంకోవారు సంబోధించేటప్పుడే పైవి కుదురుతాయి. పేర్లముందు తగుల్చుకోవాలంటే తెలుగు ప్రత్యయాలు చేరుస్తే గానివీల్లేదు. అంటే మహోపాధ్యాయుఁడు, మొదలగు రీతులుగా అవి ఉండాలన్న మాట. పోనీండి! ఇదిసమస్త పదం అవుతుంది అంటారా! అంతకంటే వీలులేదు. అలైతే బిరుదూ, ఇంటిపేరూ, పేరూకూడా ఏకాండీ పదం అయిపోయి అందరికీ కొంకరాని కొయ్య అయిపోతుంది. అల్లాగ ఏకాండీ పదంగా యెవ్వరం వుచ్చరించిడం కూడా లేదు. ఆఖరికి తేలిందేమిటంటే మన బిరుదుల్లో చాలామట్టుకు ప్రత్యయాలతో యెంతమాత్రం సంబంధం లేని ప్రాతికదికలని——

పోనీండి—అన్నీ ప్రాతిపదికలగానే కనిపిస్తూ వుండుకుంటున్నవి గనక, బిరుదుల విషయంలో మాత్రం సమాసం రాకపోయినా ప్రత్యయం లోపిస్తుందనిన్నీ, యిట్టి స్థళాల్లో మాత్రం సంధిరాదనిన్నీ కొత్తగా విశ్వామిత్రంచేసి పాణిన్ని బాగా పట్టీలుకొట్టిద్దామా అంటూ ఒక ఊహతోచింది. అలాఅనడానికి మాత్రం—అన్ని బిరుదులూ అలా ప్రాదిపదికలై ఒకేమార్గం తొక్కి ఉంటేగా?

ఇకారాంతంగా ఉండే బిరుదులన్నీ అంటే కావ్యమహోదధి, శిరోమణి, అష్టావధాని, శతావధాని. మొదలయినవన్నీ ప్రాతిపదికలు కావనే అనుకొంటూ ఉన్నాము. మీదిపద్దులో కొన్ని—అంటే శిరోమణ్యంతంగా ఉండే బిరుదులు ప్రాతిపదికలేఅంటూ పట్టుపట్టి కూర్చున్నా, “అవధాని” పదాలుమాత్రం అట్టివి కావు. అవి ప్రాతిపదికలే అయితే “అవధానిన్” అని ఉండాలనివస్తుంది. అవితత్సమాలు, ప్రత్యయంవచ్చికూడా నశించింది.

ఇంకో మరోవిశేషం. ప్రత్యయం చెయ్యకుండా ప్రాతిపదికల్ని ఉపయోగించడం మహాతప్పు. సంస్కృతంలో యెక్కడా అలాకనిపించటం లేదు.

“విశ్వదాత” లాటివి తత్సమాలైన ప్రత్యయాంతాలు. “మహాత్మగాంధీ” లాటి చోట్ల “మహాత్మా” అనేది, మద్రాసు విశ్వవిద్యాలయంవారూ, ఇత్యాగులూ అనుగ్రహిస్తూవున్న “విద్వాన్” లాటి సంస్కృతబిరుదు.

“విద్వాన్” లాటి బిరుదులుకొన్ని విద్యార్థులు పరీక్షయిచ్చేది తెలుగయినా విద్యాలయాలవారు ముడిపెడుతూన్నారు అసలు ఆ కాలేజీలో చెప్పేది తెలుగైనా “సంస్కృతకాలేజీ” అంటూ పేరుపెట్టుకుంటున్నట్లు. పైవిషయాల్ని బాగా

గురించామంటే మనవాళ్ళు బాగా ఆలోచించి వీటిని ఉపయోగంలోకి తెచ్చినట్టు లేదని తోస్తుంది.

ఇదంతా మనకి ఒకాళ్ళని అనుకరించడం వల్ల వచ్చిన ఫలం. యింగ్లీషులో సామాన్యంగా మన స్వదేశీపదాలన్నీ, ప్రాతిపదికలోను, రూపంలోను కూడా అణుమాత్రమూ భేదం లేకుండానే వుంటూ వస్తున్నాయి. "రాముడు" అనేదాన్ని మనం యింగ్లీషులో "రామా" అంటూ వ్రాస్తున్నాం. కాబట్టి మీది రీతి బిరుదులు యింగ్లీషులో రాసేకొంత సమన్వయం కుదరొచ్చుగాని తెలుగులో కుదరదు.

ఉత్తర హిందూదేశ భాషల్లోకూడా యింగ్లీషు రీతిగానే అసలు ప్రాతిపదిక్కీ రూపానికీ యేమీ వ్యత్యాసం లేదు. అంచేత ఆదేశస్థులు తమ పేర్ల ముందు మీది బిరుదాలు ధరించినా అన్వయసరళి అర్థం యెంతమాత్రమూ చెడదు. ఆభాషల పంథా వేరు, మనభాష పంథా వేరు, వాళ్ళలా చేస్తున్నారుగదా అంటూ మనంకూడా అర్థం తెలీకుండా వాళ్ళని వెంబడిస్తే—మనకి మిగిలేది నవ్వుబాటే.

ఫలితం యేమిటంటే—మన తెలుగువాళ్ళు ఉపయోగిస్తున్న బిరుదులు దారీతెన్నూ లేక, కొన్ని కేవలం ప్రాతిపదికలూ, మరికొన్ని తత్సమాలూ, కొన్ని కేవలం సంస్కృత ప్రథమా విభక్త్యంతాలూ అయి, ఒకదానితో ఇంకోదానికి సంబంధంలేని కచటతపల్లాంటివని—.

ఇంగ్లీషువి అలా ఉంటున్నాయా! చూడండి. "బేచిలర్ ఆఫ్ ఆర్ట్సు, మాస్టర్ ఆఫ్ ఆర్ట్సు, డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ, డాక్టర్ ఆఫ్ లెటర్సు, డాక్టర్ ఆఫ్ సైన్సు" అని బిరుదులు తోకలు తెగిఉన్నాయా! మనం మాత్రం చేసుకున్న ప్రారబ్ధం ఏమిటి?

మన పూర్వీకులు యిట్టి చిక్కేమీ పడలేదు. అప్పుడు బిరుదులపైని ఎవరికీ మోజు ఉన్నట్టు లేదు. బిరుదులు వుంటేనేగాని వీల్లేదు అన్న శాసనం లేదు.

గ్రంథాల్ని రచించినవాళ్ళ గద్యల్లోనూ, వందిమాగధులు మహారాజుల్ని పొగిడే స్తుతులలోనూ బిరుదాలు వున్నట్టు కనిపిస్తుంది. అలా అయినప్పటికిన్నీ గద్యల్లో ఉన్నవి సమాసాలమధ్యని ఉన్నం దువనున్నూ, వైతాళికులు పఠించేవి సంబోధనలు అవడంచేతనున్నూ యేమీచిక్కులు లేవు. పైచోట్ల ప్రత్యయాలకి లోపం వస్తూంటుందని అందరికీ తెలుసునుగదా!

ఈబిరుదులశకం ప్రారంభం అయినది మొదలు నేటిదాకా అందరూ, వాటినిధరించే వారేగాని, మనంవాట్ని తగినరీతిని గౌరవించి వాడుతున్నామా! తోకతెంచేసి వాడుతున్నామా! అని ఆలోచించడానికి ఎవ్వరూ సిద్ధపడలేదు. నిజం అనుకోండి— వేళాకోళం అనుకోండి.

# ప్రశంసలు

౪౫

"పేరులో గూడా భావం గర్భితం చేసుకున్న ప్రబుద్ధాంధ్రకు ధన్యవాదాలివ్వాలనే అభిప్రాయం కలిగింది. కవితారీతుల్లో స్వాతంత్ర్యం కనపర్చటానికి అవకాశం నేటికి కలిగింది. మానాన్నగారు "ఆంధ్రత్వం ఇప్పుడు ప్రబుద్ధమైనట్లు రా! అబ్బాయీ!, ఈవిధానమే ప్రస్తుతకాలంలో అవసరం" అని అన్నారు. నవ్యగద్య సారస్వతానికి నూతనలాలిత్యం ప్రబుద్ధాంధ్ర సంపాదించగా లని అనిస్తున్నాం. శ్రీపాదుల సమరసాకారమైన ఉత్సాహం ఆంధ్రమండలికి ఉత్తేజాన్ని అనుగ్రహిస్తోంది"

జమ్మలమడక మాధవరామశర్మ.

౪౬

"ప్రబుద్ధాంధ్ర ఆంధ్రసారస్వతమున నూత్న పథంబులు త్రొక్కుచున్నది. పద్యములలోని కవిత క్రొత్తనడకల బోవుచున్న సమయమున దాని అంత్యదశ రానున్నదని యూహించి, గద్యరచనకే తమ పత్రికారాజమున ప్రాముఖ్యమిచ్చి సాహసించినందులకు శాస్త్రిగారెంతయూ అభినందనీయులు. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి సేవ మెరుంగని ఆంధ్రు లుండరని నాయూహ. వారి కార్యమెంతయు కొనియాడదగినది. పత్రిక చిరస్థాయిగా నుండునట్లు భగవానుడనుగ్రహించుగాత!

పం. వెంకటేశ్వరప్రసాద్.

# వ్యాఖ్యానములు

## ఒక్కొక్క అనుభవం కలిగినప్పుడు

ఏలూరు నగరీయసంఘానికి జవాబు చెబుతూ మన లామెంబరు సర్. కూర్మా వేంకటరెడ్డినాయుడు గారు తెనుగు జిల్లాలను విడదీసి ప్రత్యేకరాష్ట్రంగా నిర్మిస్తే మనకే నష్టం అన్నారు.

“నే నిదివరకి ఆంధ్రరాష్ట్రం కావా లన్నాను; కాని యీమధ్య నాకు కలిగిన అనుభవంవల్ల—అనగా వాయవ్యప్రు సరిహద్దు రాష్ట్రం, సింధురాష్ట్రం, ఓఢ్రరాష్ట్రం—వీటి విషయం గమనించగా ఆంధ్ర రాష్ట్రనిర్మాణం మనకి నష్టం కలిగిస్తుం దని తేలింది. ఇలా నిర్మొగమాటంగా చెప్పినందుకు నన్ను క్షమించాలి. పైని చెప్పిన రాష్ట్రాల కోసం కేంద్ర ప్రభుత్వం కోట్లకొద్దీ డబ్బు ఖర్చుపెడుతోంది. మనకి త్వరలోనే గొప్ప సంస్కరణాలు రానున్నాయి. ఈసమయంలో మనం ప్రత్యేకరాష్ట్రం కోరడం కంటే తమిళులు, కన్నడులు, మళయాళీలు—వీరితో కలిసి వాటి నమలులో పెట్టడానికి ప్రయత్నించడం మంచిది” ఇదీ నాయుడుగారి వాదం.

కాని—మనకి ప్రత్యేకరాష్ట్రం నష్టం కలిగిస్తుం దనే సిద్ధాంతానికీ యీహేతువాదానికీ అతుకు కలవడం లేదు. ఏమంటే? తెనుగు జిల్లాలను విడదీసి వొకరాష్ట్రంగా నిర్మిస్తే అది పై రాష్ట్రాల లాంటి నెలతక్కువబిడ్డ అవుతుం దని యిప్పటి దాకా యెవరూ చెప్పలేదు. మద్రాసు పరగణాలో వున్న భాషాభాగా లన్నిటిలోనూ తెనుగు మాగాణమే యెక్కువ రాబడి కలది. అది ప్రత్యేకరాష్ట్రం కావడం అంటూ వుంటే తన కాళ్లమీదే నిరాఘాటంగా నిలవగలదు. పైగా తమిళులవల్ల మనకి కొంత సొమ్ము ముదరా కూడా రావలసివుంటుంది కనక ప్రారంభవ్యయాలవిషయంలో కూడా మన మేమంత చిక్కుపడనక్కరలేదు. తెనుగు జిల్లాలకి యిలాంటి తాహతు వుండడంచేతనే మనం ప్రత్యేక రాష్ట్రం కోరుతున్నాం; గాని ఓఢ్రులలాగ కేంద్ర ప్రభుత్వాన్ని యెప్పుడూ దేవురిస్తూ కూచోడానికి కాదు.

కొద్దివో, గొప్పవో కొత్త సంస్కరణాలు రాబోతూ వుండడం నిజమే. అయితే వాటిని మనం ప్రత్యేకంగా మాత్రం యెందు కమలులో పెట్టగూడదూ? తమిళులు, కన్నడులు, మళయాళీలు—వీరితో కలిస్తే సంస్కరణాల సందర్భంలో మనకి వొరిగే దేమిటీ? అందరూ కలిసి వుంటే మదరాసు పరగణా పెద్దది కనక ప్రాతినిధ్యం యెక్కువ వుంటుం దనే పక్షంలో—అదంతా తెనుగు జిల్లాలకే భుక్తపడుతుందా? పైగా “తమిళులు, కన్నడులు, మళయాళీలు, ఆంధ్రులు—వీ రందరితోటీ కలిసి మనం కొత్త సంస్కరణాలను అమలుపరచా లని ఓఢ్రు లనుకోడం లేదేం?

ఈసందర్భంలో “ఇదివరకు ఆంధ్రరాష్ట్రం కోసమూ, ఆంధ్రవిశ్వవిద్యాలయం కోసమూ తీవ్రంగా కృషి చేసిన వాళ్లలో నే నొకణ్ణి. ఆంధ్రవిశ్వవిద్యాలయం విషయంలో మన కోరిక ఫలించింది. అది మన వికాసానికి తోడ్పడగలుగుతుం దని నమ్ముతున్నా” నంటూ నాయుడుగా రింకో మాట చెప్పారు.

మదరాసు విశ్వవిద్యాలయానికి దూరంగా వున్నా రనే కారణంతో మదరాసు పరగణాలో వొక కొసని వున్న వారికి అందుబాటులో వుండడానికి ఏర్పడింది కాదు ఆంధ్రవిశ్వవిద్యాలయం. ఇవాళ నేతిబీరకాయ లాగే వున్నా అది ప్రత్యేకంగా “తెనుగు జాతి” యొక్క పునర్వికాసాన్ని సాధించడం కోసమే పుట్టింది. అలాంటి ప్రత్యేక సంస్థ మన వికాసానికి తోడ్పడుతుం దని వొప్పుకున్నారు నాయుడుగారు. అయితే ప్రత్యేకాంధ్ర

రాష్ట్రం విషయంలో మాత్రం యీ సూత్రం యెందుకు చెల్లదూ?

ఎలా చూసినా, పక్కా 'తెలగాబిడ్డ' అయిన నాయుడుగారి హేతువాదంలో వారి హృదయం ప్రతిఫలించడం లేదు.

ఇంతకీ: మాట అంటే యుక్తి కనపడాలి. వాదం చేసే 'కామోసు' అనిపించుకోవాలి. ఈ రెండూ లేకుండా పదస్థు లైనవా రేమన్నా దాని కడ్డుండదు; గాని లోటు కనబడుతూనే వుంటుంది.

## ఏలూరి సనాతనధర్మసభ

ఇది ౨౫–౫–౧౯౩౮ తేదీని జరిగింది. బ్రహ్మశ్రీ జయంతి రామయ్యపంతులుగారు యాజమాన్యం వహించి కార్యక్రమం నిర్వర్తించారు.

పంతులుగారి ప్రారంభోపన్యాసం అచ్చులో ౨౩ పుట లుంది; కాని అది సనాతనధర్మానికి ఉత్తేజకంగా గాని, సనాతనధర్మవాదులకు ఉద్బోధకంగా గాని, చివరికి సంస్కారవాదులకు వెన్ను తట్టగలదిగా గాని లేదు. రచన కూడా వారి వైదుష్యానికీ, సంతతభాషాపరిశ్రమకీ అనుగుణంగా లేదు. ఏదో వదులు వదులుగా, బులబులాగ్గా—చరచరా సాగిపోయింది. అంతే.

ఒక సనాతనధర్మవాది అనేకమంది సనాతనధర్మవాదుల యెదట విలుప్తప్రాయమై వున్న సనాతనధర్మాన్ని పొగడడంలో యేమీ అర్థం లేదు. ఇదీ కాక అంతటితో తృప్తిపడి వూరుకోవలసిన రోజులు కూడా కావివి. ఏమంటే? దేశంలో యిప్పుడు ప్రచండమైన ధర్మవిప్లవం జరుగుతోంది. ఏది యెలా మారుతుందో, యేది యేమయిపోతుందో లేశమాత్రమూ బోధపడడం లేదు. హైందవధర్మం యొక్క ప్రాతిపదిక అయినా నిలుస్తుందో నిలవదో చెప్పడాని కవకాశాలు కనపడడంలేదు. ఎటు చూసినా అంతా గమడగొయ్యిగానూ అల్లకల్లోలంగానూ వుంది. రోజూ స్థితి విషమిస్తోంది; కాని వున్నపాళంగా నేనా వుండడం లేదు.

అంటే వొక ప్రచండశక్తి యిప్పు డీ నూత్నావేశాన్ని యెదురుకోవలసివుంది. ఏళ్ళు గడిచింది కావడంవల్లనూ, సంఖ్యాధిక్యాన్ని పట్టీ, అన్ని తెగల సంస్కారవాదులకూ ప్రతిస్పర్ధి కావడంచేతనూ, ఇందుకు సనాతనధర్మపక్షానికే అర్హత వుంది. పూచీ కూడా వుంది.

నిజమే అయితే యేమిటీ చెయ్యడం? ఇప్పుడు సనాతనధర్మవాది నెదురుకుంటూ వున్న సమస్య యిదీ.

"సనాతనధర్మం గొప్పది. శాశ్వతమైనది" అంటే లాభంలేదు. సంస్కారవాదులకు దానిలో దోషాలు కనపడుతున్నాయి. అధర్మానికి ఆచరణలో చోటున్నట్లు కనపడడం లేదు. పుస్తకాలలో వున్న సనాతనధర్మానికీ, సనాతనధర్మవాదుల మని చెప్పుకునే వారి నడవడిలో వున్న ధర్మానికీ సంబంధమే కాదు, పోలిక కూడా లేదు. కాని సనాతనధర్మవాదులు సంస్కారపక్షంవారిని దూషిస్తున్నారు. ఇది మానవసహజమైనా యింతమాత్రాన సనాతనధర్మాన్ని గౌరవించినట్టూ, ప్రేమించినట్టూ, అభిమానించినట్టూ, పూజించినట్టూ, ఆచరించినట్టూ కాదు. "వేదశాస్త్రాలు ఏం చెబుతున్నాయి? మన ప్రవర్తన యెలా వుంది?" అని సనాతనధర్మవాదులు ఆత్మపరీక్ష చేసుకోవాలి. ఖిలమై పోతూ వున్న ధర్మాన్ని మళ్ళీ ఉద్ధరించాలంటే తూచాలు తప్పకుండా దాన్ని అవలంబించే వారివల్లనే ఆపని సాగుతుంది. ఊరికే కబుర్లు చెప్పేవారివల్ల ఏమీ కాదు.

నిజం చెప్పవలసివస్తే సనాతనధర్మవాదులలో ఉన్నంత దోషం సంస్కారవాదులలో కనపడదు. సంస్కారవాదులకు దానిమీద విశ్వాసం లేదు. అంచేత వారిని దాన్ననుసరించి విమర్శించడానికి వీలు లేదు. సనాతనధర్మవాదులు దాన్ని అభిమానిస్తున్నారు. దాన్ని ఆచరణలో పెట్టా లంటున్నారు. దాన్ని మరిచిపోతూ వుండడంవల్లనే దేశం చెడిపోతోం దంటున్నారు. కనక దాన్ని అనుసరించవలసిన పూచీ వారికే వుంది.

ఈదృష్టితో చూస్తే నేడు సనాతనధర్మవాదులు పంక్తిబాహ్యులుగా కనపడుతున్నారు. ఎనిమిదేళ్లు రాకుండానే వారు చాలామంది ఆడపిల్లలికి పెళ్ళిళ్ళు చేసేస్తున్నారు. మొగపిల్లలికి వడుగు చెయ్యడానికి అనవసరంగా యుక్తకాలాన్ని గడిపేస్తున్నారు. నిశ్చింతగానూ, నిర్లజ్జంగానూ వరశుల్కాలు పుచ్చుకుంటున్నారు. కొందరు వితంతువుల విషయంలో సహించడానికి వీలు లేని నిర్ణయాలు చేస్తున్నారు. లంచాలు పుచ్చుకుని అకృత్యాలను కప్పిపెడుతున్నారు. తీరి కూచుని సంధ్యావందనం విషయంలో కాలాతిక్రమణం చేస్తున్నారు. అగ్నిహోత్రాలను మరిచిపోయారు. వేదవిక్రయం చేస్తున్నారు. తమ కొడుకులను బుద్ధిపూర్వకంగా హూణవిద్యలో ప్రవేశపెడుతున్నారు. కేవలం డబ్బుకోసం అప్రాచ్యులతో సంబంధాలు చేస్తున్నారు. వడ్డీవ్యాపారాలు, కూటసాక్ష్యాలు, కొంపతీతలు, సనాతనధర్మవాదులలో గూడా తక్కువగా లేవు. పైగా వారిలో అనేకులు సాగివుండీకూడా హూణులతోనూ మ్లేచ్ఛులతోనూ, పగలస్తమానమూ రాసుకుంటూ తిరగవలసిన ఉద్యోగాలు చేస్తున్నారు. అగమ్యగమనాలు, అభక్ష్యభక్షణాలు, అపేయపానాలు, అభోజ్యభోజనాలు—ఇవి సనాతనధర్మవాదులలో పుష్కలంగా వున్నాయి. వారిజీవితాలలో దయాసత్యశౌచాలను విడిచిపెడుతూ వున్న ఘట్టాలనేకాలుంటున్నాయి. "ఇవి తప్పులు. దిద్దుకోవా" లనే జ్ఞానం కూడా వారిలో అనేకులకు లేదు. ఇలాంటి దోషాలను, సహించరాని యీశాస్త్రాతిక్రమణాలను ఎప్పుడు కావలిస్తే అప్పుడు, ఎక్కడ కావలిస్తే అక్కడ, ఎవరికి కావలిస్తే వారికి ఎన్ని కావాలంటే అన్ని సంస్కారవాదులు చూపించగలరు. రుజువు చెయ్యగలరు.

సనాతనవాదులు ముందీ దోషాలు దిద్దుకోవాలి. వర్ణాశ్రమ ధర్మాలను వారు తమ నడతలో చూపించాలి. అప్పుడు గాని వారు ఏంచెప్పడానికీ ఏం చెయ్యడానికీ, సంస్కారవాదులను దూషించడానికీ అర్హులు కారు.

పైగా ఇప్పుడు సనాతనధర్మాన్ని అమలులో పెట్టాలంటే యెలాగ? మన ప్రభువులు విజాతీయులు. వారు మన మతధర్మాల పొంతకి రారు. రావడం వస్తే దిద్దడం వుద్దేశంతోటే వుంటారు. కాగా మన ధర్మానికి రాజావలంబం పోయింది. ఇది యిలా వుండగా హూణవిద్యతో మన దేశీయుల దృక్పథం పూర్తిగా మారిపోయింది. స్మృతులను విప్పి చెప్పి యీ ప్రకారం నడవాలంటే యెవరూ వినరు. ఇటీవల మనుస్మృతిని తగలబెట్టాలని కూడా వొక ఆవేశం బయలుదేరింది. అన్ని కులాలవారూ ఎచ్చుతక్కువల నంగీకరించడం లేదు. పంచములుగూడా తిరగబడ్డారు, బ్రాహ్మణుల ఆచార్యత్వాన్ని యెవరూ అంగీకరించడం లేదు. ఇలాగ సనాతనధర్మాన్ని మనవారి మీద విధించడానికి ఏమీ అవకాశాలు కనపడడం లేదు. అసలు విధించే యోగ్యత కలవారే కనపడరు.

మొత్తానికి కిందినుంచి పైకి, యీ వేపునుంచి ఆవేపుకి సనాతన ధర్మవాదులలోనే సంస్కారం అవశ్యకంగా కనపడుతోంది; కాని దిద్దుబాటంటే మాత్రం వారిలో యెవరూ నిలబడరు. చెట్టొకపిట్టగా చెదిరిపోతారు.

ఇంత కార్యం ముందు జరగవలసి వుండగా దీన్ని స్మరించకుండా రామయ్యపంతులుగారి వంటి కేవలలౌక్యుల యాజమాన్యం కింద సభలు చేసి, భగవద్గీతా శ్లోకాలు నాలుగు ఏకరువు పెట్టి, శారదాశాసనాదులను రద్దు చేయించాలనీ, అసెంబ్లీని ఆక్రమించాలని—ఇలాంటి తీర్మానాలు చేస్తే ఏం లాభమూ?

సనాతనధర్మంలో సత్యం వుంది. మానవత్వంలోనుంచి దేవత్వంలోకి మార్చే మహిమ వుంది. సకలమతాలవారికీ—ప్రపంచకాని కంతటికీ సందేశం యివ్వగల సత్తా వుంది. నిజమే; కాని వాటి

మీద భరించరాని కుళ్లు చాలా పేరుకుని వుంది. ముందు శస్త్రచికిత్స జరగాలి. అకుళ్లంతా తొలగించివెయ్యాలి. అప్పుడు గాని అది మన దేశీయులకు ఆకరకం కాదు. పూజ్యం కాదు. సేవ్యం కాదు. ప్రాప్యం కాదు.

వెనకటికి అనేకమాట్లు యీపని జరుగుతూనే వచ్చింది. మన గ్రంథాలన్నీ అపరిణామాన్ని ప్రదర్శిస్తూనే వున్నాయి.

ఇప్పుడేనా ప్రాతిపదికకు భంగం కలిగించని సంస్కారం జరిగించుకుంటేనే అది తక్కుతుంది. లేకపోతే ప్రపంచం అంతటా ఉత్తరంగితం అవుతూవున్న మహాప్రవాహంలో అది బుడుంగు మని మునిగిపోతుంది.

ఇప్పుడంత పని చెయ్యడానికి ఎవరికీ అధికారం లేదంటారా? అట్టి అధికారి యెవరూ లేరంటారా? అయితే మీయిష్టంవచ్చినంత ప్రచారం చేసుకోండి. ఏమీ లాభం లేదు. మీలో వున్న ప్రలోభనాలు మిమ్మల్ని వెక్కిరిస్తూనే వుంటాయి. మీలో వున్న దోషాలు మిమ్మల్ని దిగతీస్తూనే వుంటాయి.

## కాంగ్రెస్సాంధ్రుడు

జూన్ మాసపు ఆంధ్రభూమి యిలా అడుగుతోంది.

"కాంగ్రెస్సు నడిపిన సత్యాగ్రహ, సహాయనిరాకరణోద్యమములందు పాల్గొని విశేషత్యాగమును చేయుటలో ఆంధ్రులు భారతదేశమందలి ఏరాష్ట్రము వారికిని తీసిపోవలేదు. కాని ఇప్పుడు ఆంధ్రునకు కాంగ్రెస్సులో ఏ మయిన పలుకుబడి కలదా? మొన్న జరిగిన రాంచి సభలోగాని, నిన్న జరిగిన పాట్నా సభలోగాని ఆంధ్రుడు తానొనర్చిన త్యాగమునకు సరిపోవు పలుకుబడిని పొంది వినియోగించినాడా? సత్యమూర్తి రాజగోపాలాచారినామములే పలుసారులు వినిపించినవి; గాని ఒక్క ఆంధ్రనాయకుని నామ మైన ఆమ్రేడితము కాలేదు. కాంగ్రెస్సులో పలుకుబడి సంపాదింప ఆంధ్రునకు కాంక్ష లేదా? శక్తి లేదా?"

కాంగ్రెస్సు పుట్టి యాభై సంవత్సరా లయింది. ఏవొకటి రెండు సంవత్సరాలో తప్ప ప్రతీ యేడూ కాంగ్రెస్సు సమావేశం జరుగుతూనే వుంది. హిందూదేశంలో వున్న అన్ని పరగణాలవారూ, అన్ని జాతులవారూ, అన్ని భాషలవారూ, అధ్యక్షగౌరవం పొందారు. చివరికి సీమనుంచిన్నీ అధ్యక్షులు వచ్చారు. కొందరు రెండేసి మూడేసి మాట్లు ఈ గౌరవం పొందారు; కాని వొక్క ఆంధ్రుడేనా యింతవరకూ అధ్యక్ష పదవి పొందలేదు. రాక రాక వచ్చిన కార్యదర్శిపదవి సైతం వొక్క సంవత్సరంలో యెగిరిపోయింది.

అసలు కాంగ్రెస్సు సమావేశాన్నే ఆంధ్రదేశంలో జరగనివ్వ నని మోతీలాల్ నెహ్రూగారు వ్రతం పట్టారు వొకప్పుడు.

ఏం? "కాంగ్రెస్సులో పలుకుబడి సంపాదింప ఆంధ్రునకు కాంక్ష లేదా? శక్తి లేదా?" ఆంధ్రుడు త్యాగం చెయ్యలేదా? గాంధిగారి పాదాలే గతి అని నమ్మి వుండలేదా?

విశాల మైన భారతదేశంలో కాంగ్రెస్సుని చూసుకుని, కాంగ్రెస్సుని నమ్మి, కాంగ్రెస్సే సర్వమూ అని భ్రాంతిపడి ఆంధ్రుడొక్కడే తన స్వకీయ జాతీయోద్యమాన్ని పూబిలో పూరదొక్కుకున్నాడు. ఆంధ్రుడొక్కడే నవనవ లాడుతూనన్నే చూసుకోమని విజృంభిస్తూ వున్న తన గ్రంథాలయోద్యమాన్ని చంపుకున్నాడు. ఆంధ్రుడొక్కడే తన భాషని, తన వాఙ్మయాన్ని దిగతుడిచివేసుకున్నాడు. ఆంధ్రుడొక్కడే స్వరూపనాశం అయినాడు.

కాని ఇంత చేసినా ఆంధ్రుడు కాంగ్రెస్సు వలయంలో నాయకుడు కాడు. సలహాదారయినా కాడు. స్వతంత్రుడు కూడా కాడు. కేవలమూ అనుచరుడు, భృత్యుడు. అంతే.

ఈస్థితిలో కాంగ్రెస్సులో ఆంధ్రుడికి గౌరవం యెలా వుంటుందీ? అధ్యక్షపదవి యెలా వస్తుందీ?

ప్రముఖులలో స్థానం యెలా లభిస్తుంది? కనకనే అధ్యక్షపదవి రాకపోవడమే కాదు. పార్లమెంటరీ బోర్డులో నైనా సభ్యత రాలేదు. తెనుగుదేశం మీద రాజగోపాలాచారిగారు సర్వాధికారులైనారు.

ఇలాంటి ఆంధ్రుడికి పరమావధి సంపూర్ణ స్వరాజ్యం. ధిక్!

పోనీ, ఆంధ్రుని సత్తా యింత మాత్రమే కాబోలు నేమో అంటే అలా కాదు. ఏమంటే? లిబరల్ పక్షంలో ఆంధ్రుడు సమున్నత శిఖరంమీద వున్నాడు. జస్టిసుపక్షంలో ఆంధ్రుడు సర్వాధికారిగా వున్నాడు. ఆయుర్వేదోద్యమంలో కూడా ఆంధ్రుడికి అత్యున్నతపదవి లభించింది. చివరికి కార్మికపక్షంలో గూడా ఆంధ్రుడు ప్రధాన నాయకుడు.

చివరికి తేలిం దేమిటీ? కాంగ్రెస్సులో వున్న ఆంధ్రునిలో ఆంధ్రత్వం లేదు. లేదా సత్తా గల ఆంధ్రు లెవరూ కాంగ్రెస్సులో లేరు. ఇంతే.

## మొగ్గు ఎప్పుడూ అటే

కాంగ్రెస్సు, బొంబాయి సమావేశంలో ప్రధాన మంత్రి చేసిన సాంఘికపరిష్కారాన్ని (కమ్యూనల్ అవార్డు) అంగీకరించా లేకపోయింది. తిరస్కరించా లేకపోయింది.

అంగీకరిస్తే జాతీయతకి భంగం వస్తుందిట. తిరస్కరిస్తే మాహమ్మదీయులు తొలిగిపోతారుట. అంచేత దాన్ని గురించి యేమీ చెప్పనుట. శ్వేత పత్రాన్ని మాత్రం అది నిర్మొగమాటంగా—నిష్కర్షగా తిరస్కరించేస్తుందిట.

కాంగ్రెస్సు పత్రికలు యీ నిర్ణయాన్ని అపూర్వమూ, అనన్యసాధ్యమూ అని పొగడుతున్నాయి. దీల్లో రాజనీతి అంతా ఘనీభవించి వుందిట.

ఆ రాజనీతిమాట దేవు డెరుగును; కాని కొంత గొప్పదీ, ఏళ్లు గడిపిందీ, పూచీ కలదీ, అద్భుతమైన త్యాగం చేసిందీ అనిపించుకునే కాంగ్రెస్సు ప్రధానమైన వొక వ్యాసఘట్టం తటస్థించినప్పుడు నీళ్లు నమిలింది. వెనక శారదాబిల్లు సందర్భంలో గూడా అది యిలాంటి పెడదారే తొక్కింది.

అయితే అయింది, పోనీ కాంగ్రెస్సు వెల్లడిస్తూ వున్న తృప్తికి యేమైనా అర్థం వుందా అంటే— నిజంగా కాంగ్రెస్సుయొక్క పరమావధి జాతీయతే అయితే అది యిప్పుడే పూర్తిగా నాశనమైపోయింది. ఏమంటే? మాహమ్మదీయులు తమకే సౌకర్యాలు కావాలని ప్రతిపాదించారో, వేటిలో వొక్క అక్షరమైనా తగ్గడానికి వీలు లేదని పట్టు పట్టారో అవన్నీ మనం అంగీకరించాము. దీనివల్ల మనకీ, సిక్కులకీ కలిగే అపాయాన్ని వారు తొలగించబూనుకో లేదు. ఇలాగ వొక తెగవారికి కొండంత లాభమూ, వొకటి రెండు తెగలవారికి సముద్ర మంత నష్టమూ కలిగించే తీర్మానం చేసి "మేము జాతీయతని కాపాడా" మంటే అర్థం యేమిటి?

వాస్తవంగా యిప్పుడే జాతీయతకి భంగం కలిగింది. మాహమ్మదీయులు తొలగిపోతే జాతీయతకి భంగం కలగనే కలగదు. అప్పుడు పైవారు "అది హిందువుల సంస్థ అంటే అనవచ్చు; గాని దాని పరమావధి జాతీయత కాదనడానికి వీలు లేదు.

పోనీ యిప్పు డేనా మాహమ్మదీయులు కాంగ్రెస్సు వలయంలోకి వస్తారా అంటే అది యెప్పుడూ కానసాగదు. వారు మనచేత తమకు కావలసిన హక్కు లన్నీ వొప్పించుకోడానికే చూస్తున్నారు; గాని మనతో కలిసిమెలిసి వుండడానికి కాదు. ఈప్రయోజనం వారికి కాంగ్రెస్సులో కొద్దిమందీ, పైని చాలా మందీ వుంటేనే నెరవేరుతుంది. దీనివల్ల "అపాయం మాత్రమే కలిగించే సిద్ధాంతాలూ, కార్యక్రమాలూ చూపించే గాంధిగారిని వారు అనుసరించ" రనే మెహనతు కూడా వారికి తక్కుతుంది.

ఇదంతా గమనించే అనే, మాళవ్యాగార్లు కాంగ్రెసులో నుంచి వెళ్లిపోతా మన్నారు. దీనితో

కాంగ్రెసు నిశ్చయంలో వుండే అనర్థాన్ని చాలా మంది గుర్తించారు. కాని కాంగ్రెస్సు వారికి పచ్చివెలక్కాయ గొంతుకపడ్డట్టయింది. ఈరాజీనామాలు ఎంత త్వరగా రద్దయిపోతే వారికంత మంచిది. లేకపోతే యీ రహస్యం దేశం అంతటా వెల్లడి అయిపోతుంది. అందుకోసం వారు గాంధిగారి నాశ్రయించారు.

గాంధిగారి వశీకరణశక్తి గొప్పదా, మాళవ్యాగారి మొగమోటం పెద్దదా అనేది చాలా పెద్ద సమస్య; కాని దాన్ని చర్చించడాని కిది కాదు స్థలం. చివరికి మాళవ్యాగారు తమ రాజీనామాన్ని ఉపసంహరించుకున్నారు. వారు ఈసందర్భంలో చాలా — వెక్కి వెక్కి దుఃఖించారుట కూడానూ. దానితో అణేగారు కూడా తమ రాజీనామాని ఉపసంహరించేసుకున్నారు. కానైతే వారిద్దరూ "మేమింకా కాంగ్రెస్సు నిశ్చయాన్ని పూర్తిగా శిరసావహించలేదు; కాని" అన్నారు గాని—యెందుకు లెండి.

కాంగ్రెస్సువారు మళ్లీ స్థిమితపడ్డారు. [illegible] తప్పించినందుకు గాంధిగారికి ధన్యవాదాలు సమర్పించారు. కాంగ్రెస్సు పత్రికలు "గాంధిగారి వశీకరణశక్తి అసాధారణం, అలౌకికం, అనన్యలభ్యం" అని పొగిడాయి.

అయితే: గాంధిగారి వశీకరణశక్తి అలాంటి— అలాంటి మహామహా యిదైనదే అయితే అది, మాహమ్మదీయుల దగ్గిర యేమీ పని చెయ్యలేకపోతోందేం?

కావలసింది కాస్తా అయిపోయింది. ప్రధాన మంత్రి చేసిన సాంఘికపరిష్కారమే స్థిరపడింది. మాహమ్మదీయులను చేపట్టడం ద్వారా కాంగ్రెస్సుకి బలం కలిగిస్తే తరవాత వారిని (మాహమ్మదీయులను) వప్పజెప్పవచ్చునని కాంగ్రెస్సు హిందువుల అభిప్రాయమేమో—అది యెప్పుడూ కొనసాగదు. ఎప్పుడీ ప్రయత్నం జరిగితే అప్పుడే వారు దూరంగా వుంటూ మంటారు. ఇంతవరకూ వారి పేరాసలను తగ్గించలేనివారు, ప్రధానమంత్రిదాకా వెళ్లకుండా యీవిషయం పరిష్కరించుకోలేనివారు, మహామంత్రి పరిష్కారాన్ని బాహాటంగా తిరస్కరించలేనివారు, తుదకీవిధంగా దానికి తల ఒగ్గినవారు "చూడు యిక ముందేం చేస్తామో" అంటే ఆమాటని నమ్మే వారిది పొరపాటు గాని అనేవారిది కాదు.

ఇలాగ గాంధిగారి నిర్ణయం యెప్పుడూ మాహమ్మదీయులకే అనుకూలంగా వుంటోంది; గాని మనకి కాదు, జాతీయతకి అసలే కాదు.

---

# స్వీకారము

## ౧౬. స్వదేశసంస్థానాలు

ఇది ౧౦౬ పుటల గ్రంథం. క్రౌన్ సైజు. అంటిక్కు కాగితాలు. చక్కని అచ్చు వెల ౦-౮-౦. గ్రంథకర్త నార్ల వేంకటేశ్వరరావుగారు. ఇది కావలసినవారు "నార్లవారు" కవుతరం, కృష్ణాజిల్లా అని రాసుకోవాలి.

పుస్తకం చిన్నదే; గాని వొక పెద్ద రత్నం అని చెప్పవచ్చు. ఆధునికాంధ్ర వాఙ్మయాని కిది అమూల్యమూ, అపూర్వమూ అయిన ఆభరణం. ఈపుస్తకం చదివినవారు నిజంగా ఉలికిపడకుండానూ, సిగ్గుపడకుండానూ, జలదరించుకోకుండానూ, క్రోధమూర్తులు కాకుండానూ, గగ్గోలుపడకుండానూ—చివరికి ఏడవకుండానూ ఉండలేరు. హృదయమేమో యీపుస్తకం చదవగూడదని చెబుతుంది; గాని విషయవివరణపద్ధతీ, శైలీ ఆపని చెయ్యనివ్వవు. తెనుగువారిలో, తమ

ప్రస్తుతస్థితికి విచారమూ, బాగుపడాలనే ఆవేదనా, సంఘసంస్కారం విషయంలో పట్టుదలా కలగాలంటే యిలాంటి పుస్తకాలే యిప్పుడు కావాలి. కనక తెనుగువారు, వేంకటేశ్వరరావుగారు ఇలాంటి యీ గ్రంథం రాసి ప్రకటించినందుకు సంబరపడుతూ వారికి తమ కృతజ్ఞతను తెలుపుకోవలసి వుంది.

౧౭ చంద్రిక లోన్‌స్క్వేర్ మదరాసు

ఇది ఆనందముద్రాక్షరశాలాధిపతులు ఆర్. వేంకటేశ్వర్ అండు కంపెనీవారిచే ప్రకటించబడుతూ వున్న సచిత్రమాసపత్రిక. సంపాదకులు వి.ఏ. కేషబ్ చంద్రగారు. డబుల్ క్రౌను సైజున ౪౦ పుటలు గలది. గ్లేజు కాగితాలు. ప్రతీ సంచికలోనూ రంగుల చిత్రం వొకటీ, సాధారణచిత్రా లనేకాలూ ప్రకటించబడు తున్నాయి. సంవత్సర చందా ౪-౦-౦.

ఆనందముద్రాక్షరశాలా, వేంకటేశ్వర కంపెనీ—యీ రెండూ తెనుగువారిలో అక్షరాస్యులకందరికీ తెలిసినవే. వీరు ప్రకటించిన ఆంధ్రమహాభారతమూ, ఆంధ్రమహాభాగవతమూ, మనుచరిత్రా మొదలైన గ్రంథా లన్నీ సర్వాంగసుందరాలు కావడంవల్ల దేశంలో మంచి ఆదరణ పొందుతున్నాయి. ఇలాంటి ఈకంపెనీవారే యీపత్రిక ప్రకటిస్తా రంటే ఇది కూడా వాటిలాగే సర్వాంగసుందరంగా వుంటుం దని ఆశపడ్డాము; కాని ఆకృతి ముచ్చటగానే వున్నా, గ్రంథం నాలుగు రూపాయల చందాకు గాని, ప్రకాశకుల పేరుప్రతిష్ఠలకు గాని అనురూపంగా లేదు.

పత్రికాసంపాదకు లందరూ మాలాగే పద్యవాఙ్మయానికి తమ పత్రికల్లో చోటివ్వకుండా వుంటా రని మే మెప్పుడూ అనుకోడం లేదు; కాని చంద్రిక స్వీకరించిన పద్యవ్యాసాలలో అనేకాలు చిల్లరపత్రికలుగూడా ప్రకటించ తగ్గవిగా లేవు. వాటిలో నవీనకవిత్వమూ లేదు, ప్రాచీనకవిత్వమూ లేదు. వాటి విషయంలో చంద్రికా సంపాదకులు తమ ధర్మం తప్పా రని చెప్పక తప్పదు.

వచన వ్యాసాలలో గూడా గుణవత్తరాలు తక్కువే. ఇలాంటి పత్రికలు వాఙ్మయానికి పుష్టి కలిగించని రచనలను ప్రకటించడం చాలా సాహసమైన పని. ఈకాలంలో గూడా సమస్యాపూర్తులు ప్రకటించడం వింతగా వుంది. "వార్తలు—విశేషములు" వీటిలో కొన్ని దినపత్రికలకు గూడా అనవసరా లున్నవి. హాహాహూహూలు చంద్రిక గౌరవానికి పూర్తిగా భంగకరాలు.

ఇలాంటి స్వల్పవిషయాలు ప్రకటించడానికి యింత పెద్దయెత్తున పత్రికలు నడపనక్కర లేదు. ప్రకాశకులు ఈపత్రికద్వారా వొక వున్నతఫలాన్ని సాధించదలచితే ఆసాధనా ప్రణాళిక యింతవరకేమీ కనపడ్డం లేదు. ప్రకాశకులు ధనికులు. అనేక పరికరాలు పుష్కలంగా కలవారు. పైగా సాహసవంతులు. ద్రవ్యం సంపాదించా లనే సంకల్పం యీసందర్భంలో వారికి కల దని మేమే కాదు ఎవ్వరూ చెప్పలేరు; గాని చేసే ఖర్చుకు సద్వినియోగం వుండాలి. ప్రయత్నానికి విశిష్టమైన ప్రాప్యం వుండాలి. కార్యక్రమంలో ఔదార్యమూ, వున్నతాశయమూ వుండాలి. ఇంతవరకూ ప్రకటించబడ్డ నాలుగు సంచికలూ కూడా దీని పేరుకేనా తగినట్టున్నా యని చెప్పలేము.

ప్రకాశకులు సంగతు లన్నీ యోచించి తమ గ్రంథాలలాగే చంద్రికను గూడా రసికసేవ్యంగా వుండేటట్టు చేస్తారని నమ్ముతున్నాము.

# ప్రఖ్యాత ఔషధములు

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | గంధర్వకళ—వీర్యవృద్ధి కలిగించు లేహ్యము | సౌను | 3 | 0 | 0 |
| 2. | మహాసుగంధ్యాదిలేహ్యము—రక్తశుద్ధికి పెట్టినపేరు | ,, | 3 | 0 | 0 |
| 3. | అశ్వగంధాదిలేహ్యము—గొప్పరసాయనము | ,, | 3 | 0 | 0 |
| 4. | నాగరఖండము—అజీర్తికి, శూలలకు చాలమంచిది | ,, | 3 | 0 | 0 |
| 5. | శారిబాద్యాసవము—రక్తశుద్ధికి దివ్యమైనది | ,, | 1 | 8 | 0 |
| 6. | ద్రాక్షారిష్టము—బలకారి, సేదతేర్చును | ,, | 1 | 8 | 0 |
| 7. | చందనాసవము—శుక్లనష్టము కట్టును | ,, | 1 | 8 | 0 |
| 8. | సారస్వతారిష్టము—జ్ఞాపకశక్తి హెచ్చించును | ,, | 1 | 8 | 0 |
| 9. | అశోకారిష్టము—స్త్రీలకు సంజీవి వంటిది | ,, | 1 | 8 | 0 |
| 10. | గంధర్వదంతచూర్ణము—అమోఘముగా పనిచేయును | సీసా | 0 | 4 | 0 |
| 11. | గంధర్వకస్తూరిమాత్రలు—చంటిపిల్లలకు చాలా మంచివి | సీసా | 0 | 8 | 0 |
| 12. | గంధర్వభృంగామలకతైలము—తలంటులకై పుట్టినది | 4 ఔన్సుల సీసా | 0 | 10 | 0 |
| 13. | విరేచనవటి—వికారపెట్టదు | 50 మాత్రల సీసా | 0 | 8 | 0 |
| 14. | సిందూరభూషణము—గర్భవతులకు ఉపయోగకరము | తులం | 2 | 0 | 0 |
| 15. | సూర్యావర్తి—ఛర్ది, వగైరా పైత్యవికారములు తగ్గించును. | ,, | 2 | 0 | 0 |
| 16. | వాతవిధ్వంసి—సూతికలకు అమోఘౌషధము | ,, | 2 | 0 | 0 |
| 17. | అభ్రకభస్మము—నూరు పుటములు పడినది | ,, | 3 | 0 | 0 |
| 18. | ఖర్పరలోహభస్మము—నూరు పుటములు పడినది | ,, | 3 | 0 | 0 |
| 19. | అయస్కాంతభస్మము—చాలా చక్కగా తయారైనది | ,, | 2 | 0 | 0 |
| 20. | వైక్రాంతభస్మము—కఫవ్యాధులకు చాల మంచిది | ,, | 1 | 0 | 0 |
| 21. | వాతగజాంకుశము—అశీతివాతములకు మంచిది | ,, | 0 | 12 | 0 |
| 22. | పైత్యాంతకరసము—జగత్ప్రసిద్ధమైనది | ,, | 0 | 8 | 0 |
| 23. | లఘులక్ష్మీవిలాసరసము—శ్లేష్మఉడుకులకు ప్రత్యేకౌషధము | ,, | 1 | 0 | 0 |
| 24. | లఘుక్రవ్యాదరసము—అజీర్తికి, విరేచనములకు ప్రసిద్ధమైనది | ,, | 1 | 4 | 0 |
| 25. | రజఃప్రవర్తినివటి—ఋతుశూలలకు నమ్మకమైనది | 30 మాత్రలు | 1 | 4 | 0 |
| 26. | మలయచందనము—సెగరోగమునకు కుఠారము | డబ్బి | 2 | 4 | 0 |
| 27. | సుధాసారము—సవామేహమునకు పేరుపొందినది | 30 మాత్రలు | 8 | 0 | 0 |
| 28. | ధాతురంజని—కాముకులకు వరప్రసాదము | 16 మాత్రలు | 1 | 0 | 0 |

కోరువారికి కేటలాగు ఉచితము

## గంధర్వఫార్మసీ—ఇన్నీసుపేట—రాజమండ్రి

Reg. N. M. 3048 PRABUDDHANDHRA

# ఆధునికాంధ్రవాఙ్మయము

మా వద్ద నవీనకవుల గ్రంథాలన్నీ దొరుకును. పోస్టు పాయిదాకు తక్కువగా పుస్తకాలు పంపము. పోస్టుఖర్చులు కొనువారే భరించాలి.

## శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారివి

| | రు. | అ. |
|---|---|---|
| 1 వీరపూజ—చరిత్ర | 1 | [illegible] |
| 2 రక్షాబంధనము—డిటెక్టివ్ నవల | 1 | 8 |
| 3 శ్మశానవాటిక—డిటెక్టివ్ నవల | 1 | 0 |
| 4 మిథునానురాగము—చారిత్రిక నవల | 1 | 0 |
| 5 అనాథబాలిక—సాంసారిక నవల | 0 | 10 |
| 6 వీరకాంత—నాటకము | 0 | 12 |
| 7 విజయనగరరాజులకథలు | 0 | 8 |
| 8 చిత్తూరురాజులకథలు | 0 | 4 |
| 9 ఢిల్లీచక్రవర్తులకథలు | 0 | 4 |
| 10 గోల్కొండనవాబులకథలు | 0 | 2 |
| 11 శృంఖల—విమర్శగ్రంథము | 0 | 12 |

## డా. చిలుకూరి నారాయణరావుగారివి

| | రు. | అ. |
|---|---|---|
| 12 జర్మనీదేశపువిద్యావిధానము | 1 | 0 |
| 13 అంబ—లేక మొండిశిఖండి—నాటకము | 1 | 4 |
| 14 సంస్కృతలోకోక్తులు | 1 | 0 |
| 15 అశ్వత్థామ—అచ్చి—2 నాటకాలు | 0 | 12 |
| 16 అశోకుని ధర్మశాసనములు | 2 | 0 |
| 17 ఉమార్ ఖయ్యామ్—రుబాయత్ | 0 | [illegible] |
| 18 ఉపనిషత్తులు | 0 | 6 |

## చింతా దీక్షితులుగారివి

| | రు. | అ. |
|---|---|---|
| 19 శబరి—కోతి—నాటకము | 1 | 0 |
| 20 ఏకాదశి—11 చిన్నకథలు | 1 | 0 |
| 21 పరిణామవాదము—తన్నిదర్శనములు | 1 | 0 |

## గుడిపాటి వేంకటాచలంగారివి

| | రు. | అ. |
|---|---|---|
| 22 మాకర్మమిట్లా కాలింది | 0 | 12 |
| 23 బిడ్డలశిక్షణ | 0 | 8 |

## బరంపురం కళాప్రచారక సమితివారివి

| | రు. | అ. |
|---|---|---|
| 24 రాయబారము—మొదటిసంపుటము | 1 | 0 |
| 25 తేనెపట్టు—ఖండకావ్యములసంపుటి | 0 | 8 |

## జనమంచి వేంకటరామయ్యగారివి

| | రు. | అ. |
|---|---|---|
| 24 [illegible]కుసుమాంజలి—ఖండకావ్యసంపుటి | 1 | [illegible] |
| 25 మాలతీమాధవము—నాటకము | 0 | 12 |
| 26 రాజశేఖరునివిద్ధసాలభంజిక. నాటకము | 0 | 4 |

## శ్రీపాద కామేశ్వరరావుగారివి

| | | రు. | అ. |
|---|---|---|---|
| 27 చంద్రగుప్త | నాటకము | 1 | 4 |
| 28 భారతరమణి | డిటో | 1 | 0 |
| 29 రాణాప్రతాపసింహ | డిటో | 1 | 4 |
| 30 శివాజీశీలము | డిటో | 1 | 0 |
| 31 లీలావతీసు[illegible] | డిటో | 1 | 0 |
| 32 బిల్వమంగ | డిటో | 1 | 0 |
| 33 శ్రీమాధవాచార్యవిద్యారణ్య | డిటో | 1 | 0 |
| 34 చిత్తవృత్తి | డిటో | 1 | 0 |
| 35 ఒక[illegible] | డిటో | 1 | 0 |
| 36 పునర్వివాహము | డిటో | 1 | 0 |
| 37 [illegible] | డిటో | 1 | 0 |
| 38 సంభాజీనిర్యాణము | డిటో | 1 | 0 |
| 39 కళాపాహాడ్ | డిటో | 1 | 4 |
| 40 సాహిత్యమీమాంస—విమర్శగ్రంథము | | 1 | 8 |
| 41 నాటకవిమర్శ | డిటో | 2 | 0 |
| 42 కొత్తల్లుడు ప్రహసనము | | 0 | 4 |
| 43 పిసినిగొట్టు | డిటో | 0 | 4 |
| 44 జగన్నాథమాహాత్మ్యము—ప్రబంధము | | 0 | 12 |

## నాళం కృష్ణారావుగారివి

| | రు. | అ. |
|---|---|---|
| 45 ముద్దు—ముద్దయిన పద్యాలు | 0 | 3 |
| 46 పైడిలేడి—అపవాదము | 0 | 2 |
| 47 గోగీతము—గోవ్యాఘ్రసంవాదము | 0 | 2 |

వలయువారు, కలాభివర్ధని పరిషత్తు, కలబరగి వారి యింట్లో, ఇన్నిసుపేట రాజమండ్రి అని వ్రాసికోవాలి

రాజమండ్రి: శ్రీ అద్దేపల్లి లక్ష్మణస్వామినాయుడుగారి సరస్వతీ పవర్ ప్రెస్ నందు ముద్రింపబడి,
శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారిచే ప్రకటింపబడియె. 8761 1934